

# మెట్రో కథలు



# అమ్మమ్మ

**మొదట బోలుగా శబ్దం మొదలయ్యి తర్వాత వదులుగా ఆ తర్వాత బరువుగా కొనసాగింది. నీళ్లు వస్తున్నాయి. తన నిమిత్తం లేకుండా బకెట్ వాటిని నింపుకుంటూ ఉంది.**

సరిగ్గా పదడుగుల దూరంలో ఉన్న త్రీ బై సిక్స్ కాట్ మీద ఆమె కొంచెం కదిలింది. నిన్న రాత్రి నుంచి నీళ్ల లేవు. కూతురు తెలివైనది. కొంచెం ఊహించి ఒకటి రెండు బకెట్లు ముందే నింపి పెట్టుకుంది. తెల్లారి అవే అక్కరకొచ్చాయి. ఏదో ముక్కూ మూతీ కడుక్కున్నాం అనిపించి కూతురు, అల్లుడు, వారి కంటే ముందే అప్పర్ కేజీ చదువుతున్న మనవరాలు వెళ్లిపోయారు. కొంచెం ఎంగిలి పడి, అంటే ఏం లేదు, కాసింత రాగిజావ గొంతులో పోసుకొని ఇప్పుడే అలా మంచం మీద వాలింది. ఇంతలోనే ఈ అంతరాయం.

చప్పుడు వింటూ ఉంది. అది రానురాను దగ్గరపడుతూ రొద మార్చుకుంటూ బకెట్ నిండబోతోందనే సంకేతాన్ని ఇస్తూ ఉంది. ఇప్పుడు లేవాలి. కాళ్లు కాళ్లుగా మిగిలి చాలా కాలం అయ్యింది. కీళ్లనొప్పులు. సుగర్ ఒకటి. ఈ మధ్య తల తిరిగిపోతుంటే స్పాండిలోసిస్ అన్నారు. భర్త బతికినంతకాలం మంగళసూత్రం ఉండింది. ఇప్పుడు మెడపట్టి.

మెల్లగా లేచి కూచుంది.

నిజానికి ఇది కొంచెం సులువైన పనే. అలా కొద్దిగా నడుచుకుంటూ వెళ్లి చేత్తో తిప్పేస్తే ట్యాప్ బంద్. కాని మధ్యాహ్నం అంత సులభం కాదు. మూడింటికల్లా మనవరాలు స్కూల్ నుంచి వస్తుంది. వచ్చినప్పటి నుంచి ఆగకుండా ఉంటుంది. ఫస్ట్‌ఫ్లోర్‌కి పోతుంది. సెకండ్ ఫ్లోర్‌కి పోతుంది. లేదంటే థర్డ్‌ఫ్లోర్‌కు దిగేస్తుంది. వెనుక పరిగెత్తలేదు. పట్టుకోలేదు. కుదురుగా కూచోబెడితే వీపు తిప్పే లోపల టీవీ బల్ల ఎక్కేస్తుంది. అదిలిస్తున్నా వినకుండా నీళ్లు కింద పోసేస్తుంది. సోఫా మీద నుంచి మంచం మీద దుముకుతూ తల ఎక్కడ పగలగొట్టుకుంటుందో అని అదో భయం. ఆరుకో ఏడుకో కూతురు వచ్చేదాకా ఇదే కష్టం.

కాని జీవితంలో ఈ మాత్రం కష్టమైనా ఉన్నందుకు ఆమెకు అప్పుడప్పుడు సంతోషంగా ఉంటుంది. పాపకు కష్టమవుతుందమ్మా అని కూతురు అనకపోతే- పాపను చూసుకుంటున్నానన్న తృప్తితో తానిక్కడ ఉండకపోతే- ఎక్కడికి పోయేటట్టు? కొడుకు అత్తాపూర్‌లో ఉంటాడు. అక్కడి నుంచి మణికొండ షిఫ్ట్ అవుతాడట. పిల్లలు పెద్దవాళ్లు. ఇంత పెద్ద నగరంలో వాళ్ల అవసరాల కోసమని కోడలు కూడా ఏదో ఒక పని చేయక తప్పదు. అందరూ వెళ్లాక ఇంట్లో మీరొక్కరే బోరైపోతారత్తయ్యా అంటుంది కోడలు. అదీ నిజమే.

కాని ఈ మధ్య ఆమెకు చిన్న గిల్ట్ వచ్చింది. స్కూల్ ఉన్నన్ని రోజులు మనవరాలిని చూసుకుంటుంది. కనుక ఇక్కడ ఉండొచ్చు. ఈ ఇంటి తిండి తినొచ్చు. కాని రెండు నెలలు వేసవి సెలవులొచ్చాయి. అప్పుడు కూడా కదలక మెదలక తిని కూచుంటూ ఉంటే అల్లుడేమనుకుంటాడు?

కొడుకును అడగాలా?

ఎక్కడా... తీసుకెళ్లాలనే ఉంది... పిల్లలకు ఎగ్జాములు, కోచింగులు, ఎంట్రన్స్‌లు... మా ముఖాలను చూస్తేనే డిస్టర్బెన్స్ ఫీలవుతున్నారు... మిమ్మల్ని కూడా తీసుకొచ్చి ఇబ్బంది పెట్టడం ఎందుకా అని... అంటుంది కోడలు. ఆ మాటా నిజమే.

బెజవాడలో ఉండగా లంకంత సంసారాన్ని ఈదింది. వచ్చే కాలూ వెళ్లే కాలూ. ప్రతి ఒక్కరికీ ఏదో ఒకటి పెట్టకపోయినా వారందరితో మనసు పెట్టి మాట్లాడేది. ఆ మాట కోసం వచ్చేవాళ్లు. మొన్న- ఎస్.ఎం.ఎస్ చూడటం నేర్చుకోమ్మా అన్నాడు కొడుకు. హడలిపోయింది. వాడు బాగా బిజీ. అయినప్పటికీ అతి కష్టం మీద వారం పది రోజులకు ఒకసారైనా గుర్తు పెట్టుకొని మాట్లాడతాడు. ఎస్.ఎం.ఎస్ చూడటం నేర్చుకుంటే బిజీలో ఉంటూ మెసేజ్‌లతోనే మాట్లాడేస్తాడా అని భయం. ఈ వయసులో ఎందుకులేరా అని తప్పించేసింది.

బకెట్ నిండింది.

లేచి ట్యాప్ కట్టేసి మెల్లగా వచ్చి కూచుంది.

చుట్టూ చూసింది.

టూ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లో మంచం పట్టేంత స్థలం! అది మాత్రమే తనది. తక్కిన స్థలంలో ఒక గది బెడ్‌రూమ్‌కి, ఒక గది అల్లుడి కంప్యూటర్‌కి, కాగితాలకి, స్నేహితులెవరైనా వస్తే కాలక్షేపానికి.

ఈ మధ్య తనకో గది ఉంటే బాగుండు అనిపిస్తూ ఉంది. తన వస్తువులు, బ్యాగులు, బట్టలు, ఆల్బమ్‌లు... అల్లుడు ఫ్రిజ్ తెరిస్తే తన ఇన్సులిన్ బాటిళ్లు కనిపించడం ఆమెకు ఇబ్బందిగా ఉంది. స్టూల్ సాఫ్టెన్ కోసం ఈ మధ్య డాక్టరు క్రిమాఫిన్ రిఫర్ చేశాడు. ఆ బాటిల్ బయట కనిపించడమూ ఇబ్బందే. ఆ మాటకొస్తే కొడుకు దగ్గరకు వెళ్లినా తనకో గది దొరికే వీలు లేదు. అక్కడనే ఏముంది, గమనించింది కదా, చాలా ఫ్లాట్లలో పెద్దాళ్లకు ఒకటే స్థలం. హాలు. అక్కడే ఉండాలి. అక్కడే పడుకోవాలి. కామన్ టాయిలెట్ వాడుకోవాలి.

సాయంత్రం ఐదూ ఆరు మధ్యన బయట కారిడార్‌లో నిలబడితే అన్ని ఫ్లోర్లలో తనలాంటి ఇద్దరు ముగ్గురు గాలి పీల్చుకోవడానికా అన్నట్టు బయట నిలుచుని కనిపిస్తారు. జుట్టు తెల్లబడి, చర్మం వదులయ్యి, వెన్ను తేలి.... ఎవరూ మాట్లాడుకోరు. ఏం మాట్లాడుకోవాలి గనక?

మనవరాలు వచ్చింది. సంతోషం, కంగారు తెచ్చింది. ఆకలిగా ఉంది అనంటే దాని నోటికి ఏదైనా పెడుతున్న ఆ కాసిన్ని క్షణాలు అమృతంలా అనిపించాయి. ఆ తర్వాత కూతురు వచ్చేంత వరకూ దాని అల్లరిని ఎలా ఉగ్గబట్టి భరించిందో ఏమో. కూతురు వచ్చాక అమ్మయ్య కాసేపు కబుర్లు చెప్పొచ్చు అనుకుంది. కాని ఇవాళ దాని మూడ్ బాగలేదు. రావడం రావడం బ్యాగ్ పడేసి చర్రుబుర్రు మంటోంది. ఈ టైమ్‌లో ఏం మాట్లాడితే ఏం గొడవో. గప్‌చిప్‌గా ఊరుకుంది.

రాత్రయ్యింది. అదైతే ఆమెకు చాలా భయంగా అనిపిస్తుంది. కాళ్లు పీకుతాయి. కళ్లు గుంజుతాయి. నిద్ర పట్టదు. ఏవేవో జ్ఞాపకాలు వస్తాయి. నిద్ర మాత్రలు మంచివి కాదు.

ఏ ఆలోచనా లేకుండా పడుకోవే అదే వస్తుంది అంటుంది కూతురు.

ఏ ఆలోచనా లేకుండానా?

తండ్రి గుర్తొచ్చాడు. అరవై ఏళ్లు వచ్చినా ఎనిమిది తర్వాత బజారులో ఉండేవాడు కాదు. అబ్బీ అని తల్లి పిలిచిందంటే వస్తున్నా అమ్మా అని పరిగెత్తుకుంటూ వెళ్లి మంచం దగ్గర నిలబడేవాడు. ఆయన తినడం కళ్లతో చూసుకున్నాకే ఆమె తినేది. ఆ తర్వాత హాయిగా నిద్ర పోయేది.

రాత్రి టైమ్ ఎంతయ్యిందో తెలియడం లేదు. నిద్ర పట్టడం లేదు. ఈ ఫ్లాట్‌కు గాలి, వెలుతురు తక్కువ. పగలైనా రాత్రయినా హాలు చీకటిగా, ఉక్కగా ఉంటుంది. ఫ్యాను వేసినా అంతే. పూజలు, మంత్రాలు... వీటికి సమయమే లేనట్టుగా జీవితం గడిచిపోయింది. ఇప్పుడు కొత్తగా దేవుణ్ణి తలుచుకోవడం చేతకావడం లేదు. దూరంగా రోడ్డు మీద ట్రక్కులు తిరుగుతున్న చప్పుడు వింటూ కళ్లు మూసుకుని అటూ ఇటూ మసలుతూ ఉండిపోయింది.

తెల్లవారింది.

మొదట మనవరాలు వెళ్లిపోయింది. అల్లుడు టూవీలర్ ఎక్కి ఆఫీస్‌కు పరుగు తీశాడు. కూతురు మంచం దగ్గర నిలబడి గబగబా ఏవో జాగ్రత్తలు, వంటింటి పురమాయింపులు చేసి లిఫ్ట్ కోసం కూడా ఆగకుండా మెట్లు దిగిపోయింది.

తొమ్మిది దాటి పది అయ్యింది.

బాత్‌రూమ్‌లో పెద్ద చప్పుడుతో ట్యాప్ మొదలయ్యింది.

తన నిమిత్తం లేకుండా నీళ్లు నింపుకుంటున్న బకెట్ అంతకు పది అడుగుల దూరంలో ఉన్న మంచం మీద ఆమె కదలిక కోసం ఎదురు చూస్తూ ఉంది.

**- మహమ్మద్ ఖదీర్‌బాబు**

# సెల్ఫీ...






**భర్త తాకడం మానేసి చాలా రోజులైన ఆ అవయవాన్ని డాక్టర్ తాకాడు. ఒక నిమిషం... రెండు నిమిషాలు... ఆమె కలతగా అతడివైపే చూస్తూ ఉంది.**

పరీక్ష ముగించి, కుర్చీలో కూచుని, హ్యాండ్ శానిటైజర్ రెండు చుక్కలు పిండుకుని, అది తడి ఆరుతుండగా చేతులు రుద్దుకుంటూ చెప్పాడు.

లింఫ్ ఉంది. ఫిఫ్టీ ఫిఫ్టీ చాన్సెస్. చూద్దాం. బయాప్సీలో తేలిపోతుంది.

ఆమెకు ఏడుపు రాబోయింది. కాని మరీ చిన్నపిల్లలా ఉంటుందని తమాయించుకుంది. అతడది గమనించి ఊరుకోబెట్టడానికా అన్నట్టు మాట్లాడాడు.

కంగారు పడకండి... ఈకాలంలో ఇది ఫీవర్‌తో సమానం... బయట చూశ్లేదా ఎంతమంది ఉన్నారో... వాళ్లంతా హ్యాపీగా లేరూ?

ఉన్నారా? అపాయింట్‌మెంట్ తీసుకుని వెయిట్ చేస్తూ గమనించింది. అందరూ ఆడవాళ్లు. రకరకాల వయసుల్లో. రకరకాల ముఖాలతో. రకరకాల దిగుళ్లతో. వరుసగా కూచుని. బహుశా రీచెకప్ కోసం వచ్చినట్టున్నారు. అందరూ ఒక గుండె మనుషులే. కొందరికి ఎడమ వైపు తీసేశారు. కొందరికి కుడివైపు. తనకు కుడివక్షంలోనే లింఫ్ ఉంది. అంటే?...

బయాప్సీ రిపోర్టుకు ఎన్నిరోజులు పడుతుంది డాక్టర్?

మాగ్జిమమ్ ఒన్ వీక్.

తన వల్ల కాదు. ఆ రిపోర్ట్ వచ్చే దాకా పాజిటివ్ వస్తుందా నెగిటివ్ వస్తుందా అని టెన్షన్‌తో చచ్చిపోతుంది. అసలే ఈ మధ్య బి.పి. కనిపిస్తోంది. టాబ్లెట్ మొదలెట్టినా ఒక్కోసారి కంట్రోల్ కావడం లేదు.

మీ హజ్బెండ్‌ని తీసుకురండి. డీటైల్‌గా మాట్లాడతాను.

తను ఇక్కడ ఉండరు డాక్టర్. బెంగుళూరులో ఉంటారు.

ఓ... మరి మీరు?

నేను సెక్రటేరియేట్‌లో జాబ్ చేస్తాను.

అతడు తల ఊపుతూ, ప్రిస్కిప్షన్ ప్యాడ్ లాక్కుని, నెక్స్ట్ అపాయింట్‌మెంట్ డేట్ వేసి, తర్వాతి పేషంట్ కోసం బజర్ నొక్కుతుండగా థ్యాంక్స్ చెబుతూ బయటకు వచ్చేసింది.

అప్పటికే టైమ్ ఏడయ్యింది. ఇంట్లో పనిపిల్ల ఉంటుంది కాబట్టి టెన్షన్ లేదు. అయినా మనసు ఆగక ఫోన్ చేస్తే పెద్దది ఎత్తింది. ఫ్రిజ్‌లో ఉన్న ఐస్‌క్రీమ్ తీసుకుని తింటోందట. తర్వాత ట్రాపికానా తాగుతుందట. మరి బుజ్జిదానికి పెట్టావటే అంటే నిన్న పెట్టానుగా అంది. ఎందుకనో కూతురి గొంతు విన్నాక ఫోన్ కట్ చేసి చాలాసేపు ఆగకుండా ఏడ్చింది.

దాపునే టి.ఆర్.ఎస్ ఆఫీస్ ఉంది. అది దాటి ముందుకెళితే కె.బి.ఆర్ పార్క్. ఇప్పుడు గేట్లు మూసేసినా ఔటర్ సర్కిల్‌లో కాసేపు వాక్ చేయవచ్చు. కారు తీసుకుని నెమ్మదిగా డ్రైవ్ చేసుకుంటూ నాలుగైదు నిమిషాల్లో చేరుకుంది. చాలాకార్లు పార్క్ చేసి ఉన్నాయి. వెలుతురు తక్కువగా ఉన్న చోట ఆపి, ఇంజన్ ఆఫ్ చేయకుండా, ఏ.సి రన్ చేస్తూ అలాగే కూచుంది.

ఏం చేయాలి?

తల ఒంచి చూసుకుంది. ఇద్దరు పిల్లలకూ పనికి రాని వక్షాలు. రెండు కాన్పుల్లోనూ పాలు పడలేదు. పోనీలే భర్తకైనా అనుకుంది. భర్తకైనా?... పెళ్లయ్యిందీ తెలియలేదు. ఇద్దరు పిల్లలు పుట్టిందీ తెలియలేదు. అటు వైపు బాధ్యతలు. ఇటువైపు బాదరబందీలు. ఇద్దరినీ తరుముతూనే ఉండి పోయాయి. కొంత స్థిమిత పడుతుండగా ఇంకేముందిలే బాగుపడినట్టే అనుకుంటూ ఉండగా ఇక్కడ ఐ.టి. ఇండస్ట్రీ పడి పోయింది. అతడు బెంగుళూరు వెళ్లిపోయాడు. ఒక సంవత్సరం. రెండు సంవత్సరాలు. మూడు సంవత్సరాలు. పిల్లలతో ఒక్కదాన్నే ఉండలేకపోతున్నాను.. వచ్చేస్తాను అనంటే గవర్నమెంట్ జాబ్ వదులుకుంటావా అన్నాడు. పోనీ నువ్వే వచ్చెయ్ అంటే కెరీర్ పోగొట్టుకోమంటావా అని బెంగపడ్డాడు. ఉండొచ్చు... భార్య ఒకచోట భర్త ఒకచోట ఉండొచ్చు... కాని భార్యాభర్తలుగా ఉండి ఉంటే.

కొత్తల్లో ప్రతి వీకెండ్‌కు వచ్చేవాడు. తర్వాత అది రెండువారాలకొకసారి అయ్యింది. ఆపై నెలకోసారి. ఇప్పుడు రెండు నెల్లకు. కొత్తల్లో ఇష్టం ఉండేది. తర్వాత బాధ్యత ఉండేది. ఆ తర్వాత కనీస పలకరింపు ఉండేది. ఇప్పుడు ఇంటికొస్తే చాలాసేపు నిద్ర పోతూ ఉంటాడు. లేదంటే పిల్లలతో ఆడుకుంటూ. ప్రేమించానని వెంటపడి మరీ చేసుకున్నాడే. ఆ ప్రేమంతా ఎటు పోయిందా అని? ఇంట్లో ఉన్న ఒక వస్తువు పాటి చేయదా తాను?

ఎందుకో ఆమెకు ఎప్పుడూ రాని ఆలోచన వచ్చింది. కారులోని ఇంటీరియర్ లైట్‌ని ఆన్ చేసింది. చున్నీ పక్కన పెట్టింది. కేవలం వక్షాన్ని మాత్రమే ఫోకస్ చేస్తూ సెల్ఫీ తీసి భర్తకు వాట్సప్‌లో పంపింది. పంపే ముందు తీసిన ఫోటోని పరీక్షగా చూసుకుంది. ఇప్పుడు ఈ రెంటిలో ఒకటి ఉండదా? కుడివైపు డొల్లగా అయిపోతుందా. లేదంటే అట్టముక్కలాగా ఫ్లాట్‌గా. బ్లౌజ్ నిలుస్తుందా? స్త్రీగా మిగులుతుందా? ఆమె చేయి అప్రయత్నంగా కుడివక్షం మీద పడింది. ప్లీజ్ డోన్ట్ గో అవే... డు నాట్ లీవ్ మీ... ఎవరూ వినకుండా లోలోపల లక్షసార్లు అనుకుంది. కళ్లు కారిపోతున్నాయి. వక్షం తడిసిపోతూ ఉంది.

ఫోన్ మోగింది. భర్త.

ఆ సెల్ఫీ ఏంటి?

పెద్దగా నవ్వినట్టు నటించింది.

వచ్చేవారం మన పెళ్లి రోజు.... మర్చిపోకయ్యా మగడా అనీ...

రా(త్రా)ను నీ అల్లరి ఎక్కువై పోతోంది.

పెట్టేశాడు.

కాని ఆమెకు తెలుస్తూ ఉంది. రెండే నిమిషాలు గడిచాయి. మళ్లీ ఫోన్ మోగింది. భర్త. పసి గట్టేశాడు. ఎందుకు పసి గట్టడు? ఎప్పుడో ఒకసారన్నా అతడు తనను ప్రేమించాడు. ఎత్తింది.

ఏం జరిగింది?

మాట్లాడలేదు. ఏడుపు తన్నుకు వస్తోంది. కాని నిర్లిప్తంగా జవాబు చెప్పింది.

కేన్సర్ కావచ్చు.

అతడు ఫోన్ పట్టుకుని అవతలివైపు అలాగే ఉండిపోయాడు. ఆమే త్వరగా అందుకుంది.

అంత కంగారు పడకు. ఇదంతా చాలా మామూలేనట. ఒకరోజు సర్జరీ. రెండ్రోజులు హాస్పిటల్. అంతే. తర్వాత మన పనులు మనం చేసుకోవచ్చు. ఉద్యోగానికి పోవచ్చు...

ఎ...ఎ... ఎందుకొచ్చింది?

ఈసారి నిజంగానే నవ్వింది.

ఏమో... నాకేం తెలుసు?

కొంచెం వ్యవధి ఇచ్చి అంది.

నువ్వెప్పుడైనా నాతో మాట్లాడుతూ ఉంటే వచ్చి ఉండేది కాదేమో. నన్ను దగ్గరకు తీసుకుని ఉంటే వచ్చి ఉండేది కాదేమో. ముద్దు పెట్టినా వచ్చేది కాదనుకుంటా.

నే..నేను.. వస్తున్నాను.

వద్దు. నేను చేయించుకోగలను. ఈ మాత్రం దానికి నువ్వు లీవులు అవీ వేస్ట్ చేసుకోవద్దు.

నువ్వు సరిగ్గా వినలేదు. వస్తున్నాను కాదు. వచ్చేస్తున్నాను. ఫరెవర్.

వద్దు.

ఏంటి నువ్వు చెప్పేది?

వద్దన్నానా? పెద్దగా అరిచింది.

అతడు ఏడవడం మొదలుపెట్టాడు.

చాలాసేపు ఏడవనిచ్చి అంది.


ఇంక చాల్లే. ఏడవకు. అయినా నిన్ను పొందాలంటే నేను ఏదైనా కోల్పోవాలా?

అతడు ఏడుస్తూనే ఉన్నాడు.

**- మహమ్మద్ ఖదీర్‌బాబు**

# రొటీన్...

## మెట్రో కథలు



నిన్నటి వరకూ ఆమె రొటీన్‌లో మార్పు లేదు.

ఉదయాన్నే ఐదుంపావుకు సరిగ్గా ఎవరో తట్టి లేపినట్టుగా లేచి కూచుంటుంది. మరో నాలుగైదు నిమిషాల్లో టీ పెట్టుకుని బాల్కనీలో– అక్కడ కూచుంటే కింద నుంచి బాగా ఆకులేసిన బొప్పాయి చెట్టు కనిపిస్తుంది– దానిని చూస్తూ కూచుంటుంది. ఐదున్నర నుంచి ఆరువరకు ప్రాణాయామం. ఆరుకు పాపను లేపిందంటే, దానికి బ్రష్ చేయించి, బ్రేక్‌ఫాస్ట్ పెట్టి, మళ్లీ స్నాక్స్ కోసం కాసింత న్యూటెల్లా రాసిన బ్రెడ్ ముక్కలు డబ్బాలో కూరి, యూనిఫామ్ తొడిగి, ఏడున్నరకు బస్ ఎక్కించేదాకా తీరదు. ఆ తర్వాత ట్రాక్ ప్యాంట్ వేసుకొని పైన టీషర్ట్ లాక్కుని లిఫ్ట్‌లో కిందకు దిగి అలా హైటెక్ సిటీ వరకు సైక్లింగ్‌కు బయలు దేరిందంటే ఎనిమిదిన్నర వరకూ అది తన టైమ్. పదిన్నరకు ఆఫీస్. సాయంత్రం నాలుక్కి పాప వచ్చే సమయానికి ఇల్లు.

కాస్త డబ్బు ఎక్కువే అయినా జె.ఎస్.టి.యులో ఈ గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్ కొనుక్కున్నప్పటి నుంచి ఆమెకు స్థిమితంగా ఉంది. కొత్త కన్‌స్ట్రక్షన్. మంచి అమినిటీస్. ఒక గడపకూ మరో గడపకూ సంబంధం లేనట్టుగా ప్రైవసీ. అందరికీ ఐ.డి. కార్డ్స్. అవి చూపితే తప్ప ఎంట్రీ ఇవ్వని సెక్యూరిటీ... చెప్పాలంటే ఇక్కడికొచ్చాక భర్తే కాపాడాలి అనే భయం దాదాపు పోయింది.

త్రీ బెడ్‌రూమ్స్ ఉన్న ఆ ఫ్లాట్‌లో ఒక బెడ్‌రూమ్‌లో భర్త ఉంటున్నాడు. ఆరు నెల్ల క్రితం ఒకరోజు నేను ఆ రూమ్‌లో పడుకుంటాను అన్నాడు. పడుకో అంది. అంతే. వాదన పెట్టుకోలేదు. అతడి కోసం ఆమె చాలా మారింది. ఇది కూడా పెద్ద మార్పే. కొత్తల్లో పెద్ద పెద్దగా వాదనకు దిగేది. ఇప్పుడు ఏ విషయాన్నైనా చిన్న గొంతుతో అంతే తీవ్రంగా చెప్పడం నేర్చుకుంది.

చిన్నప్పటి నుంచి రెండు వదలొద్దనుకుంది. ఒకటి సైక్లింగ్. రెండు ఉద్యోగం. రెంటినీ వాళ్లూ వీళ్లూ వద్దన్నా తండ్రి లెక్క చేయలేదు. భర్త లెక్క జేస్తాడని అనుకోలేదు. ఉద్యోగం చేసే అమ్మాయి వద్దు అని ముందే చెప్పేయాల్సింది. కాని చెప్పలేదు. చేసుకున్నాడు. చక్కగా ఉద్యోగం చేస్తుంది. చక్కగా ఇల్లు చూసుకుంటుంది. చక్కగా పాపనూ. చక్కగా మొగుణ్ణీ. అయినా చాల్లేదు.

ఇంట్లో ఫోన్లు తగ్గించు అన్నాడు ఒకరోజు.

మగాళ్లతో మాటలు తగ్గించు అన్నాడు ఇంకోరోజు.

క్యాంపులు తగ్గిస్తే మంచిది అని మరో రోజు.

ఉదయం వెళ్లి సాయంత్రానికి ఇళ్లకు చేరే ఆడవాళ్లంటే భయం ఉండదు చాలామందికి. కాని ఆఫీస్ పని మీద ఒక్కరోజైనా సరే ఊరెళ్లొచ్చే ఆడవాళ్లంటే మాత్రం భయం. ఏం... చేయాలంటే అక్కడే చేయలా? ఇక్కడ చేయకూడదా?

సరే ఎందుకొచ్చిన గొడవ అని క్యాంపులు డ్రాప్ చేసింది. అతడు చూస్తుండగా ఫోన్లూ మానేసింది. నిజానికి తన టాలెంట్‌కు ఎక్కడో ఉండాలి. కుటుంబం కోసం కుదించుకుంది.

తృప్తి లేదు.

ఏం చేయాలి? చూడ్డానికి బావుంటుంది. నవ్వితే బాగుంటుంది.

ఇదంతా నీ కోసమే. సత్యంగా నీ కోసమే.

ఊహూ. నమ్మకం లేదు.

పెళ్లయినప్పటి నుంచి గమనిస్తోంది. ఎప్పుడు పక్కన పడుకున్నా మధ్యలో వేరెవరో వచ్చి పడుకోవాలి అన్నట్టుగా ఎడం ఇచ్చి పడుకుంటాడు. అసలు ఎప్పుడైనా సంపూర్ణంగా హృదయంలోకి తీసుకున్నాడా అని. పెళ్లికి ముందు, తర్వాత ఎంతో హుషారుగా, దుముకుతున్నట్టుగా ఉండేది. తను స్తబ్దుగా అయ్యే కొద్దీ తానూ స్తబ్దుగా అయిపోతూ వచ్చింది. ఆ రూపూ.. ఆ ఆకారం..

మొన్నొకరోజు కలీగ్ బలవంతంగా కళ్లజోడు తీయించింది.

చూడు. కళ్ల కింద ఎంతెంత పెద్ద చారలు ఉన్నాయో. నువ్వు సంతోషంగా లేవు కదూ.

ఏం చెబుతుంది?

ఇంకెవరో బంధువు అసలు గుర్తు పట్టనే లేదు. చాలా పొడవైన జుట్టు ఉండేది తనకు. పూర్తిగా బాయిష్ లుక్‌లో హెయిర్ కట్ చేయించుకుంది. చీరలు, చుడీదార్లు.... చాలా బాగుంటాయి. పూర్తిగా మానేసి ప్యాంట్ షర్ట్స్‌లో దిగిపోయింది. లిప్‌స్టిక్... కాటుక... వద్దనే వద్దు.

నాకు పని చేయడం ముఖ్యం... బయటి ప్రపంచానికి నేను మగాడి కిందే లెక్క... వేరే ఏ బేరాల్లోనూ ఇంట్రెస్టు లేదు.... హ్యాపీగా ఉందా...

ఊహూ. దిలాసా లేదు.

ఇంకా ఏం చేస్తే మారుతాడా అని ఆలోచించి ఆలోచించి, తన ఎద ఎత్తుగా ఉంటుంది, సర్జరీ చేయించి అణిచేద్దామా అని డాక్టర్ దగ్గరకు వెళితే మీ మైండ్ ఖరాబ్ అయ్యింది వెళ్లండి అని పంపించేశాడు. డాక్టర్‌కు ఏం తెలుసు? ఈ ఖరాబును తాను భరించగలదు. కాని ఇతడి కోసం పని మానేసి ఇంట్లో కూచుంటే పూర్తిగా పిచ్చిదైపోతుంది. అయినా ఎందుకు మానేయాలి? ఆడవాళ్లు పనికే కదా పోతున్నారు. ఊళ్లోవాళ్లకి పైట జార్చడానికి పోతున్నారా?

ఈ ఫ్లాట్ కొనకముందు ఏదో ఇన్వెస్ట్‌మెంట్ కోసం డబ్బు అడిగాడు.

తాను అక్కర్లేనప్పుడు తన డబ్బు మాత్రం ఎందుకు?

ఇవ్వను అంది. మనసులో పెట్టుకున్నాడు.

ఆ తర్వాత ఈ ఫ్లాట్ కొంటుంటే వాళ్లూ వీళ్లూ జాయింట్ రిజిస్ట్రేషన్ చేయించుకోమని సలహా ఇచ్చారు. వద్దని తన పేరు మీదే చేయించుకుంది. ఇప్పుడు తనకో ఇల్లుంది. కూతురుంది. ఉద్యోగం ఉంది. మొగుడు కూడా ఉంటే ఉంటాడు. నిన్న రాత్రి అదీ తేలిపోయింది.

డైనింగ్ టేబుల్ మీద భోం చేస్తుంటే– ఇలాగైతే ఉండను. వెళ్లిపోతాను అన్నాడు.

దూరంగా పాప పెద్ద సౌండ్‌తో టీవీ చూస్తోంది. వాలకం చూస్తే గొడవ జరిగేలా ఉంది. పెద్ద గొడవ జరిగినా చిన్న గొడవ జరిగినా ఫలితం మాత్రం తాను ముందే నిశ్చయించుకుని ఉంది. అందుకని గొంతు పెంచకుండా మెల్లగా తీవ్రంగానే అంది.

ఇంకొక్క మాట మాట్లాడావంటే పళ్లు రాలిపోతాయి. మర్యాదగా ఇంట్లో నుంచి బయటకు నడు. మళ్లీ వచ్చావంటే కాళ్లు విరగ్గొడతా.

ఆ... అని ముందుకు ఉన్నవాడల్లా కుర్చీలో వెనక్కు వాలి నోరెళ్లబెట్టాడు.

పాపను తీసుకుని బెడ్‌రూమ్‌లోకి వెళ్లిపోయింది. మరో అరగంటకు ఏం ప్యాక్ చేసుకున్నాడో పాడో వెళ్లిపోయాడు.

తెల్లారింది. మెలకువ వచ్చింది. బొప్పాయి చెట్టును చూస్తూ టీ తాగడం పూర్తయ్యింది. పాప స్కూలుకు కూడా వెళ్లిపోయింది. ఏం కొంప మునిగిపోలేదు. నిన్న గడిచినట్టే ఇవాళ కూడా గడుస్తుంది.


టైమ్ చూసుకుంది. ట్రాక్ ప్యాంట్ వేసుకుంది. టీషర్ట్ లాక్కుని కిందకు దిగి సైకిల్‌తో రోడ్డు మీదకు వచ్చాక ఒక క్షణం అనిపించింది. రేపతను మళ్లీ రావచ్చు. కాళ్లబేరం చేసుకోవచ్చు. తాను దయతలిచి ఇంట్లోకి అడుగు పెట్టనివ్వొచ్చు. కాని ఈ రొటీన్‌లో మాత్రం తేడా ఉండకూడదు. అయితే ఒక్కటి మాత్రం తేడా పాటించాలనుకుంటోంది.

ఇక మీదట జుట్టు పొడుగ్గా పెంచాలనుకుంటోంది.

ఏం... ముచ్చటగా చీర కట్టుకుని ఆఫీసుకు వెళ్లకూడదా?

– మహమ్మద్ ఖదీర్‌బాబు

మెట్రో కథలు



# డిస్టెన్స్

బాస్ పిలిస్తే లోపలికెళ్లి బయటకు వచ్చాక మళ్లీ ఒకసారి కాల్ చేసి చూశాడు.

స్విచ్‌డ్ ఆఫ్ వస్తోంది.

సీట్‌లో కూచుని సెల్ వైపు చూసుకుంటూ తిరిగి కాల్ చేశాడు.

స్విచ్‌డ్ ఆఫే.

టైమ్ పదకొండు అవుతోంది. సాయంత్రం ఆరుకు ఆఫీస్ అయిపోతే ఏడుకు ఇల్లు చేరేదాకా ఈ నరకం తప్పదు.

ఉదయం బయలుదేరే ముందు చిన్నగా మాటా మాటా పెరిగింది.

సాయంత్రం వచ్చి తీసుకెళతారుగా అంది.

చూద్దాం అన్నాడు.

చూద్దాం ఏంటి? రెట్టించింది.

చెప్తానన్నాగా. నువ్వు రెడీ అయి కూచుని నా ప్రాణం తీయకు.

ఆ మాట చెప్పి టూ వీలర్ ఎక్కి ఆఫీసుకు వచ్చేశాడు. అయితే అలా టూ వీలర్ ఎక్కి ఆఫీసుకు వచ్చేయడం అంత సులభం కాదు. ఏ రోజూ సులభం అవగా చూళ్లేదు. ట్రాఫిక్ ఉంటుంది. సిగ్నల్స్ దగ్గర చాలాసేపు వెయిటింగ్ ఉంటుంది. మధ్యలో పోలీసులు ఎందుకాపేస్తారో తెలియదు, పదీ పదిహేను నిమిషాలు అందరినీ ఆపేసి ఎవరికో దారి వదులుతారు. బాగా నిండిన మురుగు కాలువ అతి మెల్లగా కదిలినట్టు ఒక్కోసారి ఎంత విశాలమైన రోడ్డైనా బండ్లతో నిండిపోయి నల్లటి పొగ వదులుతూ అడుగులో అడుగు వేస్తూ ముందుకు కదులుతుంటుంది. ఓ కారు దాదాపు డ్యాష్ ఇస్తూ ముందుకుపోతుంది. యూ టర్న్ దగ్గర ఎవడిదో బైక్ మీదమీదకు వచ్చేస్తుంది. చాలా అదృష్టం కలిసి రావాలి. ఆఫీసుకు అప్పుడు చేరాలి.

ఎవరో ఒకరు సెక్షన్‌లోనో క్యాంటీన్‌లోనో స్మోక్‌రూమ్‌లోనో మరొకరిని అడుగుతుంటారు– ఎక్కడ ఉంటున్నావ్?

ఏదో ఒక ఏరియా చెప్తారు.

అక్కడా? అంత దూరమా?

అబ్బే... ఏం దూరం... అరౌండ్ ఫిఫ్టీన్.

ఈ అరౌండ్ అనే మాటకు ఎవరి లెక్క వారికుంటుంది. అదనం రెండు కిలోమీటర్లు కావచ్చు. అదనం ఐదు కిలోమీటర్లు కావచ్చు. అదనం పది కిలోమీటర్లు కూడా కావచ్చు. పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్నా అరౌండ్ ఫిఫ్టీన్ అనే చెప్తారు.

మరేం చేస్తారు? మంచి ఆఫీసే. చెప్పుకోదగ్గ జీతం అంటే పద్దెనిమిది నుంచి పాతికవేల వరకూ ఉంటుంది. ప్రతి నెలా పదో తేదీకల్లా ఇచ్చేస్తారు. ఒకవేళ పది ఆదివారం అయితే తొమ్మిదిన– శనివారమే పడిపోతాయి. మరి జీతం సరిగ్గా ఇస్తున్నప్పుడు పద్ధతులు సరిగ్గా ఆశించడంలో తప్పు లేదు. టైముకు రావాలి. నెలకు ఒక సెలవు వాడుకోవాలి. లేటొచ్చినా ఆబ్సెంట్ అయినా శాలరీ కట్‌కు అంగీకరించాలి.

అందువల్ల అందరూ జాగ్రత్తగా పని చేస్తారు. బడ్జెట్‌ను జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటారు. పదీ పదిహేను కిలోమీటర్ల అవతలకు వెళ్లి– అన్నీ కలిపి ఐదున్నరా ఆరులో అయిపోయేలాగా ఒక పోర్షన్ తీసుకుని– జాగ్రత్తగా ఉండిపోతారు.

అయితే ఇలాంటి సందర్భాల్లోనే వస్తుంది సమస్య.

ముందు రోజు రాత్రే గుర్తు చేస్తూ అంది.

శిల్పారామం సంప్రదాయవేదికలో రేపు సాయంత్రం మావాళ్ల పెళ్లి. కార్డు చూశారుగా. అంత ఇదిగా వచ్చి పిలిచి వెళ్లాక వెళ్లకుండా ఉంటే ఏం బావుంటుంది.

ఏం జవాబు చెప్పలేదు. దిండు మడిచి తల కింద సర్దుకుంటూ నిద్రపోయాడు.

రెండు వారాల క్రితమే ఊళ్లో ఏవో కొంపలంటుకున్నాయంటే పోయేసి వచ్చాడు. ఇప్పుడు మళ్లీ లీవ్ పెట్టలేడు. ఒకవేళ పెడదామన్నా సాయంత్రం ఫంక్షన్ అయితే ఇప్పట్నించి ఇంట్లో ఉండి లీవ్ వేస్ట్ చేయడం ఎందుకు అంటుంది. గంట ముందు పర్మిషన్ అంటే అదో పెద్ద తతంగం. ఇక ఆరుకు బయట పడి, ట్రాఫిక్ అంతా దాటి, అన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇంటికి చేరుకుని, గొంతులో టీనీళ్లైనా పోసుకోకుండా భార్యనూ పిల్లలనూ తీసుకొని తిరిగి ముప్పై కిలోమీటర్లు ట్రాఫిక్‌లో పడి, శిల్పారామం చేరుకుని.... ఇదా బతుకు...

బస్సుల్లో తిరగలేరు. ఆటోలను భరించలేరు. టూ వీలర్ నడపలేరు.

చెప్తే అర్థం కాదా?

హూ. మీరు ఏ రోజు సుఖపెట్టారు కనుక.

నిజమే. ఆదివారం వస్తే నాలుగు వీధుల అవతల ఆమె చెల్లెలి ఇల్లు ఉంది అక్కడకు తీసుకెళ్లి పడేస్తాడు. దగ్గరలో పాత థియేటర్ ఉంది. సినిమా చూపించేస్తాడు. మూడు నెలలకు ఒకసారి పిల్లలరైలు తిరిగే ఎగ్జిబిషన్ పెడతారు. తీసుకెళ్లి తీసుకొచ్చేస్తాడు. కాని సిటీలోకి మాత్రం రాడు.

అది ఆమెకు విసుగు.

ఇవాళైనా అంత గట్టిగా పట్టు పట్టేది కాదు. ఆమె బంధువుల్లో వీళ్లే కాస్తంత కలిగిన వాళ్లు. చూడు... శిల్పారామంలో పెళ్లి చేసేంత స్తోమత మా వాళ్లకూ ఉంది చూడు అని చూపిద్దామని తాపత్రయం. అదీగాక ఈ మధ్యే రెండు వేలు పెట్టి ప్యారెట్‌గ్రీన్ పీకాక్‌బ్లూ కాంబినేషన్‌లో అనార్కలి డ్రస్ కొంది. లక్కీగా స్టిచింగ్ కూడా కుదిరింది. అది వేసుకు చూపించాలని కోరిక. పెళ్లంటే ఈ మధ్య కనీసం డెబ్బై రకాల వంటకాలైనా పెడుతున్నారు. మీల్‌మేకర్ రైస్... బేబీ కార్న్ దమ్ బిర్యానీ... తమ సంగతి ఏముందిగానీ పిల్లల నోటికి కాస్తంత అందివ్వచ్చు కదా. ఒక పూట వంట తప్పుతుంది. అన్నింటి కంటే ముఖ్యం– ఈ బందిఖానా నుంచి కాసేపైనా బయటపడొచ్చని ఆశ. కానీ...

పిల్లల్ని కూచోబెట్టుకుని అంతంత దూరం పోకూడదు.

ఇన్ని మాటలు ఎందుకు? ఇష్టం లేదని చెప్పెయ్యండి.

సిటీలో టూ వీలర్ నడపడం ఎంత రిస్కో ఆడవాళ్లకు అర్థం కాదు. ముందు పెద్దాణ్ణి కూచోపెట్టుకుని వెనక పిల్లదాన్ని ఒళ్లో పెట్టుకుని... మొత్తం నాలుగు ప్రాణాలు... క్షణం కూడా గ్యారంటీ లేదు. అదీగాక వెళ్లేటప్పుడు పిల్లలు ఉత్సాహంగా ఉంటారు. వచ్చేటప్పుడు నిద్రపోతారు. చాలాసార్లు అయ్యింది. పెద్దాడు అలా తూగుతూ ట్యాంక్ మీద వాలిపోయి నిద్రలో ఎక్కడ జారిపోతాడో అని దడ రేపి... కాని వినదు.

మళ్లీ ట్రై చేశాడు.

స్విచ్‌డాఫ్.

ఇక ఫోన్ తీయదు. తీయకపోతే పోయింది ఆ కోపంలో పిల్లలు స్కూల్ నుంచి వచ్చాక అల్లరి చేస్తుంటే నాలుగు పీకుతుంది. ఒకసారి ఇలాగే సోఫాలో నుంచి పెద్దాణ్ణి లాగి కిందకు పడేసింది. ఆ సంగతి తెలిసి రెండు రోజులు గుండె గుబగుబలాడింది.

ఆమె చెల్లెలికి ఫోన్ చేశాడు.

ఇక్కడికి రాలేదు బావా. ఇందాక అటువైపు వెళుతూ చూశాను. ఇంట్లో కూడా లేదే.

మెల్లగా కడుపులో మంట మొదలయ్యింది.

ఈ మధ్య ఇంతే అవుతోంది. టెన్షన్ వస్తే ఎసిడిటీ పెరిగిపోతోంది.

గడియారం వైపు చూశాడు.

టైమ్ చాలా ఉంది.

ఎప్పటికి సాయంత్రం కావాలి? ఎప్పటికి ట్రాఫిక్ దాటాలి? ఎప్పటికి ఇంటికి చేరాలి? చేరి ఇంట్లో ఏం చూడాలి?

సెల్ పట్టుకుని వెనక్కి వాలాడు.

మంట ఛాతీని గుంజుతూ ఉంది.

– మహమ్మద్ ఖదీర్‌బాబు

# నల్ల కాలర్...

మెట్రో కథలు



ఆటో తెలిసిపోతూ ఉంది. వెనుక కూర్చుంటే సీట్ మాటిమాటికీ కదిలిపోతూ ఉంది. మీటర్ లేదు. మోత ఒకటి. దానికి తోడు గాలికి వేళ్లాడుతూ నల్లగా మురికిగా అసహ్యంగా ఉన్న ఆ షర్ట్ కాలర్.

ఆటో నడుపుతూ ఖాకీషర్ట్‌ను వీపు ఆన్చుకునే సపోర్టింగ్ రాడ్ మీద అటు ఇటుగా పడేసి దానికి ఒత్తుకుని కూచుని ఉన్నాడు. అటు సగం కనిపించడం లేదు. ఇటు సగం మాత్రం వెల్లికిలా వేలాడుతూ కుదుపులకు ఊగుతూ ఊగినప్పుడల్లా నలుపెక్కిన కాలర్‌ని బహిర్గతం చేస్తూ ఉంది.

ఆ చొక్కా చాలాకాలంగా ఉతకడం మర్చిపోయినట్టుగా ఉంది. అంగుళం వదలకుండా ముడుతలతో నిండిపోయింది. మరీ ముఖ్యంగా ఆ కాలర్- చారలు పడి, కాటు తేలి, నూనె దిగినట్టుగా ఉబ్బిపోయి, తేమ స్థిరపడిపోయి... దానిని తొడుక్కుంటారా ఎవరైనా? కనీసం ఆ కాలర్‌ని చూస్తూ చూస్తూ ఒంటి మీదకు వేసుకుంటారా ఎవరైనా?

ఆ దారిలో ఆటోలు దొరకవు. వెళ్లాల్సిన దారి చెప్తే అసలుకే దొరకవు. ఇది దొరికింది.

ఎంతిమ్మంటావ్?

ఎంతోకొంత చూసుకుని ఇవ్వండి సార్.

ఎటు నుంచి తీసుకెళ్తావ్?

ఎటువైపో చూసుకొని మీరే చెప్పండి సార్.

రౌండ్ నెక్ టీషర్ట్ వేసుకుని ఉన్నాడు. చెమట పట్టిన కళ్లతో చూస్తూ ఉన్నాడు. కుట్టించిన ప్యాంట్... ఎర్రగడ్డ బూట్లు... హ్యాండిల్ మీద ఒక వైఖరి లేనట్టుగా ఉన్న చేతి వేళ్లు... పొట్ట దాదాపుగా లేదు. అసలు ఉందో లేదో.

రాత్రి బాగా వాన పడినట్టుంది కదా.

ఏమో... పడినట్టే ఉంది సార్.

స్టేట్ డివైడ్ అయ్యాక ట్రాఫిక్ తగ్గలేదనుకుంటా.

ఏమో... తగ్గలేదనుకుంటా సార్.

సడన్‌గా ఆటో స్లో చేసి పక్కకు తీసుకొని అసలు ఏమాత్రం పట్టింపు లేనట్టుగా చాలా అలవాటైన పనే అన్నట్టుగా దాని వైపు కన్నెత్తి కూడా చూడకుండా ఖాకీ షర్ట్ తీసి తొడుక్కున్నాడు. దాని మురికి అంటకుండా టీషర్ట్ అతణ్ణి కొంచెం కాపాడింది. కాని మెడ బోసిగా ఉండటం వల్ల కాలర్ వెళ్లి సరిగ్గా అక్కడే అంటుకు కూచుంది. ఒంటి మీద ముళ్లు వచ్చాయి. చేసేది లేదు. ఆటో మళ్లీ కదిలింది.

పోలీసులు కనిపిస్తే ప్రాబ్లం సార్. యూనిఫామ్ లేదని ఫైన్ రాస్తారు. వచ్చిన ఆ కాస్తా దానికే పోతుంది.

ఎంత సంపాదిస్తావ్?

ఎంత సార్. పెట్రోలూ కిరాయి పోను రోజుకు నాలుగొందలు మిగిలితే ఎక్కువ. తెల్లారి నాలుక్కు లేస్తా. పదకొండు దాకా తోల్తా. ఇద్దరు చిన్నపిల్లలు. నా భార్య పనికి పోతుంది. అదొచ్చే దాకా ఇంట్లోనే ఉండిపోతా.

ఆటో నీలుగుతూ ఉంటే ఆ సంగతి పట్టించుకోకుండా టకాపకా గేరు మారుస్తూ మళ్లీ అన్నాడు.

అది కూడా పెద్దగా ఏం తేదు సార్. గ్యారంటీ లేని పని. ఒకరోజు ఉంటుంది. ఒకరోజు ఉండదు. మేస్త్రిని బట్టి. రోజంతా చేస్తే సాయంత్రానికి కమీషన్ పట్టుకుని రెండొందలలో రెండొందల యాబయ్యో ఇస్తారు. అవైనా నిలుస్తాయా? డాక్టర్ తింటాడు. బస్తీలో ఉంటాం గదా సార్. నీళ్లు తాగితే చాలు బిడ్డలకు జ్వరాలు వచ్చేస్తాయ్. అవేం నీళ్లో ఏమో.

ఫోన్ మోగింది. చూసుకున్నాడు. ఎత్తలేదు.

నా భార్యకు ఏదైనా పనుంటే చెప్పండి సార్. ఫ్యాక్టరీ పని. చురుగ్గా చేస్తుంది.

మళ్లీ ఫోన్ మోగింది. చూసుకున్నాడు.

ఎత్త లేదు.

మళ్లీ మోగుతుంటే ఎత్తి-

ఇదిగో తమ్ముడూ... తప్పూ... తెల్లారి ఒకసారి చేశావ్. చెప్పావ్. మళ్లీ మళ్లీ చేస్తున్నావ్. అలా చెయ్యొద్దు. పెట్టెయ్.

ఫోన్‌ని పై జేబులో పడేసి హ్యాండిల్ మీద చేయి ఉంచాడు.

ఆటో నత్తులు కొడుతూ పోతూ ఉంది. మెట్రో పని ఎక్కడికక్కడ దారి నిలువరిస్తూ ఉంది.

మళ్లీ ఫోన్ మోగింది.

ఎత్తాడు.

ఏయ్ బాబూ... ఏంటి... ఏంటమ్మా... దాని సంగతి నీకెందుకు చెప్పూ... తోటి పనోనివైతే నీ పని నువు చేసుకో... పైసలు తీసుకుని ఇంటికి పో... అంతేగానీ... ఆ... ఏంటి... ఆ మేస్త్రిని ఏమనకు. మంచోడు. అన్న లెక్క. పనిలో ముందూ వెనుకా అయ్యి లేటైనా ఇంటి దాకా వచ్చి దించేసి పోతాడు. సొంత మనిషి. ఏంటి... ఆ... ఏయ్... ఇంక మాట్లాడకు.

పెట్టేశాడు.

యాక్సిలేటర్ పెంచాడు. గోలలో ఏదో గొణుక్కున్నాడు.

మళ్లీ ఫోన్ మోగింది. ఆలోచించాడు. మళ్లీ మోగింది. విసురుగా తీశాడు....

ఏంటబ్బాయ్.... ఏంటి... తెలుసుకోవాలా? ఏం తెలుసుకోవాలి. ఇంకొక్కసారి చేశావంటే చెప్పుతో కొడతా.... అసలెక్కడున్నావ్ నువ్వు... ఉండొస్తున్నా... నీ ...

ఈసారి అటువైపు కట్టైపోయింది. కొంచెం గస పోశాడు.

ఏమైంది?

ఎవడో ఎదవ సార్. నా భార్య గురించి నోటికొచ్చింది వాగుతున్నాడు.

ఆ మాట అని అంతకుమించి మాట్లాడకుండా చాలాసేపు ఆటో నడపడం మీదే ధ్యాస పెట్టాడు. మధ్య మధ్య ముఖం తుడుచుకుంటూ ఉన్నాడు. మెల్లగా గొణుక్కుంటూ ఉన్నాడు. ఆటో ఎత్తెత్తి వేస్తుంటే మెడ దగ్గర పట్టిన చెమట కాలర్‌లోకి ఇంకిపోతూ ఉంది.

ఇంకొక్క ఫర్లాంగ్. దిగాల్సిన చోటు వచ్చేస్తుంది. మార్పు తెలుస్తూ ఉంది. ఎవరితో ఒకరితో చెప్పేసుకోవాలి. మెడ పక్కకు తిప్పుతూ ఆగలేనట్టుగా అనేశాడు.

ఏదో తెలుసుకోవాలట సార్ నేను. వాడి దగ్గరకు వెళితే ఏదో తెలియచేస్తాడట. ఏం తెలుసుకోవాలి. తెలుసుకొని ఏం చేయాలి. నాకు తెలిసింది చాలదా? ఈ లోకం చాలా కతర్నాక్‌ది. ఇక్కడ బతకడం చాలా కష్టం. రోజూ పని చేసి నాలుగు రూపాయలు సంపాదించింది పెళ్లాం బిడ్డల పొట్ట పోసి ప్రాణాలు కాపాడుకోవడం ఇంకా కష్టం. ఆ ఒక్క సంగతి నాకు బాగా తెలుసు సార్. అది తెలిస్తే చాలదా? వేరేవి కూడా తెలియాలా? తెలుసుకొని ఏ నెత్తిన పెట్టుకునేది నేను... అరె.... బతుకుదాం అంటే బతకనివ్వరేం సార్.. ఎలాగోలా బతుకుదాం అంటే బతకనీరేం?...


గొంతు ఒణుకుతూ ఉండగా చేతులు కంపిస్తూ ఉండగా ఆటో ఆపి షర్టు విప్పి సపోర్టింగ్ రాడ్ మీద పడేసి దాని వైపు చూడనైనా చూడకుండా మాట్లాడుకున్న డబ్బు కోసం నిలుచున్నాడు.

నల్లగా మురికిగా అసహ్యంగా ఉన్న ఆ కాలర్ యధావిధిగా వేలాడుతూ గాలికి అటూ ఇటూ ఊగుతూ ఉంది.

- మహమ్మద్ ఖదీర్‌బాబు

మెట్రో కథలు

# సుకీ...



మూడు రోజుల తర్వాత వార్త తెలిసి ఆమె మంచం పట్టింది.

సుకీ గొంతు దాదాపు పోయిందట. ఆగకుండా మొరిగీ మొరిగీ ఏమై పోయి ఉంటుందో ఊహించుకుంటే ఆమెకు అన్నం ముద్ద దిగడం లేదు. బాగా బరువు తగ్గిపోయిందట. అప్పటికీ చెప్పి చెప్పి పంపింది- సుకీ ఏదంటే అది తినదూ దానికి బ్రెడ్ ఇష్టం రెండు పూటలా అదే పెట్టండీ అని. రొట్టె పెట్టారట. అది పొరపాటున కూడా మూచూడదు. తలుపు ఏ కాస్త అలికిడైనా తన వాళ్లు వచ్చారేమోనని ఉలికులికి పడుతోందనీ నిద్ర పోవడంలేదనీ కదలిక ఏమీ లేనట్టుగా శవంలాగా పడి ఉంటోందనీ...

మీరు వెళ్తారా నన్ను వెళ్లమంటారా? అని ఆమె పెద్దపెద్దగా ఏడ్చింది. ఎవరు మాత్రం సమాధానం చెప్తారు. వెళ్లినా లాభం లేదు. తెచ్చుకున్నా మళ్లీ పంపాల్సిందే. అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఇతర ఫ్లాట్స్ వాళ్లకు కూడా ఇదంతా సతమతంగా ఉంది.

మొదట ఆ ఫ్లాట్ మీద ఎవరి దృష్టీ లేదు. జనరల్‌బాడీలో తెలిసింది- కార్పస్ ఫండ్ కట్టలేదని, ఎమినిటీస్‌కు కట్టాల్సింది కూడా కట్టకుండానే ఆక్యుపై చేసుకున్నారనీ, మెయింటెనెన్స్‌కు వాచ్‌మెన్‌ను పదేపదే తిప్పుతున్నారనీ....

అతను అప్పుడప్పుడు నీలిరంగు కోటు వేసుకుని గ్రే కలర్ ప్యాంట్ లెదర్ షూస్ కట్టుకుని టైతో బైక్ మీద వెళుతూ కనిపించేవాడు. టూ బెడ్ రూమ్ ఫ్లాట్‌లో ఉంటున్నవాళ్లు అలాంటి కోటు వేసుకోవడం ఏమిటో తెలియలేదు. ఆమె రోజూ వాకింగుకు కిందకు దిగినప్పుడల్లా పొద్దున కానీ సాయంత్రం కానీ వాచ్‌మెన్‌నో సెక్యూరిటీ గార్డ్‌నో ఏదో ఒకటి అనకుండా పైకి వెళ్లేది కాదు. అలా వాళ్లు అందరికీ తెలుసు. సుకీ వల్ల కూడా.

మూడు నెలల వయసులో కార్ పార్కింగ్ దగ్గర అది సిట్ అంటే కూచుంటూ స్టాండ్ అంటే నిలబడుతూ అందరికీ కనిపించింది. చిన్న చిన్న బిస్కెట్లను ఇంకా చిన్న ముక్కలు చేసి అలా గాల్లోకి ఎగరేస్తే ఒక్కటి కూడా కింద పడకుండా నోట కరుచుకుని మరొక ముక్క కోసం కళ్లల్లో కళ్లు పెట్టి చూసేది. ముద్దుగా ఉండేది. ఎవరితోనైనా స్నేహం చేసేలా అనిపించేది.

ఫ్లాట్స్‌లో కుక్క ఏమిటండీ అని వాళ్లూ వీళ్లూ అన్నారు.

ఆమె సమాధానం చెప్పే పని కూడా పెట్టుకోలేదు.

రోజూ ఆమె సుకీతోనే కనిపించేది. మంచి బెల్ట్ వేసి కుడి చేత్తో పట్టుకుని... ఆరు నెలల వయసుకు వచ్చి అది గునగున నడుస్తూ ఉంటే ఆమె అలా హైవే వరకూ వెళ్లి వచ్చేది. పిల్లలు ఆమెను చూసి భయపడేవారు. కాని సుకీకి కాలక్షేపంగా ఉంటుందని ఆమె వాళ్లను దానితో ఆడుకోనిచ్చేది. వాళ్లు ఉత్సాహంగా బిస్కెట్లో మరోటో పట్టుకుని వచ్చేవారు.

మా గాడ్దికి తిండి యావ ఎక్కువ. లాబ్రడార్ కదా. బాగా తింటుంది. పెట్టండి అనేది.

అది ఖరీదైన కుక్క అని అన్నారు. కొనాలంటే కనీసం ఇరవై వేలు ఉంటుందని చెప్పారు. కాదు ఎవరో తెలిసినవాళ్లు ఇస్తే తెచ్చుకుని ఉంటారు అని కూడా వినబడింది. దీని ఖర్చు నెలకు ఎంత లేదన్నా వెయ్యా పదిహేను వందలు ఉంటుందట. ఇవి కాకుండా వాక్సిన్లు మందులూ జీర్ణానికి టానిక్కులూ డాక్టర్ విజిట్ కోసం ఆటోలో వేసుకొని వెళ్లడానికి అదొక ఖర్చూ...

అయితే ఆమె అదంతా పెద్ద పట్టించుకున్నట్టు కనపడేది కాదు. కొడుకు ఈ మధ్యే ఏదో ప్రయివేట్ బ్యాంక్‌లో చిన్న ఉద్యోగానికి చేరాడట. ఇంట్లో దాదాపు ఉండడు. కూతురు పెళ్లయి వెళ్లిపోయిందని అంటారు.

ఇది నా కొడుకు. ఇదుంటే చాలు అంటుంటుంది ఆమె.

సుకీ ఆమెను వదలదు. ఉదయం ఏడింటికి నిద్ర లేచి బద్దకంగా కన్ను తెరిస్తే ఈమె కనిపించాలి. లేకుంటే అపార్ట్‌మెంట్ మొత్తం ఊగేలాగా గోల చేసేస్తుంది. ఈమె కిచన్‌లో ఉంటే ఏం వండుతున్నావే అన్నట్టుగా అక్కడే ఉంటుందట. బట్టలు తెచ్చుకోవడానికి టెర్రస్ మీదకు వెళ్లాలన్నా తోకలాగా వెంట తీసుకువెళ్లాల్సిందే. ఎప్పుడూ పక్కన కూచుంటుంది. రెండు బుగ్గలకూ మూతిని తాకిస్తుంది. ఇంట్లో మాట్లాడ్డానికి మనిషి లేక కబుర్లు చెబుతూ ఉంటే చెప్పుకోవే అన్నట్టు వింటూ ఉంటుంది. దానికి ఆమె గురించి పట్టింపులు జాస్తి. అన్నం తినక ఏ పనుల్లోనో పడి మర్చిపోతే తిను అని గద్దించి చెప్తుంది. టీ టైమ్ గుర్తు చేస్తుంది. సాయంత్రం కిందకు తీసుకువెళితే పిల్లలందరితో రండ్రా చిన్నయ్యలూ అని దానికి ఎంత ఆటో. సైకిళ్లు తొక్కే పిల్లలను ఓడిస్తుంది. ప్రేమగా తాకే పిల్లలను మాటా పలుకూ లేకుండా ముచ్చటగా చూస్తూ తోక ఆడిస్తూ ఉంటుంది.

తొమ్మిది నెలలు వచ్చేసరికి పెద్దవాళ్లకు కూడా ఫ్రెండ్ అయిపోయింది. కొందరు పొద్దున దానిని చూస్తారు. కొందరు మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు పలకరిస్తారు. కొందరు రాత్రి నిద్రకు ముందు పచార్లకు దిగినప్పుడు దానికి గుడ్ నైట్ చెప్పి చెయ్యూపుతూ నవ్వుతూ ఫ్లాట్లలోకి వస్తారు. ఎంత అలవాటు అంటే ఆఖరకు దాని కోసం సుకీ ఎక్కడండీ అని ఆమెతో మాట్లాడటానికి కూడా సిద్ధమైపోయారు.

అయితే సుకీ కూడా ఆమెను బాగా గడబిడగా ఉంచేది. బాత్‌రూమ్ బయట ఉంచిన స్లిప్పర్లను చీల్చి అవతల పారేసేది. దిండును నోట కరుచుకుందంటే ఎంత లాగినా దిండు చిరగాల్సిందే తప్ప అది పట్టు వదలదు. ఆకలేస్తే అడగొచ్చుగా. ఊహూ. ఒక్కోసారి కుర్చీ మీద లంఘించి అక్కణ్ణుంచి డైనింగ్ టేబుల్ మీదకు దూకి గిన్నెలు దొర్లించి...

ఆ...య్... సుకీ... అని గట్టిగా కేకలేస్తే చాలు. ఇంకంతే మూలకు వెళ్లి దస్‌మని పడి పోతుంది. ఉలకదు. పలకదు. పోవే టక్కరిదానా అని ఆమె కూడా లెక్క చేయకుండా ఉంటుంది. అతనుంటే కాసేపు సరదా కోసం దానిని బతిమిలాడేవాడు. పట్టించుకోదు. కొడుకు ఉంటే బుజ్జగించేవాడు. కన్నెత్తి కూడా చూడదు. ఇక చూసి చూసి ఆమే వచ్చి సరేలే... రా... తిను... అని కాస్త పెరుగన్నం కలిపి తినిపించడానికి కూచుంటే అది కాళ్లూ చేతులు వెల్లికిలా పడేసి... సారీ... సారీ... అని ముఖం ప్రసన్నంగా పెట్టేదాకా మారాం చేస్తుంటే ఆమె నవ్వుతూ నువ్వొకదానివి దాపురించావే నా ప్రాణానికి అని కళ్ల చివర తుడుచుకునేది. నిన్ను వదిలి బతగ్గలనా అని దగ్గరకు తీసుకునేది.

కాని- అలాంటి సందర్భం వచ్చి పడింది. స్టేట్ డివైడ్ అయ్యాక అతడి పరిస్థితి కొంచెం బాగ లేదు. రియల్ ఎస్టేట్‌లో అతను చేసే మార్కెటింగ్ ఫీల్డ్ దెబ్బ తినిందట. మరి ఇక్కడ ఇబ్బంది వచ్చిందో అక్కడ ఇబ్బంది వచ్చిందో ఈ రాజధానికీ ఆ రాజధానికీ క్షణం తీరిక లేకుండా తిరుగుతున్నా ప్రతిఫలం లేదు. ఇంటి లోను ఒకటి కట్టాలి. ఖర్చులు చూడాలి. ఏవో చిన్నా పెద్ద అప్పులు ఉన్నట్టున్నాయ్. అవి తీర్చాలి. ఇక ఇలాగే ఉంటే అవదని బయటకు వెళ్లి ఏదో ఒకటి చేయాలని ఆమె నిశ్చయం తీసుకుంది. మరి సుకీ? మనిషి లేని ఇంట్లో అది క్షణం కూడా ఉండలేదు. ఉత్త బెదురుపోతు. లోపల పెట్టి తాళం వేసి పోతే మొరిగీ మొరిగీ సాయంత్రం లోపల తారున చచ్చిపోతుంది.

పర్లేదు... నా ఫ్రెండ్ ఉన్నాడు. ఇస్తానంటే వచ్చి వాళ్లూరు తీసుకెళతానంటున్నాడు. మన పరిస్థితి బాగు పడ్డాక తెచ్చుకుందాం అన్నాడతను. దాని మీద రెండు వారాలు నాలుగు వారాలు పెద్ద పెద్ద చర్చలు... ఏడుపులు అయ్యాయి. సరే... కనీసం ఆరు నెలలు అని ఒప్పందం కుదిరింది. స్నేహితుడు వచ్చాడు. కారులో తీసుకెళ్లిపోయాడు. మూడో రోజుకల్లా ఆమె మంచం పట్టింది.

సుకీ... సుకీ...

అన్నం మానేసింది. రెప్ప మూతపడితే నిద్రలో దాని కలలు. మంచం పక్కన రోజూలాగే పడుకుని ఉందేమో అన్నట్టుగా పదేపదే ఉలికిపడుతూ లేచి చూసేది. కాని అది ఎందుకు ఉంటుంది?

అది నా కోసం ఏడుస్తూ ఉంటుందండీ... నేను లేకపోతే బతకదండీ...

ఎంత ఏడ్చినా ఏం లాభం. ప్రస్తుతానికి పరిస్థితి అది.

రెండు మూడు వారాలు గడిచాయి. మెల్లగా ఆమె అప్పుడప్పుడు కింద కనిపించడం మొదలుపెట్టింది. పిల్లలను చూసి తల దించుకుని వెళ్లిపోతూ ఉండేది. పెద్దవాళ్లతో కూడా ఏదో మొహమాటపు పలకరింపే.

మొన్నొక రోజు రాత్రి కింద సుకీ ఇష్టంగా కూచునే మొక్కల దగ్గర కూచుని ఆమె ఎంతోసేపటికీ కదల్లేదు. గేట్లు వేసేసే టైమ్ వచ్చినా కదల్లేదు. భర్త చూసి చూసి కిందకు వచ్చాడు.

ఇంకా ఎన్ని రోజులు ఏడుస్తావు?

ఆమె పసిపిల్లలా చూస్తూ మెల్లగా ఏడవడం మొదలుపెట్టింది.


పాపిష్టిదాన్ని... బిడ్డలాగా పెంచి చేతులారా సాగనంపాను... దాని ఉసురు పోసుకున్నాను. ఒసే గాడిద్దానా... నేనింక నిన్ను సాకలేను వాళ్ల పంచనా వీళ్ల పంచనా పడి బతుకమ్మా... ఇంక నన్ను వదిలిపెట్టు అని నిజం చెప్పేసి ఉంటే అది అంతా అర్థం చేసుకుని అలాగే అంటూ నా కళ్లవైపు కూడా చూడకుండా వెళ్లిపోయేదేమో. కాని మోసం చేశాను. పోవే... అంకుల్ వాళ్లతో అలా షికారుకు పోయిరా అని అబద్ధం చెప్పి పంపించాను. తర్వాత ఎంత కంగారు పడి ఉంటుందో. ఎంత బెదిరిపోయి ఉంటుందో. ఇంత నమ్మకద్రోహం చేస్తావా అని నా మీద కోపం పెట్టుకుని ఎంత అలిగి ఉంటుందో. అయ్యో... నేనెప్పుడు కనపడేది... దాని అలక ఎప్పుడు తీర్చేది... టక్కరిది టక్కరిది అని పిలిచేదాన్నే.... అసలైన టక్కరిదాన్ని నేనే కదా...

ఏమీ రాద్ధాంతం చేయకుండా చాలా లోగొంతుకతో ఆమె వెక్కిలి వెక్కిలి ఏడుస్తూ ఉంటే ఆ గిల్ట్ ఈ జన్మకు సరిపడినదా అనిపించింది.

**- మహమ్మద్ ఖదీర్‌బాబు**

# ప్రొఫైల్ పిక్చర్...

మెట్రో కథలు



మీరు నాకు పని ఇవ్వాలి. చేస్తాను.

చూశాడు.

అలా చూడొద్దు. పని ఇవ్వండి. చేస్తాను.

ప్యాంట్ వేసుకుని ఉంది. కొత్తదని తెలిసిపోతూ ఉంది. ఫుల్‌షర్ట్ వేసి చేతులు మాటిమాటికి పైకి నెడుతూ ఉంది. ఒదులొదులు శరీరం. బట్టలు బిగుతుగా ఉండటం వల్ల చూడటానికి కొంచెం అసౌకర్యంగా ఉంది.

సినిమా ఫీల్డంటే చీరలు సారెలు ఇబ్బంది అని చెప్పారు. కొత్తవి. మొన్నే కొన్నాను.

కాళ్ల వైపు చూశాడు. షూస్ కూడా కొత్తవే. స్పోర్ట్స్ షూస్. మూడు గంటలకు ఒక ఆడిషన్ ఉంది. ముంబై నుంచి ఆర్టిస్ట్ రావాలి. శంషాబాద్‌లో ల్యాండయ్యి రింగ్‌రోడ్డున పడింది అని ఫోన్. కాని నాలుగయ్యేలా ఉంది. ఈలోపు ఈమె దూరింది. గంట నుంచి అసిస్టెంట్ డైరెక్టర్‌ని నస పెడుతోందట. వదిలేశాడు.

సినిమాల గురించి మీకేం తెలుసు?

మీరు నవ్వుతున్నారు.

లేదు.. లేదు.. చెప్పండి.

పవన్ కల్యాణ్ ఫ్యాన్‌ని. చాలా తెలుగు సినిమాలు చూశాను. నరసింహారావుగారు రాసిన డైరెక్టర్ కావడం ఎలా అనే పుస్తకం చదివాను. అంతే. మీరు నవ్వుతున్నారు.

వయసు నలభై లోపు ఉండే అవకాశం లేదు. యాభై కూడా దాటకపోవచ్చు. ఈ వయసు వాళ్లు ఇలా వచ్చి అడగడం మొదటిసారి.

ఏం చేస్తుంటారు?

మామూలే. హౌస్‌వైఫ్. మావారు అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో వాలెంటరీ తీసుకున్నారు. ఒక ప్రయివేట్ ఫర్మ్‌వాళ్ళు మంచి ఆఫర్ ఇవ్వడంతో మళ్లీ ఉద్యోగంలో చేరారు. మా అబ్బాయి యూ.ఎస్. వెళ్లి టూ ఇయర్స్. ఇంట్లో అత్తగారు.. నేను...

సరే. చూద్దాం.

అంటే పని ఇచ్చినట్టేనా?

కాల్ చేస్తాను. మావాడితో టచ్‌లో ఉండండి.

పోనీ పద్యం పాడనా? ఇస్తారా?

పద్యం పాడతారా?

నేను కాలేజ్ రోజుల్లో చాలా పాత్రలు వేశాను. ప్రైజులు కొట్టాను. బెస్ట్ యాక్టర్‌ని.

ఆ సంగతి చెప్పలేదూ.

నాటకాలు కూడా రాశాను. యూనివర్సిటీలో ఉండగా ఒక నాటకం ఢిల్లీ దాకా వెళ్లిందనుకోండి. అయితే అవన్నీ పాత రోజులు.

చూస్తున్నాడు.

పెళ్లయ్యింది. ట్రాన్స్‌ఫర్లతో ఊళ్లు తిరగడమే సరిపోయింది. అన్నీ పోయాయి. కొడుకు ఒక లోకం అనుకున్నా. వాడూ రెక్కలొచ్చి ఎగిరిపోయాడు. రెండేళ్లుగా కొంచెం గొడవలు. మావారికి తెలియకుండా మూడు లక్షలు అప్పు చేశాను.

మూడు లక్షలా?

అవును. చీరల కోసం. ఫేస్‌బుక్‌లో పెట్టాలిగా...

చూస్తున్నాడు.

మొదట ఇంట్లో మొక్కల ఫొటోలు... నచ్చిన సినిమాల ఫొటోలు... గుడ్ మార్నింగ్‌లు... గుడ్‌నైట్‌లు... వెలిగే కొవ్వొత్తులు... వాటి కింద క్యాప్షన్‌లు... ఇవి పెట్టేదాన్ని. తర్వాత ఒకరోజు మంచి ఫొటో దిగి ప్రొఫైల్ పిక్చర్ మార్చాను. బాబోయ్. ఎన్ని లైకులు. చాలా కామెంట్లు. ఏదో పెద్ద నేషనల్ అవార్డు వచ్చిన ఫీలింగ్ కలిగింది. ఒక కుర్రాడు పొయెట్రీ రాశాడు. సాహిత్యం నుంచి కూడా రిఫరెన్స్ ఇచ్చాడు. అలాంటి చీర కట్టుకున్నవాళ్లను ఏదో అంటారట. గుర్తు లేదు. మొత్తం మీద అలా. మొదట తెలియలేదు. కాని చాలా అలవాటైపోయింది. వారానికి ఒకసారి ప్రొఫైల్ పిక్చర్- నాకు గురువారం సెంటిమెంట్- ఆరోజు మార్చేదాన్ని. లైకులూ కామెంట్లూ నా థ్యాంక్యూ వెరీమచ్‌లూ... వీటితో మళ్లీ గురువారం దాకా గడిచిపోయేది. మళ్లీ ఇంకోటి. చాలా ఎగ్జయిటింగ్‌గా అనిపించేది. టీవీ సీరియళ్లలో పడి కొట్టుకోవడంలో ఈ మజా లేదనిపించేది. కొందరు చాటింగ్‌లోకి వచ్చేవారు. ఎలా ఉన్నావ్ అక్కా అని పలకరించేవారు. అర్ధరాత్రి దాకా అదో కాలక్షేపం. కాని చివరకు అక్కను తీసి గట్టున పెట్టేవారు. చెడ్డ పిల్లలు ఉంటారు కదా. వాళ్లను అన్‌ఫ్రెండ్ చేసి మళ్లీ ఇంకొకరితో. ఎంత ఫేమస్ అయ్యానంటే గురువారం వస్తుందంటే చాలు ముందు రోజు నుంచే హడావిడి... మెసేజ్‌లు... వెయిటింగ్ ఫర్ న్యూ ప్రొఫైల్ పిక్చర్ అని ఆకాంక్షలు. అంత డిమాండ్ ఉన్నప్పుడు కట్టిన చీరలే కట్టి కనపడటం బాగోదు కదా. వాటి వెంట పడ్డాను. మావారు హ్యాపీనే. తన్ను వదిలిపెట్టి ఏదో ఒకటి చేసుకుంటున్నాను. ఇంకేం కావాలి? కాని మా అత్తగారే నస పెట్టి మొన్నొక రోజు సెల్ లాక్కుని విసిరి కొడితే ఆమెను తోసేస్తే తుంటి విరిగి... పెద్ద గొడవ...

తల దించుకుంది.

తర్వాత సిగ్గేసింది. ఏంటిది? అని. ఇదిగో ఇలా ప్యాంట్ షర్ట్ వేసుకొని మీ దగ్గరకు వచ్చాను. మీ సినిమాలు కొంచెం పద్ధతిగా ఉంటాయి. పని ఇచ్చినట్టేనా?

ఇంకా ఫేస్‌బుక్‌లోనే ఉన్నారా?

నవ్వింది.

భలేవారే. ఎందుకు బయటకు వస్తాను. కాకపోతే ఇక మీదట నా పోస్ట్‌లు మారతాయి. ఫలానా సినిమా షూటింగ్‌లో క్లాప్‌బోర్డ్ పట్టుకుని నేను... ఫలానా లొకేషన్‌లో పుస్తకం చదువుకుంటూ నేను... అలా అన్నమాట.

ఆగి అంది.

పెద్దగా ఆశలు లేవు. కాని కొంచెం పని నేర్చుకుని ఏవైనా షార్ట్ ఫిల్మ్‌లు తీయాలని ఉంది. ఆడవాళ్ల గురించి.. ఆడపిల్లల గురించి.. చదువుకునే వయసులోకొస్తున్న అబ్బాయిల గురించి. ఏదో మార్చేస్తానని కాదు. నేను మారానుగా మొదట. వేళ్లు మాత్రమే పని చేస్తూ మిగిలిన శరీరమంతా పెరాలైజ్ అయ్యే వ్యవస్థ ఏదో మనల్ని బిగిస్తోంది. దానిని కొంచెం అలెర్ట్ చేయాలనిపిస్తోంది. మావారు ఆల్రెడీ అయ్యారనుకోండి. ఉద్యోగం మానేశారు...

ఈసారి నిజంగానే నవ్వాడు.

అయితే పని ఇచ్చినట్టేనా?

సరే. రండి.

మీరు నాకు పే చేయాలి. కొత్తవాళ్లకు డబ్బులివ్వరని విన్నాను. నాకు కావాలి. మూడు లక్షల అప్పు తీర్చేస్తానని మా అత్తగారికి మాట ఇచ్చాను.

ఇదొకటా?


అవును.

సరే సరే పెద్దగా నవ్వుతూనే ఉన్నాడు.

- మహమ్మద్ ఖదీర్‌బాబు

# నిద్రా సమయం

## మెట్రో కథలు



షవర్ ఆన్ చేశాక నీళ్లు తల మీద పడుతుంటే దొంగ వెధవ జిడ్డి వెధవ ముష్టి వెధవ అని తిట్టుకుంది.

పైకి తిట్టుకుందా లోపల తిట్టుకుందా తెలియలేదు.

కాని ఆ కోపం ఈ రాత్రికి దిగదు.

మొన్నొక రోజు ఒక సబార్డినేట్‌ని పిలిచి చెడామడా తిడితే తిట్టించుకున్నామె బాగానే ఉంది. పక్కన ఉన్న నలుగురూ చేరి పైకి కంప్లయింట్ చెయ్ ఈవిణ్ణి ఇక్కణ్ణుంచి జిల్లాలకు సాగనంపుదాం అని ఎక్కించారు. జిల్లాలకు? అదీ సిటీని వదిలి. ఆ తలనొప్పి నుంచి బయట పడాల్సి వచ్చింది.

టైమ్‌కి వచ్చారా లేదా అని మొన్న సర్‌ప్రైజ్ విజిట్ చేసింది. అదీ కరెక్ట్ కాదట. ఈమెకెందుకు.. పీనయ్యిందా లేదా అని చెప్పమనండీ అని నలుగురైదుగురు క్యాంటీన్‌లో రంకెలు వేశారని తెలిసింది.

ఇవాళ ఒకణ్ణి పిలిచి ఫైల్ పుటప్ చేయవయ్యా మగడా అంది. వాడి ఇంగ్లిష్ నిండా తప్పులే. రెడ్డింక్‌తో రౌండప్ చేసి పంపితే- అవి టైపింగ్ మిస్టేక్స్... ఫైల్ పుటప్ చేయడంలో ఇలాంటి తప్పులు మామూలే... అవి సరి చూసుకోవాల్సిన బాధ్యత మీదే అని వాడే రివర్స్‌లో కామెంట్ రాసి పంపాడు.

ఏమనడానికి ఏముంది?

ఇంటికొచ్చి ఇదిగో ఈ పని.

లేడీ ఆఫీసరంటే అన్నింటికీ అటెన్షన్. డ్రస్సు సరిగ్గా ఉన్నా అటెన్షన్. లేకపోయినా అటెన్షన్. గట్టిగా మాట్లాడితే అటెన్షన్. మాట్లాడకపోయినా అటెన్షన్. ఆఖరుకు ఆకలికి రెండు మూడు అరలున్న లంచ్‌బాక్స్ తెచ్చుకున్నా అటెన్షన్. మేడం... మేడం.. అందరూ గౌరవం నటించే మగాళ్లే మళ్లీ. కాని ఎంత కిందకు లాగుదామా అని చూట్టంలో ఒక్కడూ తక్కువ కాదు.

మమ్మల్నీ వేధిస్తారండీ అంటాడు పక్క సెక్షన్ ఆఫీసరు.

కాని అతడు సాయంత్రానికి ఫ్రెండ్స్‌తో చేరి బార్‌కు వెళ్లి హాయిగా బూతులు తిట్టుకొని రెండు గుటకలు పుచ్చుకుని డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరక్కుండా పది లోపలే ఇల్లు చేరి భోం చేసి నిద్ర పోతాడట.

తనేం చేయాలి? బూతులు రావు. బార్‌కు వెళ్లలేదు. రాత్రి పదికి వెళ్లి భోం చేసి పడుకుందామంటే ఆ భోజనం అనే మాటను మళ్లీ తయారు చేయాల్సింది తనే. ఉక్కిరిబిక్కిరిగా ఉంటుంది. లోలోపల ఏదో కోపంగా ఉంటుంది. బలవంతంగా నిశ్శబ్దంగా ఉండబుద్ధేస్తోంది. అలాగే ఉంటోంది.

మొన్న పెద్దది కనిపెట్టి అంది- నువ్వు చాలా మారిపోయావ్ మమ్మీ అని. ఎనిమిది చదువుతోంది. ఎంత గమనింపో బంగారానికి. ఇంతకు మునుపైతే ఆఫీసు నుంచి రావడమే దానితో చాలా కబుర్లు చెప్పేది. కాలనీ వీధిలోకి తీసుకెళ్లి దీపాల వెలుతురులో షటిల్ ఆడేది. చిన్నాడు సైకిల్ తొక్కుతుంటే సీట్ పట్టుకుని వెనుక పరుగు తీసేది. ఇరుగు పొరుగు వాళ్లతో బోలెడు బోలెడు కబుర్లు చెప్పేది. ఇప్పుడు అవన్నీ మెల్లమెల్లగా గడ్డకట్టి పోయినట్టుగా అనిపిస్తున్నాయి. నిర్లిప్తమైన ముఖం. కోపంతో ముడతలు పడ్డ నుదురు.

స్నానం ముగించి నైటీ జార్చుకుని బయటకు వచ్చింది. ఇక వంట. పిల్లలు టీవీ ముందు పుస్తకాలు వేసుకుని కూచుని ఉన్నారు. మామూలుగా అయితే వాళ్లతో కూచుని కబుర్లు చెప్పి... భర్త ఇంటికొస్తే తను పడుతున్న ఇబ్బందులేవో చెప్పుకుని...

ఏం చెప్పుకున్నా ఏం ప్రయోజనం?

గవర్నమెంట్ వ్యవహారాలు అర్థం కావు. పాడిందే పాడరా అన్నట్టుగా ఉద్యోగం మానేయరాదా అంటాడు. లేదంటే అవన్నీ పట్టించుకోకు అంటాడు. రెండూ సాధ్యం కాదు. చాలాసార్లు ఆ మాటే చెప్పింది. ఏం అని రెట్టిస్తాడు. వివరంగా చెప్పాలా?

ఆడవాళ్లు పుట్టిల్లు అనే మాటను తీసేశారు. మంచైనా చెడ్డైనా తమ బతుకేదో తాము బతకాలని నిశ్చయించుకున్నారు. నీకు అనువుగా ఉన్నంత కాలమే నువ్వు భద్రత ఇస్తావు. తేడా వస్తే బ్యాగు సర్ది చేతికిస్తావు. అప్పుడు నా ఉద్యోగమే నాకు దిక్కు. కనుక దానిని నేను వదులుకోను. పైగా ఇది నా చదువుకీ తెలివితేటలకీ సామర్థ్యానికీ వచ్చిన ఉద్యోగం. వదిలేసి నన్ను నేను చిన్నబుచ్చుకోలేను. ఇక పట్టించుకోకపోవడం గురించి. ఒకసారి రెండుసార్లైతే పర్లేదు. అనునిత్యం ముల్లులాగా పదే పదే గుచ్చుతుంటే పట్టించుకోకుండా ఎలా ఉండమంటావ్?

అంతటితో వాదన ముగుస్తుంది.

ఇది కూడా ఈ మధ్య ఆపేసింది. ఒక్క ఊరడింపు మాట కూడా లేకపోతే ఏం చేసేది?

నా గోల నేను పడుతున్నాను... నన్నెవరు బుజ్జగిస్తున్నారు... నాకెవరు జోల పాడుతున్నారు... ఎంత సేపూ నీవైపు నుంచే చూస్తున్నావ్ అంటాడు.

ఈ మధ్య గమనిస్తోంది. ప్రతి మనిషీ సాటి మనిషంటే మంటెత్తి పోతున్నాడు. ఇక టీమ్ లీడర్ అంటే ఊరుకుంటారా? ఏమేం పడుతున్నాడో? అవన్నీ పడి అలో లక్ష్మణా అని ఇల్లు చేరితే కాసిని పూలు పెట్టుకుని ఎదురు రాకుండా ముఖం గంటు పెట్టుకుని ఉంటే... అప్పటికీ ట్రై చేస్తోంది. కాని కుదరడం లేదే.

బెల్ మోగింది. పిల్లలు నాన్నా.. నాన్నా.. అని పరిగెత్తుకుంటూ వెళ్లి డోర్ తీశారు.

వాళ్లతో ఒకటి రెండు మాటలు... తనకు కళ్లతో పలకరింపు... ముఖం చూడగానే అర్థమైపోయుంటుంది... మాట్లాడకుండా షవర్‌కి వెళ్లిపోయాడు. లోపల ఎవర్ని తిట్టుకుంటున్నాడో.

ఆ పూట మునగాకు పప్పు చేసింది. నలభైకి చేరుకున్నాక ఆడవాళ్లకు ఆకుకూరలు తప్పనిసరి అని ఎక్కడో చదివింది. కాదు భర్త చేష్టలు తప్పనిసరి అని స్నేహితురాలు జోక్ చేసింది.

అయితే అలా జోక్ చేసే రోజులన్నీ ఎప్పుడో పోయాయి. పిల్లలతో తప్ప ఎదురూ బొదురూ కూచుని నవ్వుకుని ఎన్నాళ్లయ్యిందని. ఒకోరోజు ఈవైపు మూడ్ బాగోదు. లేకుంటే ఆ వైపు మూడ్ బాగోదు.

భోజనాల దగ్గర కొంచెం పితలాటకం అయ్యింది. పిల్లలు మునగాకు తినం అని మారాం చేస్తే- నేను వండగలిగింది ఇంతే తింటే తినండి లేకుంటే పొండి అని పెద్దగా గద్దించింది. ఉలిక్కిపడ్డాడు. పిల్లలు కూడా. చివరికి మామిడిపండు కోసి వారికి పెరుగన్నం తినిపించింది. కాసేపు టీవీ టైం. నలుగురూ కూచున్నాక కాస్త మంచి మూడ్ సెట్ చేసే ప్రోగ్రామ్ చూద్దామంటే అన్నీ చావు వార్తలు... దుర్మార్గపు సంఘటనలు. చూసి చూసి లేచింది.

పిల్లల్ని పడుకోబెడతాను అని వాళ్లను వాళ్ల గదికి బయల్దేరదీసి అరగంట తర్వాత బయటకు వచ్చింది.

నేను నిద్ర పోతున్నాను- ప్రకటించింది.

తల ఊపాడు.

తొందరగా నిద్ర పోడు. పదకొండు దాకా టీవీ చూస్తాడు. తనకు పొద్దున్నే లేవక తప్పదు. పైగా మరుసటిరోజు ఆఫీస్ పనులను ఒకసారి మననం చేసుకోవాలి. వ్యూహాలతో సిద్ధం కావాలి. లోపలికి వెళ్లి పడుకుంది.

సిక్స్ బై సిక్స్ కింగ్ సైజ్ బెడ్ అది. అరవై డెబ్భై వేలు పెట్టి కొన్నారు. అందులో ఏం తక్కువ లేదు. ఇద్దరూ కలిసి ఇంటి నిండా ఖరీదైనవన్నీ నింపారు. బాంటియాలో ఇది డిజైనర్ బెడ్ అంటే సింగిల్ పేమెంట్‌తో ఇంటికి తెచ్చుకున్నారు. మెత్తగా ఉంటుంది. పడుకుంటే చక్కగా నిద్ర పడుతుంది. స్లిప్పర్స్ వదిలి ఒక పక్కకు వాలి దిండుకు చెంపను ఆనించి నిద్ర పోయింది. ఆ తర్వాత ఎప్పుడొచ్చి పడుకున్నాడో పడుకున్నాడు.

ఇలా వాళ్ల కాపురం గడిచిపోతూ ఉంది.


బంధువుల్లో ఎప్పుడైనా ఏదైనా ఫంక్షన్ జరిగినా, కాలనీలో కారు వేసుకుని వెళుతూ వాళ్లు కనిపించినా అందరూ వాళ్లకేమీ అని అంటూ ఉంటారు.

అవును. వాళ్లకేమి?

- మహమ్మద్ ఖదీర్‌బాబు

మెట్రో కథలు

# దీదీ...



దీదీకి మసాజ్ టేబుల్ ఎంత ఎత్తు ఉంటుందో తెలియదు.

మెడ నుంచి మొదలుపెడతారా పాదాలు నొక్కుతూ ప్రారంభిస్తారా తెలియదు.

ఆయిల్ వాడతారని తెలుసు. ఏ ఆయిలో తెలియదు.

కాని ఒప్పుకుంది. ఎనిమిది వందలు అంటే మాటలు కాదు.

గదికి బాగా వెంటిలేషన్ ఉంది. రెండు పెద్ద పెద్ద కిటికీలు ఉన్నాయి. సింగిల్ కాట్ బెడ్ ఉంది.

ఆ కర్టెన్స్ వేసేయ్ దీదీ అని వెళ్లిపోయింది.

కర్టెన్స్ వేస్తుంది సరే ఆ తర్వాత ఏం చేయాలి?

దీదీని జుట్టు కొసలు కట్ చేయమంటే క్షణాల్లో చేసేస్తుంది. హెన్నా పెట్టమంటే చక్కగా పెడుతుంది. ఫేషియల్ ఓ మోస్తరు తెలుసు. ఐబ్రోస్ దిద్దడంలో పర్‌ఫెక్ట్. అంతకు ముందు ఆమెను మెహందీ దీదీ అని అనేవారు. ఇంటింటికీ తిరిగి మెహందీ పెట్టేది. మెల్లగా ఇవి కూడా నేర్చుకుంది. ఇప్పుడు మసాజ్‌లోకి దిగాలి.

వచ్చింది. నైటీలో ఉంది.

ఇలా పడుకోనా దీదీ అంది.

వాలకం చూస్తే వెల్లికిలా పడుకునేలా ఉంది. వెల్లికిలాయేనా?

నీకు తెలియదా దీదీ?

నాకు తెలియదు.

నాకూ తెలియదే.

ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

ఉదయం యథావిధిగా ఇంటికి వచ్చినప్పుడు ఈ ప్రోగ్రామ్ లేదు. ఐబ్రోస్ చేసి హెన్నా పెట్టి వెళ్లిపోవాలి. దాని కంటే ముందు ఏదైనా పెడుతుంది తిందాం అనే ఆలోచన కూడా లేకపోలేదు. ఆ ఇంటికి రావడం అంటే అందుకే దీదీకి ఉత్సాహం. కాఫీ టీ ఇస్తుంది. అప్పుడప్పుడు పాత చీరలు పడేస్తుంది. చాలా ఫ్లాట్స్ తిరుగుతుంటుంది కదా. ఇది కొంచెం బాదరబందీ లేని ఫ్లాట్. పిల్లలిద్దరూ హైస్కూల్ కాలేజీలకు వచ్చేసినట్టున్నారు. అతను కూడా సెకండ్ హ్యాండ్ కారు కొనుక్కునేపాటి బిజీ ఉద్యోగం చేస్తున్నట్టున్నాడు. ఇంట్లో ఉడ్‌వర్క్ ఏమీ పెండింగ్ లేదంటే పర్వాలేదన్న మాటే.

ఈమె ఇంట్లో ఉంటుంది. ఆదరంగా మాట్లాడుతుంది. ఫేషియల్ గట్రా చేస్తుంటే ఇలా చెయ్ అలా చెయ్ అని ఇతర ఆడవాళ్లలా నస పెట్టకుండా ఊరికే ఉంటుంది. ఇంతకు ముందు మాటల్లో ఒకటి రెండుసార్లు దీని ప్రస్తావన తెచ్చింది. అదేమిటో తెలియక దీదీ ఊరుకుంది. కాని ఇవాళ చేసంచి దించి సామాగ్రి సర్దుకుంటూ ఉంటే ఈ పనికి పట్టుపట్టింది. అప్పటికీ దీదీకి ఇది లంపటంగానే అనిపించింది.

హెన్నా పెడతాను. వేణ్నీళ్ల స్నానం చేసి పడుకో బేటీ.

వింటేనా?

రెండు చేతులనూ తల కింద దిండులాగా అమర్చుకుని కళ్లు మూసుకుని పడుకుంది. ఇద్దరు పిల్లల తల్లి. చక్కటి ముఖం. కుదురైన రూపం. పరిపూర్ణతను దిద్దుకున్న ఆకారం.

దీదీ ఒక క్షణం తేరిపారా చూసింది. రాని పని చేయాలి. మోడా లాక్కుని మంచం చివర కూచుంది. పాదాలను చూసింది. పక్కపక్కన పడుకున్న జంట శిశువుల్లా ఉన్న వాటిలోని ఒక దానిని మెల్లగా చేతిలోకి తీసుకుంది. నులివెచ్చని నూనెలో వేలి కొసలను ముంచి సుతారంగా తాకించింది. జలదరించింది. మరో పాదాన్ని నిమిరింది. నిలువెల్లా ఒణికింది.

దీదీ తన జీవితంలో ఎవరి పాదాలూ పట్టుకోలేదు. భర్తవి కూడా. కూతురు పుడితే చిన్నప్పుడు దాని పుష్టి కోసం క్రమం తప్పకుండా నూనె పట్టించింది. అది గుర్తుకు వచ్చింది. వాటికీ వీటికీ తేడా ఏమిటి? స్పర్శను కొనసాగించింది. సుతారంగా ఆర్ద్రంగా తన స్పర్శ అంతా ఆమె స్పర్శకు అందే విధంగా...

ముఖం వైపు చూస్తూ ఉంది.

కనురెప్పలు మూతపడిన ఆ ముఖం మెల్లమెల్లగా తేట పడుతూ ఉంది. పాడైపోయిన ముడి ఏదో క్రమంగా వదులవుతున్నట్టుగా ఉంది. ఎన్నాళ్ల బరువో రుద్దీ రుద్దీ తేలిక పడుతున్నట్టుగా ఉంది. అది పరవశం కాదు. ఊపిరి అందని చోట ఒక తెమ్మెర తాకడం.

ఒక నిమిషం... రెండు నిమిషాలు... మూడు నిమిషాలు....

కళ్ల నుంచి నీళ్లు ఉబకడం మొదలుపెట్టాయి. ధారాపాతంగా కారిపోతూ ఉన్నాయి.

ఏడుస్తున్న పసిపాప.

ఏమీ చెప్పుకోలేని ఆడశిశువు.

దీదీ చేతులు ఇప్పుడా శిశువును లాలిస్తూ ఉన్నాయి. శరీరమంతా నిమురుతూ ఉన్నాయి. దేహమంతటినీ సంపూర్ణంగా తడుముతూ ఉన్నాయి. కాని అవి ఆత్మను వెతుకులాడుతున్నట్టుగా కనిపించాయి.

ఎందుకు బేటీ? అడగాలనిపించింది.

కాని ఆ ప్రశ్న స్పష్టంగా వినిపించింది.

స్పర్శ కావాలి.

నీ భర్త ఇస్తున్నాడు కదమ్మా.

తీసుకుంటున్నాడు దీదీ. ఇవ్వడం లేదు.

అర్థం కాలేదు బేటీ.

కాసేపు దగ్గర కూడి తాకడానికి కోరిక చాలు దీదీ. కాని మీద చేయి వేసి పక్కన పడుకోవడానికి ప్రేమ కావాలి. చాలా ప్రేమ కావాలి. ఇల్లు బట్టలు ఫేషియల్‌కి డబ్బులు ఇవి ఇస్తే సరిపోతుందనుకుంటారు. కాని పక్కన చేయి పట్టుకొని కూచోవడం అక్కర్లేదను కుంటారు. ఆ దప్పిక ప్రాణం తీస్తుందని ఎవరు చెప్పాలి దీదీ... ఎలా చెప్పాలి... ఇదంతా ఉగ్గబట్టుకుని ఎలా నిలబడాలి... ఎంతకాలం నిలబడాలి....

ఆ ప్రశ్నతో ఎవరికీ వినిపించని ఆ సంభాషణ ముగిసింది.

కర్టెన్లు తొలిగాయి.

తెరిపిన పడి లేచి కురులు ముడి వేసుకుంటూ కిచెన్‌లోకి వెళ్లి టీ పెట్టుకుని వచ్చింది.

ఇద్దరూ తాగారు.

ఆ తర్వాత డబ్బులు ఇస్తే తీసుకుని దీదీ అక్కణ్ణుంచి వచ్చేసింది.

దీదీకి మసాజ్ టేబుల్ ఎంత ఎత్తు ఉంటుందో ఇప్పటికీ తెలియదు. మెడ నుంచి మొదలుపెడతారా పాదాల నుంచి మొదలుపెడతారా కూడా తెలియదు.


కాని అడిగేవాళ్లు చాలామంది ఉన్నారని తెలుసుకుంది.

రేటు కూడా పన్నెండు వందలకు ఒక్క రూపాయి తగ్గించడం లేదని వార్త.

**- మహమ్మద్ ఖదీర్‌బాబు**

# మెట్రో కథలు

# ఛీ...



నగరం అంతటి మీదా ఛీ అని రాసి ఉందా అని అనిపించింది.

రోడ్ల మీదా వీధుల మీదా ఎవరూ లేని మలుపుల్లో మొండి గోడల మీదా...

దూరంగా ఎవడో కారు ఆపాడు. ఫుల్ హ్యాండ్స్ ఇన్ చేసుకుని షూ వేసుకొని ఉన్నాడు. డ్రైవింగ్ సీట్లో నుంచి దిగి కారును ఆసరా చేసుకొని ఆవతలి పక్కకు వెళ్లి టక్ సరి చేసుకుంటూ అక్కడే నిలబడి... ఓహ్... ఏమి విలాసం.

పరిగెత్తుకుని వెళ్లి అడగాలనిపించింది. బాబ్బాబూ.. కాస్త కారును అలాగే అడ్డం పెట్రా... నేను కూడా కానిస్తాను... ఊహూ. ఎలా అడగడం? అలా అడుగుతారా ఎవరైనా? అడిగినా చేస్తారా?

పొత్తికడుపు ఉబ్బిపోయి ఉంది. పెళ్లయిన మొదటిరాత్రి పాలు కాకుండా చెంబెడు నీళ్లు గటగటా తాగేస్తే మనిషివా ఒంటెవా అన్నాడు నవ్వుతూ. ఆ తర్వాత ఎప్పుడు గమనించాడో ఏం పాడో నీ పొత్తికడుపు పెద్దది అన్నాడు. సిగ్గేసింది. అమ్మ ఎప్పుడూ గ్లాసుతో నీళ్లిచ్చేది కాదు. దానికి చాలవురా.... చెంబుతో ఇవ్వండి అని అన్నయ్యనో తమ్ముణ్నో కేకేసేది. నీళ్లు ఇంత ఇష్టంగా తాగే పిల్లను చూడలేదమ్మా అని ఇరుగూ పొరుగూ అనేవారు. ఇంట్లో బావి ఉండేది. నీళ్లు తియ్యగా ఉండేవి. కొబ్బరి చెట్లు ఉండేవి. తాగేన్ని నీళ్లు ఇచ్చేవి. ఎవరింటికెళ్లినా చల్లకేం కొదవా? చూసుకొని చూసుకొని తాగింది లేదు. సిటీకొచ్చాకే.

కొత్తల్లో షాపింగ్‌కు బయల్దేరదీస్తూ బాత్‌రూమ్‌కు వెళ్లిరా అన్నాడు.

ఎందుకు?

బయట కుదర్దు. రెండు మూడు గంటలు తిరుగుతాం కదా.

ఇదేం సమస్యో అర్థమయ్యేది కాదు. చిన్నప్పుడు వస్తే స్కూల్ నుంచి ఇల్లు ఎంత దూరమని? క్లాస్‌లో నుంచి లేచి పరిగెత్తుకుని వెళ్లి రావడానికి నిమిషం పట్టేది కాదు. కాలేజీ కొంచెం దూరమే. కాని మధ్యలో అర్జెంటైతే అమమ్మా... పెదమ్మా... పిన్నీ అని ఎవరింట్లోనైనా దూరడానికి ఏం భయం? అయ్యో.. మా తల్లే అని ఎవరైనా సరే దారి చూపించేవారు. ఇక్కడ ఎలా? దూరగలమా ఎవరి ఇంట్లో అయినా? అంత నమ్మగలమా?

చేతిలో కేక్ ఉంది. బుద్ధి తక్కువయ్యి ఇంత దూరం వచ్చి ఆర్డర్ ఇచ్చింది. సాయంత్రం బుజ్జిగాడి పార్టీ. అపార్ట్‌మెంట్‌లో ఫ్రెండ్సందరినీ పిలుస్తానమ్మా అంటే దగ్గర్లో ఉన్న బేకరీ నుంచి ఏం చెబుతాంలే అని ఇక్కడి దాకా వచ్చింది. గంట నిలబెట్టాడు. ఏసి ఉందిగాని వాష్‌రూమ్ లేదట. నీళ్లు తాగి రావడం తప్పయ్యింది. ఈ ఏసికి ఉబ్బరం ఇంకా పెరిగిపోయింది.

ఆటో... హారన్ మోగించాడు.

నువ్వెళ్లా బాబూ... పంపించేసింది.

ముప్పై నిమిషాలు పడుతుంది ట్రాఫిక్‌లో ఇల్లు చేరేసరికి. కుదుపులకు కాస్పాలే అయిపోతాయి. అది ఆగుతుందా.

రోడ్డుకు ఆ వైపు రెస్టారెంట్ కనిపిస్తూ ఉంది. కచ్చితంగా వాష్‌రూమ్ ఉంటుంది. వెళితే? చూసింది. దాటడానికి వీల్లేకుండా డివైడర్ పొడవునా ఫెన్సింగ్ ఉంది. ఎంతదూరం ఉందో. యూ టర్న్ దాకా వెళ్లి మళ్లీ అంతా నడుచుకుంటూ వచ్చి చేరుకోవాలి. అడుగు వేయడం కష్టంగా ఉందే. ఎలా? పెదాలు బిగపడుతూ నిలుచుంది. ముప్పై రెండేళ్లున్న ఒక స్త్రీ.. ఎనిమిదేళ్ల పిల్లాడి తల్లి.. చేతిలో కేక్ పట్టుకుని, దిక్కులు చూస్తూ, కళ్ల నీళ్ల పర్యంతం అయి నిలబడి ఉంటే ఎందుకు నిలబడి ఉంది అని అడగడానికి లేదు. ఎందుకు నిలబడి ఉందో చెప్పడానికీ లేదు.

పోనీ ఎలాగోలా రెస్టారెంట్ చేరుకోగలిగితే? దానికీ భయం వేసింది. ఒకసారి ఇలాగే అర్జెంటయ్యి దూరి వాష్ రూమ్ నుంచి బయటకు వస్తుంటే మేనేజర్ తను మగాడినని ఎదురుగా ఉన్నది ఒకింటి ఆడకూతురని కూడా పట్టించుకోకుండా చెడామడా మాటలనేశాడు. రెస్టారెంట్‌కు వచ్చినవాళ్లే వాడాలట. దారిన పోయేవాళ్ల కోసం కాదట. వాటర్ స్కార్సిటీ వల్ల టాయిలెట్‌ల నిర్వహణ చచ్చేచావుగా ఉందట. ఇంకెప్పుడూ ఈ పని చేయకండి అన్నాడు.

దగ్గరలో ఏవైనా పబ్లిక్ టాయిలెట్లు ఉన్నాయా అని చూసింది.

అవెక్కడుంటాయి?

అంతలోనే నవ్వు వచ్చింది. ఉంటే మాత్రం వాడగలమా?

ఒకసారిలాగే రెండ్రూపాయలిచ్చి లోపలికి దూరి అదురుతున్న గుండెలతో క్షణంలోనే బయటకు వచ్చేసింది. లోపలంతా బూతు బొమ్మలు. అంటే మగాళ్లు వచ్చి పోతున్నారా? ఎక్కణ్ణుంచి వస్తున్నారు? ఎప్పుడు వస్తున్నారు? ఇప్పుడుగాని చూస్తున్నారా? కాళ్లు వణికిపోయాయి. మా అంగాలు మాకే చూపించి ఇదేం పైశాచిక ఆనందంరా గాడిదల్లారా...

పైకి చూసింది. ఎండ మండిపోతోంది. సూర్యుడికి కృతజ్ఞతలు చెప్పుకుంది. అదే మబ్బు పట్టి చల్లగా ఉంటే తన పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా ఉండేది.

ఏం చేయాలి?

అడుగు కదపడం కష్టంగా ఉంది.

ఒకసారి ఫ్రెండ్ చెప్పింది. తనసలు నీళ్లే తాగదట. తాగి బయటకెళితే ఈ సమస్య ఉంటుందని తాగడం తగ్గించి తగ్గించి అసలు నీళ్లు తాగడమే మర్చిపోయిందట. ఇప్పుడు హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతోంది. ఇంకో ఫ్రెండ్ చెప్పింది. ఇలాంటి టైమ్‌లో మరీ అర్జెంట్ అయితే దాని నుంచి దృష్టి మళ్లించడానికి ఏవేవో ఊహించుకోవాలట. మొగుడితో మైమరపులో ఉన్నట్టు అనుకోవాలట. అప్పుడు తీవ్రత తగ్గుతుందట. ఈ ఎండలో ఈ ట్రాఫిక్‌లో ఈ రోడ్డు మీద మొగుడితో ఏం ఊహించుకోవాలి? లేదంటే మడమకు కాస్త పైన మాటిమాటికీ గీరుకోవాలట. అప్పుడైనా ధ్యాస మళ్లుతుందట. ఇంకా నయం. నడి బజారులో చీర పైకి జరిపి... ఏం ఖర్మ ఇది.

ఉబ్బరం ఇంకా పెరిగిపోయింది.

ఒక ఆలోచన వచ్చింది. ఒన్నాట్ ఎయిట్ నొక్కితే అంబులెన్స్ వస్తుంది. ఇంకేదో నొక్కితే మొబైల్ టాయిలెట్ వస్తే? అది అచ్చంగా ఆడవాళ్ల కోసమే అయితే? అందులో పని చేసేవాళ్లంతా ఆడవాళ్లే అయితే? అలాంటివి ఒక వంద కొని సిటీలో తిప్పుతూ ఉంటే? ఎవరికి చెప్పాలి ఇది...

ఆలోచన ముందుకు సాగలేదు.

అంచు తెగడానికి సిద్ధంగా ఉంది.

ఒక నిమిషం... రెండు నిమిషాలు.. మూడు నిమిషాలు... అయిదూ. అంతకు మించి సాధ్యం కాదు.

కణతలు నొప్పిగా అనిపిస్తున్నాయి. పళ్లు పెదాలను గట్టిగా కొరికేస్తున్నాయి. దేవుడా... శక్తినివ్వు... పరమాత్ముడా అదుపునివ్వు...

కిందకు ఒంగి రెండు మూడు మట్టిబెడ్డలను వెతికి అందుకుంది. అరచేతిలో గట్టిగా అదిమి పట్టుకుంది. ఆ..టో... ఆటోని పిలిచింది. రెండు కిలోమీటర్ల దూరంలో షాపింగ్ మాల్ ఉంది. వాళ్లయితే పట్టించుకోరు. అంతవరకూ ఉగ్గబట్టుకోగలగాలి.

కేక్ ఒళ్లో పెట్టుకుంటూ కాళ్లు రెండూ దగ్గరకు చేర్చుకుంటూ మనిషంతా బంతిలా మారుతూ కూచుంది.

తొందరగా ప్లీజ్... చాలా తొందరగా...

ఆటోవాడు మంచివాడిలా ఉన్నాడు. ఏదో కష్టంలో ఉన్నట్టు కనిపెట్టాడు. రివ్వున బయలుదేరాడు. చేతిలో మట్టిబెడ్డలు నలుగుతున్నాయి. పిండి పిండి అవుతున్నాయి. దేవుడా....

ఆటో ఆగింది.

తూనిగలా దిగి, సెక్యూరిటీని దాటుకుని, రెస్ట్ రూమ్ ఎక్కడా అని అడిగితే థర్డ్ ఫ్లోర్‌లో లేడీస్ వింగ్‌లో అని చెబితే, ఎస్కలేటర్ ఎక్కి ఎక్కి, మళ్లీ ఎస్కలేటర్ ఎక్కి ఎక్కి, మళ్లీ ఎస్కలేటర్ ఎక్కి ఎక్కి....

కనిపించింది.

ఛీ....

దడేలున తలుపులాగి లోపలికి దూరి హైరానా హైరానాగా కమోడ్ మీద కూలబడ్డాక మొదట ఏడుపు వచ్చింది. మొదట ఏడుపే వచ్చింది. చాలాసేపటి వరకూ ఏడుపు వస్తూనే ఉంది.

ఈ దేశంలో ఆడవాళ్లు చాలావాటికి ఏడుస్తూ ఉన్నారు.

దీనికీ ఏడ్పిస్తూ ఉన్నారు.

**- మహమ్మద్ ఖదీర్‌బాబు**

# మెట్రో...





వెళ్లి తీసుకురండి అని నిలబడింది.

దూరంగా ఉన్న టూ వీలర్ పార్కింగ్ వైపు ప్లాస్టిక్ ఆంజనేయస్వామి కీచైన్‌ను ఊగులాడించుకుంటూ వెళుతూ ఉంటే లైట్ల వెలుతురులో ఆ కుట్టించిన ప్యాంట్ కుట్టించిన చొక్కా టక్ మూడొందల యాభై రూపాయల చెప్పులు... విసుగ్గా అనిపించాయి.

చేతిలో ఉన్న పాలిథిన్ కవర్‌ని ఒకసారి చూసుకొని ఎందుకనో దూరంగా జరిగి నిలుచుంది.

చాలామంది లోపలి నుంచి ట్రాలీలతోనే కార్ల వరకూ వచ్చి డిక్కీలు తెరిచి కొనుక్కున్న సరుకులను ట్రాలీలలో నుంచి కార్లలో పడేసి దర్జాగా డ్రైవ్ చేసుకుంటూ వెళుతూ ఉన్నారు. మొగుడూ పెళ్లామూ... ఉంటే పిల్లలూ.

మెట్రోకి కార్లు ఉన్నవాళ్లే ఎక్కువగా వస్తారు. కార్డ్ ఉన్న వాళ్లనే రానిస్తారు.

నాలుగు నెలల క్రితం త్రీ నాట్ ఫోర్ వాళ్ల ఫ్లాట్‌కు వెళ్లినప్పుడు కొత్త డైనింగ్ టేబుల్ కనిపించింది. చిన్నగా ముచ్చటగా చాలా బాగుంది. ఎక్కడ కొన్నారు అని అడిగితే మెట్రోలో అని చెప్పారు. అప్పుడే మొదటిసారి మెట్రో గురించి వినడం. కుకట్‌పల్లిలో చాలా పెద్ద స్టోరట. ఎన్నో ఎకరాల్లో పెట్టారట. అక్కడ దొరకనిదేదీ ఉండదట. అసలు చూడ్డానికే కళ్లు చాలవట. ప్రతి వస్తువూ డిస్కౌంట్‌లో ఇస్తారట. ఫ్రీ గిఫ్ట్లు ఉంటాయట.

ఒకసారి తీసుకెళ్లండీ అంది ఆ రాత్రి.

అందరినీ రానివ్వరు అన్నాడు.

ఎలాగోలా తీసుకెళ్లండీ అంది మళ్లీ.

ఏదో చెప్పబోయాడు. అటు తిరిగి పడుకుంది.

జీతం ఆరు వేలు పెరుగుతుందంటే ఆఫీసు మారి ఈ వైపున కాస్త దూరంగా వచ్చాక ఈ ఫ్లాట్స్ చాలా నచ్చాయి. ఎనిమిది వేలు అద్దె. మెయింటెనెన్స్ ఇతర నెలవారీ ఖర్చులూ హాస్టల్లో పడేయగా పది చదువుతున్న పిల్లవాడి ఖర్చూ అన్నీ పోగా మొత్తం నలభై వేలలో ఒక పదీ పన్నెండు మిగులుతాయి.

ఒకటి రెండు రీసేల్‌కు ఉన్నట్టున్నాయ్... లోనుకు ట్రై చేయండి అనంటే అతి కష్టం మీద పదిహేను పద్దెనిమిది ఇస్తారట. అంతకు మించి పైసా ఇవ్వరట. ఫ్లాట్... థౌజండ్ ఎస్ఎఫ్‌టిది కూడా పాతిక ఉంది.

ఇలా ఎంతకాలం అని అనిపించింది కాని విసుగు కలగలేదు.

పచారి కొట్లో పద్దు ఇచ్చి సామాన్లు తెచ్చుకోవడం, మల్టీప్లెక్స్ ముఖం చూడకుండా దగ్గర్లో ఉన్న సింగిల్ స్క్రీన్ థియేటర్‌లోనే సినిమా చూసి వచ్చేయడం, కుక్కర్లు హాట్ బాక్సుల్లాంటి వాటిక్కూడా సిటీలోకి వెళ్లకుండా దగ్గరలోనే సర్దుకోవడం... నయం ఆర్.ఎస్. బ్రదర్స్‌వాడు కొత్తగా షోరూం తెరిచాడు లేదంటే పండగలకూ పబ్బాలకూ కూడా ఇక్కడిక్కడే కానిచ్చేద్దాం అనంటే అప్పుడూ విసుగనిపించలేదు.

కాని అమాసకీ పున్నానికైనా ఇలాంటి కొత్తవాటికి తీసుకెళ్లి చూపించడానికి ఏం నొప్పి అని?

కార్డ్ సంపాదించడానికి కొన్నాళ్లు అవస్థ పడ్డాడు. అది రిటైలర్లకూ సొంత ఫర్మ్ ఉన్నవాళ్లకీ పైహోదాలో ఉన్న ఉద్యోగులకూ ఇంకా ఎవరెవరికో ఇస్తారట. మామూలు వాళ్లకు ఇవ్వరట. ఏవో పడి సంపాదించాడు. దానిని తెచ్చి చూపించిన రోజు లాటరీ తగిలినట్టుగా సంబరపడింది.

అంటే ఇది తీసుకొని ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్లొచ్చన్నమాట.

అవును.

ఏది కావాలంటే అది కొనుక్కోవచ్చన్న మాట.

అవును.

ఆ అవును విలువ కనీసం వెయ్యి రూపాయలని తర్వాత తెలిసింది.

మొదటిసారి అడుగుపెట్టినప్పుడు ఏమీ అర్థం కాలేదు. పూర్తిగా బెంబేలు పడిపోయింది. ఇంత పెద్ద స్టోరా? టీవీలు... ఒక వంద ఉన్నాయి. వాషింగ్ మెషీన్‌లు... ఒక వంద ఉన్నాయి. మిక్సీలూ గ్రైండర్‌లు... లెక్కలేనన్ని పడి ఉన్నాయి. కూర కలిపే గరిటెలు ఒక వంద రకాలు ఉన్నాయి. ట్యూబులు బల్బులు ఫ్యాన్లు బట్టలు చెప్పులు పండ్లు కూరగాయలు ఆఖరకు సాంబ్రాణీ ప్యాకెట్లతో సహా ఏవైనా సరే ఒకటీ రెండూ లేవు. వంద రకాలే. జనం తోసుకుంటున్నారు. ట్రాలీలు నెట్టుకుంటూ కోరినది అందుకుని పడేసుకుంటున్నారు. బెల్లం ఎండు మిరపకాయలను కూడా పడీ పడీ తీసుకుంటున్నారు. డెబిట్ కార్డులు క్రెడిట్ కార్డులు చేతుల్లో పట్టుకుని క్యూల్లో నిలుచుంటున్నారు.

కంగారు పుట్టి ఇది అయ్యే పని కాదని నాలుగు రకాల పండ్లు తీసుకొని గబగబా బయట పడాలనుకుంది. కాని వాటి బిల్లు వెయ్యి దాటలేదట. వెయ్యి రూపాయలకు మించి సరుకులు కొంటేనే బిల్ చేస్తారట. ఒళ్లు మండి వాటిని అక్కడే పడేసి వచ్చేసింది.

ఇది రెండోసారి రావడం.

బైక్ తెచ్చాడు.

మామూలుగా అయితే చేతిలో ఉన్న పాలిథిన్ కవర్‌ని ఒళ్లో పెట్టుకొని వెనుక కూచుంటుంది. కాని కూచోవాలనిపించలేదు.

ముందు పెట్టుకోండి.

అదేంటి?

పెట్టుకోండంటున్నానా?

మారు మాటాడకుండా కవర్ ముడి వేసి మూట లాగా చేసి కాళ్ల మధ్యలో పెట్టుకున్నాడు.

వెనుక కూచుంది. బైక్ బయలు దేరింది. కళ్ల దగ్గరగా అతడి వెనుకజుట్టు కనిపిస్తూ ఉంది. పెళ్లిచూపుల్లో నిండుగా ఉన్న ఆ తల వెంట్రుకలను చూసే ఇష్టపడింది. ఇవాళ అవి దుమ్ముకూ ధూళికీ హెల్మెట్ వొత్తిడికి అణిగీ అణిగీ జీవం కోల్పోయి... రోజూ చూసేవే... ఇవాళ అయిష్టంగా అనిపిస్తున్నాయి. అపార్ట్‌మెంట్‌లో అందరికీ కార్లున్నాయి. ఆల్టోకూ నానోకు కూడా నోచుకోలేమా?

చేతిలో ఉన్న పర్స్ వైపు చూసుకుంది. అందులో తెచ్చిన డబ్బు అలాగే ఉంది. ఈసారి ఎలాగైనా సరే తీరిగ్గా తిరుగుతూ నాలుగైదు వేలకు కొనేయాలనుకుంది. ఆ డబ్బుకు ట్రాలీ నిండుగా సరుకు రాదనీ కనీసం ట్రాలీలో ఒక మూలకు కూడా రాదనీ అసలు పెద్ద వస్తువు ఏదీ రాదని తెలుసుకుని అవమానపడింది.

టీవీలు చూస్తుంటే ఇంట్లో టీవీ గుర్తుకొచ్చింది. దాని వయసు పన్నెండేళ్లు. వాషింగ్ మెషీన్లు చూస్తుంటే ఇంట్లో ఉన్న వాషింగ్ మెషీన్ గుర్తుకొచ్చింది. వాషింగ్ మెషీనా అది? ప్లాస్టిక్ డబ్బా. మంచి మంచి పిల్లోలు కనిపించాయి. ఇంట్లోవి మార్చి రెండేళ్లు. ఇంత అందమైన డోర్‌మేట్లు ఉంటాయా? ఇంట్లో ఉన్నవాటిని కాలితో కూడా తాకలేమే! కాఫీ కప్పుల సౌందర్యం చూసి చాలాసేపు ఆగిపోయింది. ఇంత మంచివి కావాలంటే ఇంత రేటు పెట్టాల్సిందేనేమో. తాజా చందువాల దగ్గర మాత్రం మనసు చాలా లాగింది. కిలో ఆరు వందల యాభై అట. అమ్మో. ఇక షాంపూల వెరైటీ చూస్తే సిగ్గేసింది. తను ఇంట్లో వాడేది షాంపూనే కాదు.

హెన్నా పెట్టి అది అంటీ అంటక... మామూలు చీర... మ్యాచింగ్ లేని చెప్పులు... జిప్పు సరిగ్గా పడని పర్సు.... అంత పెద్ద మాల్‌లో మేచింగ్ కాని మనిషిలా నిలుచుని ఉంది.

మళ్లీ ఏమీ కొనాలనిపించలేదు. వేయి రూపాయలకు ఏమి వస్తాయో అవి నాలుగు పడేసుకుని బయటకు వచ్చేసింది.

ఇల్లు చేరుకునేసరికి ఎనిమిదిన్నర.

వంట చేయాలనిపించలేదు.

లైట్లు కూడా వేయక నేరుగా వెళ్లి గదిలో పడుకుంది.

చూసీ చూసీ వచ్చి అడిగాడు.

వంట చేయవా?

మీరే ఏదో తెచ్చుకుని తిని పడుకోండి.

నాకు బయట తిండి పడదని తెలుసు కదా.

చివాలున లేచింది.

తెలిస్తే ఏం చేయమంటారు?

బెదిరాడు.

మనం బతుకుతున్నది అన్యాయమైన బతుకు కదా. తెలిసి మీరేం చేస్తున్నారు?

ఆ గొంతుకు అదిరిపోయి చూస్తున్నాడు.

అత్యాశ కాదండీ. మామూలు ఆశ కూడా కాదు. కనీస కోరిక. చిన్న ఇల్లు... అవసరమైన మంచి వస్తువులు... ఆ ఖర్మకు కూడా గతి లేకపోతే కనీసం కాలంతో పాటు కలిసి నడుస్తున్నామనే ఆనవాళ్లు... అవీ లేకపోతే ఏం బతుకండీ ఇదీ.... దరిద్రమైన బతుకు....

నీకేదో దెయ్యం పట్టింది. ఇంతకు మించి నా వల్ల కాదు.

మీ వల్ల కాకపోతే ఎందుకు చేసుకున్నారు? ఎందుకు కన్నారు? పెద్ద మగాడిలా బట్టలు కట్టుకుని ఎందుకు తిరుగుతున్నారు. నా ముందు నిలబడి ఏం యోగ్యత ఉందని మాట్లాడుతున్నారు?....

దెబ్బ తిన్నాడు. అక్కడ నిలబడలేక విసవిసా విసురుగా తలుపు తీసుకుని బయటకెళ్లిపోయాడు.

మళ్లీ ఉలకక పలకక పడుకుంది.

మెట్రో– తనేమిటో తనకు తెలియపర్చింది. ఈ ఒక్క పూటే.

రేపటి నుంచి బహుశా ఈ దారుణమైన పేదరికాన్ని మధ్యతరగతి అనే లేబుల్ కింద వంచన చేసుకుంటూ బతికేయనుంది.

- మహమ్మద్ ఖదీర్‌బాబు

మెట్రో కథలు

# టేస్ట్...



మల్టీప్లెక్స్ నుంచి బయటికి రావడంతోటే ఒళ్లు విరుచుకుంది.

తర్వాతి షో కోసం వచ్చిన వాళ్లంతా వెయిట్ చేస్తూ ఉన్నారు. వాళ్లని పట్టించుకోకుండా ఒక క్షణం ఆగి రెండు చేతులూ పైకెత్తి ఒళ్లంతా విరుచుకుని ఆవలిస్తూ అంతలోనే సిగ్గుపడి పక్కకు చూసింది.

ఎవరైనా గమనించారా?

గమనిస్తే గమనించనీ. ఏమిటి చేయడం. సినిమా అంత చెత్తగా ఉంది. కాని ఇలా ఒక్కత్తే వచ్చి కాలు మీద కాలేసుకుని ముఖ్యంగా ఎడమచేతిని హ్యాండ్‌రెస్ట్ మీద పెట్టుకుని సినిమా చూట్టంలో మజా వచ్చింది.

ఇంతకుముందు ఇది తెలియదు. రెండు టికెట్లు బుక్ చేసి తెచ్చేవాడు. థియేటర్‌లో ముందు నడుస్తూ తీసుకెళ్లేవాడు. సీట్లను వెతికాక నంబర్లు ఏవైనా సరే మొదట కూచుని కుడివైపు కూచోపెట్టుకునేవాడు. కుడిచేతిని హ్యాండ్‌రెస్ట్ మీద పెట్టుకుని మీసాలు గిల్లుకుంటూ సినిమా చూట్టం ఇష్టమట. ఎడమ చేతి మీద బరువు పెట్టి సినిమా చూడటం తనకూ ఇష్టమనే. అడగడానికి లేదు. అందుకే పుర్రచేతి వాటం వాళ్లను చేసుకోవద్దంటారు అని పెద్దగా నవ్వుతాడు. ఇదేమైనా జోకా?

అలవాటు లేని ప్యాంట్‌ను పైకి సర్దుకుంది. అలవాటు లేని చొక్కాను కిందకు లాక్కుంది. మచ్చల చొక్కా. బాగుంది. కాని కొంచెం పొట్టిది. ఉన్న డబ్బులకు అదే వచ్చింది. వెనుక వైపు ఎవరైనా మిర్రిమిర్రి చూస్తున్నారా? చూస్తే చూడనీ.

టైమ్ చూసుకుంది. ఒకటిన్నర. గురువారం దిగుల్లేదు. రెండున్నరా మూడు వరకూ కూడా మంచి భోజనం దొరుకుతుంది. అమీర్‌పేట్ నుంచి కూకట్‌పల్లి ఎంత దూరమని? బస్సెక్కింది. ఫుల్లుగానే ఉంది. అయినా ఇబ్బంది లేనట్టే. ఈ మధ్య ఆడవాళ్ల సీట్లకూ మగవాళ్ల సీట్లకూ మధ్య గేట్లు పెట్టారు. లేకుంటే తమ దేహంలో ఈ ప్రాంతం ఒకటుంది అని తెలియని చోట కూడా చేతులు వేసేస్తారు. కూచుంటే మరీ ఘోరం. ముఖానికి ఎదురుగా నిలుచోవడమే. లేదా భుజాన రెస్ట్ చేస్తారు. ఇక చావండి.

బాబా గుడి వచ్చింది. అర్చకుడు గత వారమే పరిచయం అయ్యాడు. ప్రతివారం వస్తాను స్వామీ అంటే అయ్యో అదేం భాగ్యం తల్లీ... తప్పకుండా రా అన్నాడు. కూటికి గతి లేనట్టుగా సాగే అన్నదానం కాదు అది. అందరూ కలిసి భక్తిగా చేసే భోజనం. ఇవాళ వంకాయ చేశారు. పప్పు ఉంది. సాంబారు సరే. అదనంగా గులాబ్ జాముూన్ కూడా ఉంది. కప్పులో రెండు మూడు జామూన్‌లు వేసుకొని పాకం ఒంపుకుని గుచ్చి గుచ్చి తినడం టైమ్ వేస్టు అనుకుని ఒకటి అమాంతం బుగ్గలో పెట్టుకుంటూ ఉంటే మొబైల్ మోగింది. ఇంకెవరు? మొగుడే.

ఎక్కడా?

గు...గ...వ...ము...

ఏదో మెక్కుతున్నట్టున్నావ్.

అ...గు...బ...గు...

పెట్టేశాడు.

పెళ్లయిన కొత్తలో మూడు నెలలపాటు ఢిల్లీకి తీసుకెళ్లలేదు. ఇక్కడ కష్టం గుంటూర్లో అమ్మావాళ్ల దగ్గరే ఉండు వచ్చిపోతుంటాను అన్నాడు. వచ్చి పోయేటట్టయితే మీ అమ్మవాళ్ల దగ్గర ఎందుకు మా అమ్మవాళ్ల దగ్గరే ఉంటాను అంది. దెబ్బకు దారికొచ్చాడు. కాపురానికి తీసుకెళ్లాక కూడా మొదటి వారంరోజులు చేతిముద్ద తింటేనా? అమ్మ ఇచ్చిన పొడులు, అమ్మ ఇచ్చిన పచ్చళ్లు, అమ్మ నేర్పించిన చారు... ముక్కల పులుసు...

అదేంటి?

కొన్నాళ్లు ఆగు. అలవాటు పడాలి గదా. పైగా నీది పుర్రచేతి వాటం. నాకు కక్కొస్తుంది.

ఒరే గాడిదా. మొదటిరోజు రాత్రి పుర్రచేతివాటం అని దూరం పెట్టావట్రా... మనసులో అనుకుంది.

ఆ తర్వాత మొదలు. ఏది చేసినా పేర్లు. అది నచ్చలేదు. ఇది నచ్చలేదు. ఈ కూర నీ నెత్తిన గుమ్మరించుకో. మా అమ్మైతే ఇలా చేసేదా. అసలు మా ఇంట్లో అయితే...

వినీ వినీ తిండి మీదే వికారం వచ్చేసింది. కాని దేనికదే దారి. వేవిళ్లతో వచ్చే వికారం కూడా వచ్చింది. పాప పుట్టింది. అది చండీరాణి. మూడేళ్లకే ఆటలు మాటలు పాటలతో అల్లరి అల్లరి చేసేస్తుంటే దానికి ఇంకా ఏవేవో నేర్పించుకుందామనుకుంటే నేర్పించనిస్తేనా? మీ అమ్మకేం తెలుసే... చిమిడి పోకుండా అన్నం వండటం కూడా రాదు. నేను నేర్పిస్తా రా... అని ప్రతి దానికీ తీసిపడేయడమే. దానికేం గౌరవం ఉంటుంది? ఐదేళ్లు వచ్చేసరికి హైదరాబాద్‌కు కాపురం మారాక అసలు ఇక్కడ కూడా కాదు... గుంటూరు పంపించేద్దాం... మా అమ్మ అన్నీ నేర్పించుకుంటుంది... మా నాన్న రిటైర్డ్ హెడ్‌మాస్టర్... పులిలా దారిలో పెడతాడు... వాళ్లకు మాత్రం ఎవరున్నారు... ఇదే కదా కాలక్షేపం అన్నాడు.

హ్యాండ్‌రెస్ట్‌నే అడగలేదు.

కూతుర్ని మాత్రం ఏం అడుగుతుంది?

మూడేళ్లు గడిచిపోయాయి. ఏం చేయడానికి లేదు. ఇంకొకరు వద్దట. సాకలేడట. పోనీ ఏదైనా సరదా ఉందా? ఊళ్లో ఉన్నా కదలనివ్వడు. క్యాంపులకెళ్లినా కదలనివ్వడు. ఇంట్లో ఉండాలి. ఇంట్లోనే ఉండాలి. ఆ కాసింత హాల్లో... ఆ కాసింత బెడ్‌రూమ్‌లో... మరీ ముఖ్యంగా ఆ కాసింత వంటగదిలో.

రోజూ ఏదో ఒక టైమ్‌లో ఫోన్ చేస్తాడు.

ఒకటే ఒక ప్రశ్న – ఏం వండుతున్నావ్?

చెప్తుంది. అది తప్ప ఇంకా ఏవో నాలుగు చెప్తాడు.

ఆ రోజు గుర్తుంది. పిరియడ్స్ మొదలయ్యేలా ఉన్నాయి. కడుపులో నొప్పిగా ఉంటే పడుకుని ఉంది. చేశాడు. అదే ప్రశ్న–

ఏం వండుతున్నావ్?

నీ పిండాకూడు.

ఆ సాయంత్రమే ఇంట్లో నుంచి బయటికొచ్చేసింది.

ఎలా బతుకుతావే?

ఎలాగోలా.

ఎక్కడ ఉంటావ్?

ఎక్కడో ఒకచోట.

గ్యాస్ కూడా నా పేరుమీదే ఉంది. మర్చిపోకు. ఏం వండుకుని తింటావ్?

అసలు నేను వంటే చేయను.

సంస్కృతం తెలియడం అక్కొచ్చింది. ఏదో ఒక టైమ్‌లో రెండు క్లాసులు చెప్పు. నెలకు ఎనిమిది దాకా ఇస్తాను అంది తెలిసినావిడ జూనియర్ కాలేజీలో.

ఎనిమిది అంటే పర్లేదు. హాస్టల్‌లో చేరకపోతే మేనేజ్ చేయొచ్చు. పిల్లలు ఎదిగొచ్చి అమెరికా వెళ్లి సంపాదన పంపితే సుఖంగా స్థిరపడి మనిషి కోసం ముఖం వాచిపోయిన కొంపలు చాలానే ఉన్నాయి. అలాంటి ఒకదానిలో రెండు మూడు వేలకే మంచి గది దొరికింది. ఇంకా ఐదుంటాయి. ఏం ఖర్చు ఉంటుంది?

దేవుడే కదా దారి చూపింది.

ఒకరోజు మనసు బాగోక దగ్గరలో ఉన్న టెంపుల్ కాంప్లెక్స్‌కు వెళితే శనగలు, వడ, పెసర హల్వా పెట్టారు. కడుపు నిండిపోయింది. పూజారిని అడిగితే ఓ... ఇలాంటివి చాలా ఉన్నాయ్ అన్నాడు. కొంచెం ఆచూకీ తీస్తే అవును చాలానే ఉన్నాయి. బాబోయ్. ఇన్నా. ఇక అక్కణ్నించి గుళ్లు, గోపురాలు, మఠాలు, ఆశ్రమాలు... సరుకులు తెచ్చుకునే టైము, కూరగాయలు తెచ్చుకునే టైము, సర్దుకునే టైము, పొయ్యి దగ్గర నిలబడి వండుకునే టైము, అంట్లు తోముకునే టైము... అన్నీ లెక్క వేసి ఆ టైమ్‌లో ఒక మెట్రో పాస్ కొనుక్కుని బస్‌లో కూలబడితే సరిపోతుంది కదా అనిపించింది. ఒక గుడిలో మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్... ఒక ఆలయంలో భోజనం... రాత్రికి మరో సన్నిధిలో అల్పాహారం.

సిటీ మనిషిని వదిలేసి దేవుణ్ని పట్టుకుంది.

తను వంటను వదిలేసి ప్రసాదాన్ని పట్టుకుంది.

మూడు గులాబ్‌జాములు చాల్లేదు. నాలుగోది వేసుకొని మళ్లీ అమాంతం బుగ్గన పెట్టుకుంటుంటే ఫోన్.

ఇంటికి ఎప్పుడొస్తావ్?

గు...గ...క...ఖ...

ఇంకేమీ అనను.

ఖొ...వో...గ...గో...

రావా?

వూ.. వే.. ఓ... ఓ..

పెట్టేశాడు.

చేతులు కడుక్కుంది.

- మహమ్మద్ ఖదీర్‌బాబు

# సలి కోటు...

మెట్రో కథలు



సలిగా ఉందా సిన్నీ అంది.

వాడేం మాట్లాడలేదు. తల్లికి తెలియకూడదు అని అనుకున్నాడేమో లోపల ఉన్న వొణుకును అణచుకోవడానికి చూశాడు. కాని బక్కగా ఉన్న పక్కటెముకలు కొంచెం అదిరాయి. ఏడేళ్ల పిల్లవాడు. సన్నగా బలహీనంగా అయిదేళ్ల పిల్లవాడిలా కనిపిస్తున్నాడు.

సలిగా ఉందా నాయనా అని మళ్లీ కొంచెం దగ్గరికి జరిగి మొత్తం శరీరాన్ని ఒంటికి కరుచుకుని ఒంట్లో ఉన్న వేడి ఇవ్వడానికి చూసింది.

కళ్లు మూసుకుని ఉన్నాడు.

పెదాలు కొంచెం ఎండిపోయి ఉన్నాయి.

గాలి ఒదులుతుంటే ముక్కు నుంచి వేడిగా వచ్చి తగులుతూ ఉంది.

బయట లారీలు చాలా వేగంగా అప్పుడొకటి అప్పుడొక్కటి వెళుతున్న రొద తప్ప చీమ చిటుక్కుమనడం లేదు. కాంట్రాక్టర్‌కి స్థలం చూపవయ్యా అంటే ఇదే చూపించాడు. మైదానం. ఇక్కడ పాలిథిన్ షీట్లను కట్టుకుని ఇంకో వారం రోజులు ఉండాలి. పది రోజుల కేబుల్ వర్క్ పనికి ఇంత అని ఇస్తాడు. తీసుకొని ఊరికి వెళ్లిపోవడమే. పనుంటే మళ్లీ రావాలి.

ఇంతకు ముందు ఈ పని తెలియదు. పొలం పనులకు వెళ్లేది. మొగుడు కూడా వెళ్లేవాడు. కాని రానురాను పనులు తగ్గాయి.

జగానంతా రొయ్యలూ సేపలే తింటున్నట్టున్నారు... నేల కానరాకుండా తవ్వి నీళ్లు నింపి మురికి సేత్తున్నారు... రొయ్యలే కావాలంటే గోదారి లేదా... అంతలావు సముద్రం లేదా అన్నాడు మొగుడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా వచ్చే కూలి పోయింది. ఉనికీ పోయింది. అదీ కోపం. ఎవరో ఈ పని చెప్పారు. సిటీలో పని. అక్కడితో పోలిస్తే మూడింతలు కూలి. మూడేళ్లుగా ఇందులో దిగారు. కుటుంబాలతో సహా ఎక్కడకు రమ్మంటే అక్కడకు దిగిపోవడం. చూపించిన చోట ఉండిపోవడం. గుంతలు తవ్వి కేబుల్ పరిచి వెళ్లిపోవడం.

పోయినసారి కంటే ఈసారి ఈ స్థలం నయంగానే ఉందనిపించింది.

పోయినసారి ఉప్పల్ దగ్గర ఏదో పాడుబడ్డ స్థలం చూపించారు. సరే ఏదో ఒకటి అది దిగితే రెండు రోజులు బాగానే ఉంది. మూడోరోజు తెల్లారి పక్క పాలిథిన్ గుడిసె నుంచి ఒకటే ఏడుపు. మూడేళ్ల పిల్లవాణ్ణి పాము కరిచి పోయింది. రాత్రి ఎప్పుడు దూరిందో. తల్లి ఏడుస్తుంటే తండ్రి కూడా గుండెలు బాదుకున్నాడు. ఇంకో గంటకి తండ్రి కూడా పోయాడు. ఇద్దరిని కరిచిపోయింది ఆ మాయదారి పాము.

అందుకే ఈసారి జాగ్రత్తగా చూసి మరీ మొగుడి చేత పాలిథిన్ షీట్లు గట్టిగా కట్టించింది. వెతికి వెతికి ఇటుకరాళ్లు తెచ్చి అంచులు లేవకుండా బరువుతో బంధించింది. వస్తూ వస్తూ సుబ్రహ్మణ్య స్వామి పటం తెచ్చుకోవడం కూడా మర్చిపోలేదు. కాని ఈసారి చలి పాములా బుస కొడుతుందని మాత్రం ఊహించలేదు.

ఈ టైమ్‌లో ఆ పక్కంతా సలంట కదయ్యా అంది బయల్దేరే ముందు.

ఏహె... ఏం సలి. పోదాం పదా. నాలుగు డబ్బులొస్తే పండక్కి పనికొస్తాయి అన్నాడు.

ఆ మాట నిజమే. సంక్రాంతి ఇంకో రెండు మూడు వారాల్లో ఉంది. డబ్బులొస్తే పండక్కి నిజంగానే అక్కర కొస్తాయి. బయల్దేరింది. తీరా ఇక్కడికొచ్చాక ఈ చలి దాక్షారామం, రామచంద్రాపురం చలిలా లేదు. అసలు ఇలాంటి చలి ఎరగదు. ఇలాంటి చలికి ఏం కప్పుకోవాలో తెలియదు. ఒకవేళ తెలిసినా అలాంటి ఒక్క గుడ్డముక్క కూడా లేదు.

నేల మీద రెండు చాపలు పరిచింది. ఒకదాని మీద మొగుడు స్వాధీనం లేకుండా పడి నిద్ర పోతున్నాడు. ఎనిమిది నుంచి నాలుగు దాకా పని చేసి వచ్చాక పెండలాణ్ణే కొంచెం తిని తినేముందు ఒళ్లు నొప్పులకు కాసింత తాగి పడుకుంటాడు. ఇక పిడుగులు పడినా లేవడు. ఒంటి మీద ఉండేది పెద్ద చెడ్డీ చొక్కానే. కాని సలి అనే మాటే అనడు. అంత మొద్దయిపోయాడు. కాని పిల్లవాడు?

మళ్లీ ఒణికాడు.

సలిగా ఉందా

బంగారూ కప్పిన పాత చీరనే మళ్లీ కప్పుతూ ఇంకా దగ్గరకు జరిగింది.

మామూలుగా అయితే ఐద్రాబాదు వస్తున్నారంటే పిల్లలందరికీ హుషారు. పోయిన వేసవిలో వచ్చినప్పుడు బాగా ఆడుకున్నారు. ఉదయాన్నే మగవాళ్లంతా పనికి పోతారు. ఆడవాళ్లు వంటలో పడతారు. అదిలించేవాళ్లు ఒక్కరూ ఉండరు. ఇక చెట్ల కింద మట్టిలో పుల్లలేరుకుంటూ గోలీలాడుకుంటూ వాళ్లిష్టం. అలా అనుకునే ఈసారి వచ్చారు. రెండు రోజులు గడిచే సరికి మెత్తగా అయిపోయారు. ప్రతి పిల్లదీ పిల్లవాడు తెల్లారాక గుడిసె నుంచి బయటికొచ్చి ఎండలో ముజ్జుగా కూచోవడమే. రాత్రంతా చలి వాళ్ల గొంతు పిసికిందని వాళ్లకేం తెలుసు?

ఒణకడం ఆపలేదు.

తెల్లారి మోపెడ్ డాక్టర్‌ని పంపించేసి తప్పు చేశానా అనిపించింది. అమా... ఒళ్లెచ్చగా ఉందిమా అని అంటుండగానే మోపెడ్ డాక్టర్ వచ్చాడు. ఇలా కూలి పనుల కోసం వచ్చి దిగేవాళ్ల గుడిసెల చుట్టూ తిరుగుతూ వాళ్లకు మందూ మాకూ ఇస్తుంటాడట. ఆర్‌ఎంపి అయి ఉండాలి. చూపిస్తే ఇది చలిజ్వరము ఇంజెక్షన్ చేయాలి నూటేభై అవుతుంది అన్నాడు. యాభై ఇస్తాను ఏం చేస్తావో చేయి అంది. ఎగాదిగా చూసి వెళ్లి పోయాడు.

కాస్త వేడివేడి అన్నం రెండు ముద్దలు తినిపించింది. ఎండలో కూచోబెట్టింది. బజారుకు నడుచుకుంటూ వెళ్లి మాత్ర తెచ్చి మింగించింది. తగ్గుతుందిలే అనుకుంది. తగ్గలేదు.

నిన్న ఒంటి నిండుగా స్వెటర్ వేసుకొని మంకీ క్యాప్ పెట్టుకుని చేతిలో పొన్నుకర్రతో ఆ దారిన వాకింగ్‌కు వెళుతున్న ఒక పెద్దాయన ఆ తెల్లారి పూట అంత చలిలో ఒంటి మీద సరిగ్గా బట్టలు లేకుండా గుడిసెల బయట మందకొడిగా తిరుగుతున్న పిల్లలను చూసి ఇంతకు మించి చోద్యముందా అన్నట్టుగా ఆగిపోయాడు.

రాత్రి ఎంత చలి కొట్టిందో తెలుసు.

ఇంత చలిలో ఈ పిల్లల్నేసుకొని ఎలా ఉన్నారమ్మా?

ఏం చేస్తాం సామీ. రాత.

ఆయన వాకింగ్ మానేసి వెనక్కు వెళ్లిపోయి గంట తర్వాత తెచ్చాడు.

ఇంట్లోవి తెచ్చాడో వాళ్లనూ వీళ్లనూ అడిగి తెచ్చాడో పిల్లల బట్టలు కొన్ని ఒకటి రెండు దుప్పట్లు ఇంకేవో మగవాళ్ల బట్టలు తెచ్చాడు. కాని పిల్లలకు మాత్రం చేతిలో ఉన్న మూడు నాలుగు స్వెటర్లే కనిపించాయి.

పరిగెత్తుకుంటూ వెళ్లి చొక్కాలు చడ్డీలు ఇస్తుంటే కాదని స్వెటర్ల కోసం వెంట బడ్డారు.

గబగబా పంపించింది.

పో సిన్నీ... నువ్వు కూడా తెచ్చుకోపో.

అందరూ మూగారు.

అయ్యా... సలికోటు.... నాక్కావాలి సలికోటు.... నాకు... నాకు.... అయ్యా... ఒక్క సలికోటు...

ఉన్నవి అయిపోయాయి. ఒక కనకాంబరం రంగు చొక్కా మాత్రం దక్కింది. కొంచెం లూజుగా ఉన్నా అందులో అందంగా ఉన్నాడు. ముద్దు పెట్టుకుంది. జవాబు చెప్పడని తెలిసినా మళ్లీ అడిగింది... సలిగా ఉందా సిన్నీ...

బయట చీకటి చలిలా ఉంది. చలి చీకటిలా ఉంది. బాగా పెరిగిందో ఏమో తిరిగే లారీలు కూడా ఎక్కడివక్కడ ఆగిపోయినట్టున్నాయి. ఎప్పుడోగాని రొద వినిపించడం లేదు.

అమా... అన్నాడు.

సెప్పు సిన్నీ.....

అంతకు మించి ఏమీ మాట్లాడలేదు. ఒణుకుతున్నాడు. మొగుడివైపు చూసింది. ఇద్దో... నిన్నే.... కదిలితే కదా. గురక పెడుతున్నాడు. ఒణుకు పెరిగింది. లేచి ట్రంకుపెట్టెలో ఉన్న ఒకటి అరా గుడ్డల్ని కూడా వాడికి చుట్టింది. ఎన్ని చుడితే మాత్రం ఏం లాభం. పైన ఉన్నది ఒక పలుచటి పాలిథిన్ షీట్. కాని ఆకాశం కింద పడుకున్నట్టే. ఊ.. ఊ... మూలుగుతూ ఉన్నాడు.

సిన్నీ... సిన్నీ....

నేల జిల్లుమంటోంది. చాప జిల్లుమంటోంది. చుట్టబెట్టిన గుడ్డముక్కలు జిల్లుమంటున్నాయి.

సిన్నీ... బంగారూ....

ఏం చేయాలో తోచక వెచ్చగా ఉన్న బుగ్గల మీద వెర్రిగా ముద్దుల మీద ముద్దులు కురిపించింది.

బయట ఆకాశం మీద అతి శీతలంగా ఉన్న గండభేరుండం ఒకటి ఎగురుతూ ఉంది. అది ఇవాళ తన బిడ్డను ముక్కున కరుచుకుపోనుంది. కుదరదు. తన కంఠంలో ప్రాణం ఉండగా కుదరదు. ఏం మిగిలి ఉందో తెలుసు. దానిని విప్పేసింది. పిల్లాడి ఒంటి నిండా చుట్టేసింది. తిను... నన్ను తినవే... నగ్నంగా ఉన్న ఒంటిని చూసుకుంటూ చలిని దెప్పి పొడిచింది.

ఇప్పుడు తన బిడ్డకు తనే సలికోటు.

మోకాళ్ల మీద ఒంగి అటోకాలు ఇటో కాలు వేసి మొత్తంగా మీదకు వాలుతూ ఒక గొడుగులాగా దుప్పటిలాగా కప్పులాగా వెచ్చటి రగ్గులాగా మీదకు వాలిపోయింది.

తెల్లారింది.

మరో గంటలో చాలా న్యూస్‌చానళ్లకు మంచి మేత దొరికింది. జనం తండోపతండాలుగా వచ్చారు. లీడర్లు వచ్చారు. ఎన్.జి.ఓలు వచ్చారు. నిజంగా మామూలు మనుషులు కూడా ఇళ్లల్లో ఉన్న స్వెటర్లు రగ్గులు తెచ్చి ఆ గుడిసెలన్నీ నింపేశారు.


పిల్లవాడికి వైద్యం అందింది.

ఎవరో పూలపూల సలికోటు కూడా అందించారు.

కాని- ప్రాణమున్న సలికోటును మాత్రం ఎవ్వరూ తెచ్చివ్వలేకపోయారు.

- మహమ్మద్ ఖదీర్‌బాబు

# సబ్‌వే...



పదండి సీనియర్‌గారూ అని నవ్వింది.

అలాగే జూనియర్‌గారూ అని తోడు కలిపాడు.

ఆరంజ్, ఎల్లో ప్యాట్రన్‌లో అందంగా తయారైన టేబుల్స్‌లో మూడో వరుసలో ఉన్న మొదటిది వాళ్ల ఫేవరేట్. ఎప్పుడూ అక్కడే కూచుంటారు. పదిహేను నిమిషాలు... మహా అయితే అరగంట. ఆఫీసులో రొడ్డకొట్టుడు పనిలో అదే పెద్ద వెసులుబాటు.

కాని ఇవాళ రోజూ కలిసినట్టుగా కాదు. ఇవాళ ప్రత్యేకం. మెనూ అందుకుంది.

బిల్ నేను పే చేస్తాను. అడ్డు చెప్పకూడదు.

సరే.

చట్‌పటా చనా, ఆలూ పాటీ చెప్పింది. టిన్ కోక్ ఒకటి చెప్తే ఆఖరులో చెరి సగం తాగుతారు.

సో... అంది.

సో... అన్నాడు.

చూసుకున్నారు. మాటలు రాలేదు. మూడేళ్లుగా కూచుంటున్నారు. ఎప్పుడో ఒకసారి ఇలా జరుగుతుందని తెలుసు. అందుకే ప్రిపేర్డ్‌గా ఉన్నట్టు బిహేవ్ చేస్తున్నారు. సుద్దులు చెప్తున్నట్టుగా అంది–

కొత్త ఆఫీసులో అయినా సరిగ్గా లంచ్ బాక్స్ తెచ్చుకో. డెస్క్‌లో కొన్ని డ్రైఫ్రూట్స్ పెట్టుకొని అప్పుడు కొంచెం అప్పుడు కొంచెం తిను. టీలు తక్కువ తాగు. అలా గడ్డం పెంచకు. ఆరు నెల్లకు ఒకసారి కంప్లీట్ చెకప్ చేయించుకో. ఇవన్నీ పదే పదే చెప్పడానికి చేయించడానికి అక్కడ నేను ఉండను. గుర్తు పెట్టుకో....

ముఖంలోకి చూడలేక తలాడించాడు.

అన్నింటి కంటే ముఖ్యం ఇంక మెయిల్స్, వాట్సాప్‌లు, ఫేస్‌బుక్ పలకరింపులు బంద్ చెయ్. ఫర్మాలిటీగా కంటిన్యూ చేసి తర్వాత కట్ చేయడం కన్నా వెంటనే కట్ చేయడం మంచిది. మనమేం చిన్నపిల్లలం కాదు కదా. ఏమంటావ్?...

మళ్లీ తలాడించాడు.

ఏదీ నా వైపు చూడు...

చూశాడు.

ఒరి బాబో... ఏడవకురా తండ్రీ....

పెద్ద పెద్దగా నవ్వింది. కాసేపాగి కళ్లు తుడుచుకుంటూ నవ్వే ప్రయత్నం చేశాడు.

ఆఫీసులో చేరిన కొత్తలో ఇలాగే ఏడ్చింది. పని చేతగాక ఏడుపు తన్నుకొచ్చేది. పెళ్లికి ముందు ఉద్యోగం చేసేదే. పెళ్లి తర్వాత ఏడేళ్లు ఉద్యోగం మాటే మర్చిపోయింది. ఆ తర్వాత మళ్లీ చేరితే ఎంత అనుభవం ఉన్నా తెలిసిన సాఫ్ట్‌వేర్ తతంగమే అయినా మారిపోవాల్సినవన్నీ మారిపోయే ఉంటాయి కదా. ఏమైనా కావాలంటే మీ సీనియర్‌ని అడగండి అన్నాడు టీమ్ లీడర్. సీనియర్ అంటే వాడెంత పెద్దాడో ఏ నలభై నలభై అయిదేళ్ల వాడో అనుకుంది. తన కంటే చిన్నవాడు. ముప్పై ఏళ్లు కూడా దాటని వాడు. కాని సీనియర్ సీనియరే కదా. డౌట్లు తీర్చే పద్ధతి విసుక్కోకుండా పని నేర్పే పద్ధతి ఎంత పనిలో ఉన్నా పోజు కొట్టక అటెండ్ చేసే పద్ధతి నచ్చి సీనియర్‌గారూ అని పిలవడం మొదలుపెట్టింది. జూనియర్‌గారూ అని తిరిగి జవాబు ఇవ్వడం మొదలుపెట్టాడు. అదో చిన్న నవ్వు.

ఇద్దరూ సిటీలో ఈ మూల నుంచి ఒకరు ఆ మూల నుంచి ఒకరు తెల్లారి ఎనిమిదికి బయలు దేరుతారు. క్యాబ్‌లో గంటా గంటన్నర జర్నీ నరకం. వచ్చాక సీట్లకు అతుక్కుపోయి మళ్లీ క్యాబ్ ఎక్కి ఇల్లు చేరేంత వరకూ అదో నరకం. ఏసి అద్భుతంగా ఉంటుంది. కాని గాలే ఆడనట్టుగా అనిపిస్తూ ఉంటుంది. కూచుని కూచుని ఉబుసుపోక–

మీ ఆవిడ ఏం వండిందండీ అని వచ్చి కూచునేది.

ఏం వండలేదండీ. తను పొద్దున్నే లేచి చేయలేదు. బాబుతో కుదర్దు.

పర్లేదు. నేను తెచ్చాను లెండి. తినండి.

మొహమాటస్తుడు. వినేవాడు కాదు.

సరే. సబ్‌వేలో అయినా ఏదైనా ఎంగిలి పడదాం పదండి... బలవంతం చేసేది.

ఆఫీసుకు ఫర్లాంగు దూరంగలో సబ్‌వే ఉంది. అందరూ వెళ్లి తింటుంటారు. వీళ్లకూ అలవాటైంది.

అందరికీ చిన్నప్పటి ఫ్రెండ్స్ ఉంటారు. మాట్లాడిందే మాట్లాడి కొత్తదేం మాట్లాడటానికి ఉండదు. పైగా మనం ఏ మానసిక స్థితిలో ఉన్నామో వాళ్లకు తెలీదు. కలీగ్స్ ఉంటారు. కాని అందరికీ అన్నీ చెప్పుకునే పరిస్థితులు ఉండవు. ఎవరో ఒకరు భద్రంగా క్షేమంగా అనిపించాలి. తలుపు తట్టాలి.

మీ ఆయన మంచివాడే కదండీ....

చాలా. మీ ఆవిడ?

దేవత కదండీ...

కొన్నాళ్లకు ఈ సంభాషణ మారుతుంది.

అబ్బో... మా ఆయనకు చాలా కోపమండీ....

అమ్మో... మా ఆవిడ చాలా సతాయిస్తుందండీ....

నిజానికి పెళ్లయిన మొదటి మూడు రాత్రులలోనే సమస్య తెలిసింది. పెర్ఫార్మెన్స్ యాంగ్జయిటీ. ఆ తర్వాత కూడా సమస్య పోలేదు. రాత్రి వైఫల్యం కప్పిపుచ్చుకోవడానికి పగలంతా పెత్తనం చేస్తున్నట్టుగా బిహేవ్ చేస్తాడు. అదంతా చెప్పలేదు. ఏం అలా ఉన్నారు అనడితే–

ఎవరి బాధలు వారివి లేండి అని ఊరుకుంటుంది.

తెలియకపోతే కదా.

పెళ్లయి ఇన్నాళ్లయినా నిజంగా గౌరవిస్తుందా ప్రేమిస్తుందా పక్కన కూచుని మెత్తగా ఎందుకు మాట్లాడదు ప్రతిదీ సందేహమే.

ఆ మాటా నిజమే లేండి అని ఊరుకుంటాడు.

ఇంతకుమునుపు క్యాబ్ ప్రయాణం బోర్ కొట్టేది. ఇప్పుడు ఇద్దరూ చెరో క్యాబ్‌లో బయలు దేరాక ఫోనో, వాట్సాప్పో నడిచిపోతూ ఉంటుంది. ఆఫీస్‌లో ఒకసారి కలిసి కాఫీ తాగుతారు. అతడి కోసం ఒక డబ్బా ఎక్కువ తెస్తుంది గనక కలిసి భోంచేస్తారు. సాయంత్రం సబ్‌వేలో స్నాక్ తినే మిష మీద ఏవో ఉబుసుపోని కబుర్లు చెప్పుకుంటారు. అతడికి జ్వరం వస్తే ఆమె టాబ్లెట్ తెస్తుంది. ఆమెకు పని పెరిగితే అతడు చేసి పెడతాడు. ఆఫీస్‌లో అందరూ గమనించారు. ఎవరూ గమనించనట్టే ఉన్నారు. ఆమె జోలికి ఇంకే మగవాళ్లు రావడం లేదు. అతణ్ణి వేరే ఆడవాళ్లెవ్వరూ కదలించడం లేదు. అంతకు మించి ఏమైనా జరిగిందా అని కుతూహలం ఉన్నవాళ్లు ఉన్నారు లేనివాళ్లూ ఉన్నారు.

ఇంతకు మించి ఏమీ వద్దు కదా అడిగాడు ఒకరోజు.

చూసింది.

అడగడం నార్మల్. అడక్కపోతే అబ్‌నార్మల్... నసిగాడు.

వద్దు.

ఆ తర్వాత ఆ చర్చ మళ్లీ ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు ఇంకా పెద్ద సంస్థలో ఇంకా మంచి ఆఫర్ వచ్చింది. వెళ్లిపోతున్నాడు.

బిల్లు కట్టేసింది. చీకటి పడిపోయింది. ఇద్దరూ కావాలనే క్యాబ్‌ని మిస్ చేసేశారు.

నిన్ను ఇంటి దాకా దింపనా? అడగలేక అడగలేక అడిగాడు.

వద్దు. బస్‌లో వెళతాను.

చూసుకున్నారు.

సో... అన్నాడు.

సో... అంది.


చేయి ఊపింది. చేయి సాచాడు. చివరి కరచాలనం.

రేపు మళ్లీ తెల్లారుతుంది. మళ్లీ ఆఫీసు ఉంటుంది. కాకపోతే వీళ్లు మళ్లీ ఇలా ఉండకపోవచ్చు. అందరూ ఇలా ఉండకపోవచ్చు. కాని ఇలా ఉండి ఆర్డర్ ప్లేస్ చేసేవారి కోసం మాత్రం సబ్‌వేలో పదార్థాలు తయారవుతూనే ఉంటాయి.

**- మహమ్మద్ ఖదీర్‌బాబు**

# రూటర్...

మెట్రో కథలు



ఏంట్రా...

ఏంటి?

ఏమంటావ్?

నే వెళుతున్నా.

వెళ్తావా?

ఇక నాకు కాల్ చేయకు. రిస్క్‌లో పడేశావ్. దేవుడా..

రేయ్...

పరిగెత్తి బైక్ సపోర్టింగ్ రాడ్ పట్టుకుంది.

వదులు.

నన్నేం చేయమంటావ్?

నన్నడిగితే?

విదిలించుకుని వెళ్లిపోయాడు.

రొప్పుతూ ఏడుపొస్తున్నట్టుగా అవుతూ ఏం తోచనట్టుగా దిక్కులు చూస్తూ బస్టాప్‌లో కూలబడింది. రూట్ బస్సులు తిరగడానికి ఇంకా టైమ్ ఉంది. ఈలోపు వాడు కాల్ చేస్తే? ఇప్పుడు కావాలి రా అంటే? ఎందుకైనా మంచిదని సెల్ ఆఫ్ చేసింది. చేశాక దానివైపు చూసుకుంది. దరిద్రం. అంతా దీని వల్లే వచ్చింది.

ఏంటమ్మా... ఏదైనా ప్రాబ్లమా?

అబ్బే... ఏం లేదండీ... తెలిసిన అబ్బాయే.

ఏంటో... ఈ కాలం పిల్లలు...

బస్సొస్తే ఎక్కి వెళ్లిపోయింది. ఇప్పుడు బస్టాప్‌లో ఎవరూ లేరు. మధ్యాహ్నం మూడంటే పెద్దగా ఎవరూ ఉండే టైమ్ కాదది. సాయంత్రం దాకా క్లాసులున్నాయి. మాట్లాడాలని బైక్ ఎక్కి తీసుకు వచ్చింది. తీరా సంగతి చెప్పాక పారిపోయాడు. వెధవ. ఇప్పుడు ఎవడు కాపాడతాడు?

ఎదురుగా పెద్ద బిల్డింగ్ మీద చాలా పెద్ద హోర్డింగ్ కనిపిస్తూ ఉంది. రూ.599కి ఒక ప్యాకేజ్ అట. రూ.999కి ఇంకో ప్యాకేజ్ అట. రూ.1199 కడితే ఇక తిరుగే లేదట. ఏమైనా చేసుకోవచ్చట. మొదట తమ్ముడు మొదలెట్టాడు. తర్వాత తను వెంటపడింది. హాల్లో అందరికీ కనిపించేలా ఉన్న కంప్యూటర్‌కి నెలకు ఆరు వందల ప్యాకేజీలో ఇంటర్నెట్ కనెక్షన్ వచ్చింది. కొత్తల్లో అంతా బాగుంది. మెయిల్స్ చూసుకునేవారు. యూ ట్యూబ్‌లో సినిమాలు చూసుకునేవారు. చదువుకోవడానికి మెటీరియల్- తమ్ముడికి ఇంటర్ సంగతేమోగాని తనకు బి.టెక్‌కు చాలా అవసరమే పడింది. నాన్నకు ఫేస్‌బుక్ పరిచయం చేశారు. అమ్మ ఫస్ట్‌టైమ్ ఈమెయిల్ అకౌంట్ క్రియేట్ చేసుకుని ఇద్దరు పిల్లల పేర్లను కలిపి పాస్‌వర్డ్‌గా పెట్టుకుంది. ఇరుగూ పొరుగూ ఫ్లాట్స్ వారికి కూడా సంతోషమే. ఇల్లంటే ఏమిటి? టూ బెడ్‌రూమ్స్, కిచెన్, స్విఫ్ట్ కారు, కంప్యూటర్, ఇంటర్‌నెట్.... కాని కాదని కాలక్రమంలో తేలింది. స్మార్ట్‌ఫోన్స్ లేకపోవడం వల్ల వచ్చిన పెద్ద వెలితి అది.

తండ్రి మరీ అంత స్పీడ్ మీద ఉండే మనిషి కాదు. అలాగని ప్రతిదాన్నీ నిరోధించేవాడూ కాదు. లోటు చేయకుండా ఇంట్లో ఉన్న నలుగురికీ రెండు మూడు వేలు పెట్టి నోకియాలు తీసుకున్నాడు. బయట, ఆఫీసులో రింగ్ వస్తే జేబులో నుంచి దానిని బయటకు తీస్తే అందరూ చిత్రంగా చూడటం ఇబ్బందిగా ఉన్నా పిల్లలు దానిని భరించలేకపోతున్నారని త్వరగానే అర్థం చేసుకున్నాడు. మరీ పదిహేనువేలూ పద్దెనిమిదివేలూ పెట్టి సామ్‌సంగ్‌లు సోనీలు కాదు వేరేవి ఆలోచించండి అంటే ఆరేడు వేలకు బ్రహ్మాండమైన చైనా ఫోన్లు వచ్చాయి. కావల్సిందేమిటి? ఫేస్‌బుక్, వాట్సప్. అవి బాగా పని చేస్తాయి.

కొత్తల్లో పిల్లలిద్దరికీ చెరి నూటేభై రూపాయలు శాంక్షన్ చేశాడు ఇంటర్నెట్ డేటా కోసం. అది ఏ మూలకు? నలుగురితో చాట్ చేస్తే నాలుగు డౌన్‌లోడ్‌లు చేస్తే చిటికెలో బేలెన్స్ అయిపోయేది. మళ్లీ డబ్బులడగాలంటే లేని కుటుంబం కాదుగాని కలిగిన కుటుంబం కూడా కాదు. పెద్ద ఇబ్బందే.

రూటర్ పెట్టించండి నాన్నా అంది ఒకరోజు.

మంచి విరుగుడు. వెయ్యి రూపాయలు ఖర్చు పెట్టి తెప్పిస్తే ఉన్న ఇంటర్‌నెట్ కనెక్షన్ మీద ఇంట్లో అందరికి వైఫై వస్తుంది. అందరి ఫోన్లూ హ్యాపీగా పని చేస్తాయి. అన్‌లిమిటెడ్‌గా నెట్ వాడుకోవచ్చు. అన్నింటికంటే మంచి విషయం ఏమిటంటే ఇంతకు ముందులా హాల్లో కూచుని ఏం చేస్తున్నా నలుగురికీ తెలిసేలా చేసే బాధ తప్పడం.

ఆడపిల్ల అని ఒక బెడ్ రూమ్ ఇచ్చారు. వాడు గొడవకు దిగితే డైనింగ్ ఏరియాను ఖాళీ చేసి ప్లైవుడ్ కొట్టి వాడికో గదిలాంటిది తయారు చేశారు. సరే వీళ్లకూ మాస్టర్ బెడ్‌రూమ్ ఎలాగూ ఉంది. ఇప్పుడు ఇరుగూ పొరుగూ వాళ్లు నిజంగా సంతోషించారు. నలుగురి చేతుల్లో నాలుగు స్మార్ట్‌ఫోన్లు. నలుగురూ ఇంట్లో ఉంటారు. నలుగురూ ఫోన్లో ఉంటారు. ఇంతకు మించి ఏం కావాలి?

మొదట రణ్‌బీర్ కపూర్‌ని ఇష్టపడే క్లాస్‌మేట్స్ అంతా వాట్సప్‌లో ఒక గ్రూప్ అయ్యారు. ఎక్కువగా అమ్మాయిల గ్రూపే. కాని అబ్బాయిలు దూరకుండా ఉంటారా? ఆ తర్వాత ఒన్ టు ఒన్ చాటింగ్ మొదలయ్యింది. తొమ్మిదికల్లా పుల్కాలు తిని పాలు తాగి ఒక ఆపిల్ కాసిని అనాసముక్కలో తీసుకుని గదిలో దూరితే అమ్మలు చదువుకుంటోందని ఒకటే మురిపెం. కాని తలుపు గట్టిగా బిడాయించుకుని మూడ్ కోసం బెడ్‌లైట్ వేసుకుని ఆ నీలి వెలుతురులో గుట్టు చప్పుడు కాకుండా స్క్రీన్ మీద అక్షరాలను బ్లింక్ చేస్తూ పోతూ ఉంటే గంటలు గంటలు... డబ్బులవుతాయన్న బాధే లేదు. రూటర్ ఉందిగా.

ఒకరోజు మాట మారింది. ఒక దారి నుంచి ఇంకో దారిలోకి మళ్లింది. బాగా నిద్ర పట్టి తెల్లారి ఆలస్యంగా నిద్ర లేచింది.

కాలేజ్ చేరుకున్నాక క్లాసుల హడావిడిలో ఫోన్ ఎప్పుడు తీసుకున్నాడో చాటింగ్ ఎప్పుడు చూశాడో ఎప్పుడు మెయిల్ చేసుకున్నాడో తెలియదు. చాట్ చేసినవాడు ఫ్రెండే. దానిని కాపీ చేసుకున్నవాడూ ఫ్రెండే. చాట్ హిస్టరీని డిలీట్ చేయకపోవడం వల్ల దొరికిపోయింది.

ఒక బెడ్ మీద లేరన్నమాటేగానీ తక్కినవన్నీ జరిగాయిగా అన్నాడు మరుసటి రోజు నవ్వుతూ.

హాస్యం అనుకుంది. కాదు. మెయిల్‌లో ఉన్నదంతా చూపించాడు.

వాడు సరే... నువ్వు మరీ రెచ్చిపోయావుగా.

పాదాలు చల్లగా అయిపోయాయి.

గ్రూప్‌లో షేర్ చేస్తా. లేదంటే మీ నాన్నకు మెయిల్ చేస్తా. వాడి బాబుకు కూడా.

కలో క్రైమ్ సినిమాయో అయితే బాగుండనిపించింది. కాని కాదు.

నేను చాటింగ్‌కే చొంగ కార్చుకునే బ్యాచ్ కాదు. అసలుది కావాలి. కాల్ చేస్తా.

వెళ్లిపోయాడు.

కాసేపు ఏమీ అర్థం కాలేదు. గొంతు పట్టేసినట్టుగా అనిపించింది. మాటిమాటికి దప్పికేస్తున్నట్టుగా అనిపించింది. ఇదంతా ఈ క్షణంలో అబద్ధం అయిపోవాలని అనిపించింది. కాని కాదు. నిజమే. ఎదుర్కోవాలి. కూడగట్టుకుని ధైర్యం తెచ్చుకుని క్లాస్‌లో నుంచి అర్జెంట్‌గా లేవదీసి బయటకు తీసుకొచ్చి విషయం చెప్తే తన కంటే ఎక్కువగా బెంబేలు పడిపోయాడు.

ఎలా... ఎలా?

చాట్ చేసేటప్పుడు ఉండాలి ఈ భయం.

ఇద్దరూ ముఖాలు చూసుకున్నారు.

ఇద్దరూ ఉదయం లేస్తే అమ్మా నాన్నా అని చక్కగా కనిపించే పిల్లలే. పెద్దవాళ్లను విష్ చేయడం... అంకుల్ ఆంటీ అంటూ మర్యాద ఇవ్వడం... కాలేజ్‌లో కూడా మంచి పేరే ఉంది. కాని ఆ సమయంలో ఆ క్షణంలో ఏం మాట్లాడుకున్నారో తెలిస్తే అదంతా ఏం కాను? నాన్న బతుకుతాడా? తను బతుకుతుందా? పోనీ పోలీసులకు చెప్తే? హూ. అదంతా చదివి ముఖాన ఊయరూ? మంచి ర్యాంక్ తెచ్చుకుని మంచి బ్రాంచ్‌లో చేరిందే... ఇప్పుడు చదువు మాన్పిస్తారా? తన్ని మూలన కూచోబెడతారా?

మాటల్లో దించినవాడు పారిపోయాడు. తను మాత్రం అసలుది ఇవ్వాలట.

ఇచ్చి? ఒకసారితో ఆగుతుందా... ఒకరితో ఆగుతుందా?

కణతల దగ్గర నొప్పి. మెల్లగా మొదలై పెద్దగా అవుతూ.

ఆత్మహత్య చాలా సులువైన పరిష్కారం అనిపించింది. అవును. అదే సరైన పరిష్కారం. తిరిగి కాలేజ్‌కు వెళ్లి లైబ్రరీ బిల్డింగ్ ఎక్కి పై నుంచి దూకేస్తే చాలు. ఈ బాధలన్నింటి నుంచి బయటపడిపోవచ్చు.

నిర్ణయం తీసుకున్నాక రిలీఫ్‌గా అనిపించింది.

కాని ఒక్క నిమిషమే. మళ్లీ భయం వేసింది. పోనీ ఒక్క తప్పే కదా. ఇంటికెళ్లి చెప్పేస్తే అమ్మా నాన్నా  అయ్యో... అమ్మలూ అని కడుపులో పెట్టుకోరూ? జరగాల్సింది చూడరూ? కాని ధైర్యంగా ఎలా చెప్పడం. పాడు పని చేసిందే.

పిడికిట్లో సెల్ నలుపుతూ కూచుని ఉంది.

ఇంటికా? కాలేజ్‌కా?

నెమ్మదిగా రూట్ బస్సులు మొదలవుతూ ఉన్నాయి.

చూసింది.

కాలేజ్‌కు తీసుకెళ్లే బస్సు ఇంటి మీదుగా వెళ్లే బస్సు ఒకదానికి ఒకటి తోకలా అంటుకుని వస్తూ ఉన్నాయి.

లేచి నిలబడింది.

- మహమ్మద్ ఖదీర్‌బాబు

# ప్రపోజల్...

మెట్రో కథలు



నవ్వింది.

నవ్వితే పన్ను మీద పన్ను కనిపిస్తుంది. బాగుంటుంది. ఈ మధ్య చాలామంది ఆడపిల్లలు డెంటిస్ట్‌లను కలుస్తున్నారు. పళ్లను తెల్లగా చేసుకుంటున్నారు.

అందరి పళ్లు తెల్లగా సున్నం వేసినట్టుగా ఒకేలా ఎందుకుంటాయి... వాటికీ ఒక రంగు ఉంటుంది కదా అంటుంది. వైటనింగ్ చేయించుకోలేదు. కొంచెం తెలుపు తక్కువగా ఉన్నా కృతకంగా లేకుండా సహజంగా అందంగా ఉంటాయి.

ఈ తెలుపు నీకు ఓకే కదా... అంది.

గబగబా తలాడించాడు.

అసలు పిలిచి కూచోబెట్టి మాట్లాడటమే కష్టం. అందుకే వాష్‌రూమ్‌లోకి వెళ్లి ఫేస్‌వాష్ చేసుకుని తల దువ్వుకొని టక్ సరి చేసుకుని వచ్చి కూచున్నాడు. ఫ్రెష్‌గా ఉన్నాడు. తక్కువ అందగాడేమీ కాదు.

బాగున్నావు... మళ్లీ నవ్వింది.

ఆఫీస్‌లో చాలామంది వెళ్లిపోయారు. ఇప్పుడు కూచున్న క్యూబికల్ కూడా చిన్నది. ఇరుగ్గా ఉంటుంది. బయట ఎక్కడైనా కూచుని మాట్లాడుకుందాం అన్నాడు. ఎందుకూ... మనమేమైనా తప్పు చేస్తున్నామా... ఇక్కడ చాల్లే అని కూచోబెట్టింది. రెండు కాఫీ తెప్పించింది. కాలు మీద కాలేసుకుని కూచుంది. కొంచెం బొద్దుగా ఉంటుంది. చుడీదార్లలో భలే గ్రేస్‌గా ఉంటుంది.

ఏదీ అంది.

ప్రింటవుట్ ఇచ్చాడు.

పొద్దున మెయిల్ పెట్టాడు. దాదాపు ప్రేమలేఖ. పెళ్లి దాని ముక్తాయింపు.

సాయంత్రం ప్రింటవుట్ పట్టుకుని రా.. అని ఒక వాక్యం జవాబు పెట్టింది.

ఇద్దరూ ఒకే ఆఫీస్‌లో మూడు నాలుగేళ్లుగా పని చేస్తున్నారు. క్యాజువల్‌గా ఉంటారు. ఇలాంటి ప్రపోజల్ ఊహించలేదుగాని అంతమాత్రాన ఇదేమీ విడ్డూరం కాదు కదా.

కీబోర్డ్ పక్కన కళ్లద్దాలు ఉంటే తీసుకుని చదివింది. మధ్యలో అంది.

రీడింగ్ గ్లాసెస్ వచ్చాయి. ప్లస్ ఒన్. పర్లేదు కదా...

పర్లేదు అన్నట్టు మళ్లీ గబగబా తలాడించాడు.

చదవడం ముగించి కళ్లద్దాలు తీసి పక్కన పడేసి నాకు ఇష్టమే... నీ సంగతే తేలాలి అంది.

ఆశ్చర్యపోయాడు. మొదట ఇష్టపడింది తను. నీ సంగతి తేలాలి అంటుందేమిటి?..

అలా చూడకు. కాఫీ తాగు...

కష్టం మీద ఒక గుక్క వేశాడు.

పెన్నొంటి తీసుకుని వెనక్కు తిప్పి డెస్క్ మీద టక్కుటక్కు చప్పుడు చేస్తూ కూచుంది.

టెన్షన్ తట్టుకోలేక కాఫీ మొత్తం ముగించాడు.

అయిపోయిందా?...

తలాడించాడు.

చెప్తాను. ఇప్పుడు నువ్వు ముగించావే... కాఫీ... అలాంటిది మా ఇంట్లో అందరికీ ఇష్టం. అమ్మకీ... నాన్నకీ... అన్నయ్యకీ... నాకూ... నా చిన్నప్పుడు ఇంట్లో పెద్ద పెద్ద ఇత్తడి గ్లాసులుండేవి... ఉదయాన్నే అమ్మ కాఫీ చేస్తే వాటి నిండుగా పోసుకుని ఆరుబయట తులసి కోట దగ్గర కూచుని ఊదుకుంటూ ఊదుకుంటూ తీరిగ్గా తాగేవాళ్లం. అంత ఇష్టమైన కాఫీని మూడేళ్లు మానేశాం...

చాలా చిన్న కొబ్బరితోట ఉండేది. తుఫాను కొట్టి పూతకూ కాయకూ పనికి రాకుండా పోయింది. పౌరహిత్యం తాతగారితోనే ఆఖరు. నాన్న ఎక్కువ చదువుకోలేదు. చాలా కష్టపడి టెలికామ్‌లో క్లాస్ ఫోర్ ఉద్యోగం దొరికితే సంపాదించుకున్నాడు. అన్నయ్యా నేనూ పుట్టాక కూడా ఆయన జీతం ఏడు వందలు. ఏడు వందలతో నలుగురు మనుషులు ఎలా బతుకుతారో ఇంజనీరు కొడుకువైన నీకు తెలిసే అవకాశం తక్కువ.

ఇద్దరం తెలివైన పిల్లలం. కాని మంచి స్కూల్లో వేయడానికి డబ్బు ఉండేది కాదు. మా ఇంటికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఎవరో ఫ్రీ స్కూల్ నడుపుతుంటే అందులో చేర్పించాడు. రోజూ ఉదయాన్నే సైకిల్ మీద మా ఇద్దరినీ కూచోబెట్టుకుని అక్కడి దాకా తీసుకెళ్లి దింపేవాడు. మళ్లీ సాయంత్రం ఇంటి దాకా. ఆ సైకిల్ పాపం మా నాన్నను మోయడానికే ఏడ్చేది. మమ్మల్ని కూడా అంటే కదిలేదే కాదు. కాని అది కష్టమని ఏ రోజూ అనుకోలేదు.

అప్పట్లో ఓటీ చేస్తే గంటకు రెండు రూపాయలు ఇచ్చేవారు. ఆ రెండు రూపాయల కోసమని ఐదారు గంటలు ఓటీ చేసేవాడు. అసిడిటీ వచ్చింది. నకనకలాడే ఆకలితో ఇంటికొస్తే కడుపు నిండుగా తినేంత వీలుగా అన్ని పదార్థాలు అంత రుచితో ఉండేవి కాదు. అమ్మ మాత్రం ఏం చేస్తుంది? ఉన్నవాటితో ఉన్నంత. నాన్నకు చాలా కోపం వచ్చేది. పళ్లెం విసిరి కొట్టేవాడు. అమ్మను పట్టుకొని చావబాదేసేవాడు. తర్వాత ఏడ్చేవాడు. అమ్మ కూడా. ఇలాంటి రాత్రులు చాలానే ఉండేవి.

మరో రెండేళ్లలో రిటైర్ అవుతున్నాడు. ఇప్పుడు కూడా ఆయన జీతం ముప్పై రెండు వేలు. నా జీతం అరవై వేలు. పైసా పైసా చూసుకొని బతికినవాళ్లు తమ కోసం తాము ఖర్చు పెట్టుకోలేరు. పిల్లలకు పనికి వస్తాయి కదా అనుకుంటారు. అందుకే అన్నయ్య బలవంతంగా ఫ్లాట్ కొనిపించాడు. నెలనెలా ఇ.ఎం.ఐ వాడే కడుతున్నాడు. నేను ఇంటి ఖర్చులన్నీ పెట్టుకుంటాను. మూడు పూటలా వంటలక్క వచ్చి బ్రహ్మాండంగా వండి పెడుతుంది. వాళ్లు సంతోషంగా విశ్రాంతిగా కడుపు నిండుగా తినడం నాకు ఇష్టం.

ఏమంటానంటే రేపు పెళ్లయ్యాక నా సంపాదన నా కోసం నీ కోసం మన పిల్లల కోసం ఖర్చు పెడతాను. అలాగే మా అమ్మా నాన్న కోసం కూడా ఖర్చు పెడతాను. ఇది కొనసాగుతుంది. అన్నింటి కంటే ముఖ్యంగా నా ఏ.టి.ఎం కార్డు నా దగ్గరే ఉంటుంది. ఇది నచ్చితే ఇష్టమో కాదో నువ్వే తేల్చాలి.

చూస్తున్నాడు.

మా నాన్న అస్సలు మాటకారి కాదు. దాదాపు మాట్లాడడు. కాని ఊళ్లో సినిమా పోస్టర్ మారినప్పుడల్లా సినిమాకు తీసుకెళ్లమని మారాము చేస్తే ఆరుబయట మంచాలు వేసి నక్షత్రాలకు ముడి పెట్టి ఏవేవో కథలు చెప్పడానికి ట్రై చేసేవాడు. అవి అంతగా అందగించేవి కాదు. కాని ఆయన అవస్థ చూసి ఇంటరెస్టింగ్‌గా ఉన్నట్టు ముఖాలు పెట్టి వినేవాళ్లం. పిక్నిక్‌లు టూర్లు మాకు తెలీవు. ఇంజనీరింగ్‌కి కూడా అమలాపురం దాటలేదు. అప్పుడే నాకు లోకం మీద వ్యామోహం పుట్టింది. చూడాలి. వీలైనంత చూసేయాలి. శుక్రవారాలు నువ్వు గమనించే ఉంటావు. బ్యాక్ ప్యాక్‌తో వస్తాను. ఆఫీస్ అయ్యాక టూడేస్ ఏదైనా కొత్త ప్రాంతానికి వెళ్లిపోతాను. హైదరాబాద్ చుట్టుపక్కల ఏమున్నాయో నీకు తెలీదు. అటు కర్నాటక దాకా ఇటు మహారాష్ట్ర దాకా వెళితే ఎన్ని అందాలు ఉన్నాయో నీకు తెలీదు. ఇంకా ఎంత లోకం ఉందో ఎవరికి తెలుసు? ఏమంటానంటే నెలలో ఒకటి రెండు సార్లయినా ఈ తిరుగుళ్లు ఉంటాయి. పెళ్లయ్యాక కూడా కొనసాగుతాయి. ఇదినచ్చితే ఇష్టమో కాదో నువ్వే తేల్చాలి.

చూస్తున్నాడు.

ఇక ఇది చెప్పడం నాకు ఇష్టం లేదు. కాని చెప్పక తప్పడం లేదు. అండర్ ప్రివిలేజ్డ్ పిల్లలు ఎన్ని కష్టాలు పడతారో నాకు తెలుసు. వాళ్ల కోసం ఏదైనా చేయాలని చిన్నప్పుడే అనుకున్నాను. మూడు సబ్జెక్ట్‌లకు కలిపి ఒక డబుల్ రూల్డ్ నోట్‌బుక్ ఉండటం ఎంత నొప్పిగా ఉంటుందో బహుశా నీకు తెలీదు. ఇదేదో ఫ్యాషన్ కోసమో ఫేస్‌బుక్‌లో గ్లామర్ కోసమో పెట్టుకోలేదు. అలాంటి పిల్లల కోసం పని చేయడం నాకు ఇష్టం. చేస్తున్నానని కూడా కాస్త గమనిస్తే నీకు తెలిసే ఉండాలి. కొంత సంపాదన వాళ్ల కోసం పెడితే ఏం పోయింది? మన దగ్గర ఉందిగా? పెళ్లయ్యాక ఇది కొనసాగుతుంది. కొనసాగి తీరుతుంది. ఇది నచ్చితే ఇష్టమో కాదో నువ్వే తేల్చాలి.

చూస్తూ ఉన్నాడు.

ఫైనల్‌గా ఏమంటానంటే నాక్కూడా నువ్వంటే ఇష్టం. మంచివాడివి. బిహేవియర్ కూడా బాగుంటుంది. నేను నిన్ను ప్రేమిస్తాను. గౌరవిస్తాను. మా అమ్మానాన్న పట్ల నాకెలాంటి ఫీలింగ్స్ ఉన్నాయో నీకు చెప్పినట్టే మీ అమ్మానాన్నల పట్ల నీకెలాంటి ఫీలింగ్స్ ఉన్నాయో తెలుసుకుని ఫేక్‌గా కాకుండా నిజంగానే వాళ్లను గౌరవిస్తూ వాళ్లు గౌరవించేలా ఉంటాను. బిపి సుగర్ థైరాయిడ్లు లేవు. హెల్దీగా ఉన్నాను. సెక్సువల్ ఎపిటైట్ కూడా బాగానే ఉందని అనుకుంటున్నాను. మన జర్నీ బాగుంటుంది. అయితే ఇది ఇంతటితో ఆగదు. మనం ఇంకా ముందుకెళతాం. కెరీర్‌లోగానీ సొసైటీలోగాని మంచి విషయాలను ఎక్స్‌ప్లోర్ చేస్తాం. ఎదుగుతాం. నాలుగు పనికొచ్చే పనులు చేస్తాం. ఎట్‌లీస్ట్ నాకు అలా ఉంది. నన్ను చేసుకునేవాడు కూడా అవన్నీ అందుకోవాలని ఉంది. ఇవన్నీ నీలో చూస్తున్నాను. ముందు నువ్వు ఇదంతా తీసుకోగలగాలి. తర్వాత మీ అమ్మానాన్నలకు కూడా ఇదంతా అర్థమయ్యేలా చెప్పి ప్రిపేర్ చేయగలగాలి. చేయగలం అనే అనుకుంటున్నాను. ఇప్పుడు చెప్పు. ఇదంతా నీకు ఓకేనే గదా...

చూస్తూ ఉన్నాడు.

చెప్పు... ఓకేనే గదా...

చూస్తూనే ఉన్నాడు.

- మహమ్మద్ ఖదీర్‌బాబు

మెట్రో కథలు

# లిప్‌స్టిక్...



షూటింగ్ నుంచి వస్తున్నారా? డోర్ తీస్తుంటే అడిగింది.

అబ్బే... లేదండీ...

మేకప్ ఉన్నట్టు అనిపిస్తేనూ...

నవ్వుతూ డోర్ తీసుకుని లోపలికి వచ్చింది. లోపల రెండు ఫొటోలు అలో చేస్తామన్నారు. కొడుకుదీ మనవరాలిదీ వేలాడదీద్దామనుకుంది. కాని మనసొప్పలేదు. ఇద్దరు నటుల ఫొటోలు అమర్చుకుంది. సినిమా వాళ్లు కాదు. నాటకాల వాళ్లు. తనకు అన్నం పెట్టిన గురువులు.

ఏ.సి. ఆన్ చేసింది. మళ్లీ మనసు మార్చుకుని ఆఫ్ చేసి కర్టెన్లు తీసి విండో డోర్‌ను స్లైడ్ చేసింది. ఇంకా పూర్తిగా చీకటి పడలేదు. వేడి తగ్గలేదు. కాని గాలి మాత్రం చనువుగా వచ్చి తాకుతూ ఉంది. నుదుటిని... కళ్లను... పెదాలను... పెదాల మీద ఉన్న లిప్‌స్టిక్‌నూ. టొమాటో కలర్‌ది. ముందు నుంచి అదే అలవాటు.

మూడు నెలలైంది ఏదైనా షూటింగ్ చేసి. ఇంకో నెల దాకా కూడా ఏదీ ఉన్నట్టు కనిపించడం లేదు. ఇద్దరు ముగ్గురు డైరెక్టర్లకు కాల్ చేసింది. అయ్యో.. అమ్మా... మీరు చేయాలా... మీకు యాప్ట్ అయ్యే కేరెక్టర్ ఉంటే మిమ్మల్ని దాటి పోనిస్తామా... అందరూ అదే చెప్పారు. నిజంగానే చెప్పారు. అందరికీ తనంటే ఇష్టమే. టేకులు తినదు. న్యూసెన్స్ చేయదు. ముఖ్యంగా ప్రాంప్టింగ్ అవసరం లేకుండా ఒత్తులూ పొల్లులూ ఎగరకొట్టకుండా డైలాగ్ చెప్పగలిగే అచ్చ తెలుగు ఆర్టిస్టు. నిజమే కానీ షూటింగ్ లేకుండా ఉంటే విసుగ్గా ఉంటుంది. మేకప్ వేసుకోకపోయినా విసుగ్గా ఉంటుంది. అన్నింటికంటే ముఖ్యంగా లిప్‌స్టిక్ పూసుకోకపోతే చాలా విసుగ్గా ఉంటుంది. అందుకే కొద్దిపాటి మేకప్‌తో ఉండటం అలవాటు. పడుకోబోయే ముందు తప్ప కొంచెం లైట్‌గా అయినా లిప్‌స్టిక్ వేసుకొని ఉండటం అలవాటు.

మీ అమ్మకు ఇదేం అలవాటండీ అందట కోడలు ఒకరోజు.

చెప్పలేక చెప్పలేక చెప్పాడు.

నవ్వి ఊరుకుంది.

కొడుకు పెళ్లి అయ్యేవరకు చాలా చిన్న ఫ్లాట్‌లో ఉండేది. పేరుకు టూ బెడ్‌రూమ్ కాని ఎయిట్ హండ్రెడ్ ఎస్‌ఎఫ్‌టి కూడా ఉండదు. పెళ్లికి ముందే కొంచెం అవస్థలు పడి పెద్ద ఫ్లాట్ కొంది. మరేం చేయడం? వయసులో ఉన్నప్పుడు పేమెంట్స్ లేవు. పేమెంట్స్ పెరిగినప్పుడు వయసు లేదు. ఇప్పుడైనా గుడ్‌విల్ పని చేయబట్టి ఒకరిద్దరు నిర్మాతలు కాస్త చేయి వేయబట్టి సాధ్యమైంది.

మీ అమ్మకు ఆ నిర్మాతలు అంత క్లోజా ఏమిటండీ అందట కోడలు.

ఆ మాట మాత్రం చెప్పలేదు.

షూటింగ్ ఉంటే ఉదయాన్నే వెహికల్ వస్తుంది. మళ్లీ రాత్రి దింపేసి పోతుంది. మేకప్ బాయ్ వస్తాడు. అటెండెంట్‌గా ఇంకో కుర్రాణ్ణి పెట్టుకుంది. నిజంగా వీళ్లను మోయలేదు. కాని ఇంత హంగామా చేస్తే తప్ప పాత్ర పుట్టదు. వీళ్లుగాక సీనియర్ ఆర్టిస్టనీ నాటకాల బ్యాక్‌గ్రౌండ్ ఉందనీ కొత్త డైరెక్టర్లు వచ్చి పోతుంటారు. కథలు చెప్తుంటారు. కాస్టింగ్ ఏజెంట్లు వస్తుంటారు. కమిషన్లు చెబుతుంటారు. సాటి ఆర్టిస్టులు– ఆడ సరేగాని మగ కూడా వచ్చి కాసేపు కూర్చుని పోతుంటారు.

ఇల్లు అన్నపూర్ణా స్టుడియోలాగుందండీ అందట ఒకరోజు.

ఆ మాట అయినా ఎలా చెబుతాడు?

ఎలా ఉన్నారు అత్తయ్యా... ఏం చేయమంటారు అత్తయ్యా... కోడలు అడిగిన పాపాన పోలేదు. తనూ బలవంతపెట్టలేదు. ఏం బలవంత పెడుతుంది? వేలు ఖర్చు పెట్టినా అంతంత మాత్రమే చదివాడు. అంతంత మాత్రపు ఉద్యోగమే తెచ్చుకున్నాడు. సంబంధం వెతకడం ఒక కష్టం. మనుషులు వచ్చిపోయే ఇంటికి కోడల్ని తీసుకురావడం ఇంకా కష్టం. కాకుంటే ఒకటి. మూడో నెలకంతా నెల తప్పాను అత్తయ్యా అంది. ఆ మాట చాలు ఎన్ని తప్పులు చేసినా క్షమించేయడానికి.

మనవరాలు పుడితే ఆర్భాటంగా బారసాల చేసిందిగాని వచ్చినవాళ్లంతా అచ్చు నానమ్మ నోట్లో నుంచి ఊడిపడింది అంటుంటే కాస్త భయపడింది. అవును. అచ్చు తనలాగే ఉంది. పెద్ద పెద్ద కళ్లు. మంచి కనుబొమలు. రంగు. ముఖ్యంగా పెదాలు.... అవన్నీ ఉంటే ఏమవుతుందో తెలుసు.

దూరంగా ఫ్రెండ్స్‌తో మాట్లాడుతున్న కొడుకు వైపు చూసింది. చూస్తూ గమనించింది.

ఎవరి పోలిక ఉంది వాడిలో?

పెళ్లైన మూడేళ్లకు పారిపోయిన భర్త. చచ్చిందా బతికిందా పుట్టిన పిల్లాడు ఉన్నాడా పోయాడా పట్టించుకోని భర్త. అతని పోలిక ఉందా వాడిలో. పద్నాలుగేళ్ల పిల్ల... చదువుకుంటా నాన్నా నాకిష్టం లేదు నాన్నా అంటున్నా స్టేజ్ ఎక్కించిన తండ్రి... రంగు పూయించిన తండ్రి... సారా కోసం లిప్‌స్టిక్ వేయించిన తండ్రి.... ఎవడికో ఒకడికి కట్టబెట్టేస్తే తన పని అయిపోతుందనుకున్న తండ్రి... ఆ తాత పోలిక ఉందా వాడిలో?

భయమేసింది.

ఎందుకు భయం? తను ఉంది. ఆ పోలికలు అంటకుండా తనే చక్కగా పెంచుకుంటుంది. బాగా చదివించుకుంటుంది. అవసరమైతే ఇంకా ఎక్కువ నటించి ఇంకా ఎక్కువ పాత్రలు చేసి ఆర్థికంగా ఏ ఇబ్బందీ రాకుండా స్థిరపరుస్తుంది.

అలా అనుకునే బతికింది. మనవరాలే లోకం. మనవరాలికి నానమ్మ లోకం.

ఇదేమిటండీ... కన్నవాళ్లు అంత కాకుండా పోతున్నారేమిటి దానికి అందట ఒకరోజు.

నవ్వుతూ నవ్వుతూనే చెప్పాడు.

మొన్నా మధ్య గుడికో మరెక్కడికో వెళ్లి వచ్చింది. వస్తూ వస్తూ ఎనిమిదో పుట్టినరోజు రాబోతున్నది కదా అని మనవరాలికి కొత్త డ్రస్సు కొనుక్కుని వచ్చింది. అది తొడిగించి చూసి మెటికలు విరిచి సంబరపడాలనుకుంటూ వచ్చింది. వచ్చే సరికి ఇల్లు ఇల్లులా లేదు. అంత చిందర వందరగా ఉంది. రాద్ధాంతం జరిగినట్టుగా ఉంది. కొడుకూ కోడలూ... ఏడుస్తూ మనవరాలు...

నానమ్మా... పరిగెత్తుకుంటూ వచ్చి చుట్టేసుకుంది.

ఏమైంది తల్లీ... ఏమైంది...

మేకప్ కిట్ తెరిచి లిప్‌స్టిక్ వేసుకోవడానికి చూసిందట. అది గమనించి వాళ్లమ్మ చావ గొట్టిందట. అడ్డుకోబోయిన భర్తను నానామాటలు అందట.

ఇంట్లో ఆల్రెడీ ఒక టక్కులాడి ఉంది. ఇంకో టక్కులాడిని తయారు చేయబోతారా? అందట.

ఈ మాటలు కాదు. నిజంగా ఏమందో. మార్చి మర్యాదగా చెప్పాడు.

ఇవన్నీ ఇక మానెయ్యమ్మా. ఇంట్లో ఉండు. తిరక్కు. ఆ మేకప్ కిట్ తీసి బయట పారెయ్...

చూసింది.

భర్త పారిపోయినప్పుడు సంవత్సరం పిల్లవాడు. రాత్రి నాటకాలు. మేకప్ వేసుకొని లిప్‌స్టిక్ పూసుకుని సరిగ్గా స్టేజ్ మీదకు వెళ్లే సమయానికి ఏడుపు మొదలుపెడితే ఓపలేక బుగ్గలంతా ముద్దులు పెడితే ఎర్రటి మరకలంతా పడేవి. సినిమా నాటికలు వేసేప్పుడు బ్లౌజ్ లేకుండా పవిట గట్టిగా కట్టి పచ్చగడ్డి కోసేటి పడుచుపిల్లో... డాన్స్ చేస్తుంటే జనం ఆ గుండెల్ని చూడ్డానికి ఏడ్చేవాళ్లు. తను వాటిల్లో ఉన్న పాలు ఇవ్వడానికి ఏడ్చేది. ఇన్నాళ్లు పెంచడానికి చదివించడానికి ఫ్లాట్ కొని ఉంచటానికి అవసరాలను ఆదుకోవడానికి పనికొచ్చిన లిప్‌స్టిక్ ఇప్పుడు అక్కర్లేదంటున్నాడు.

నవ్వింది.

వస్తున్నారా?....

వెనక్కు తిరిగి చూసింది.

ఇందాక పలకరించిన పక్క రూమ్‌మేట్. డోర్ దగ్గర నిలుచుని ఉంది.

డిన్నర్‌కు టైమ్ అయ్యిందిగా... పిలుస్తూ ఉంది.

అప్పటికే చీకటి పడిపోయింది. టైమ్ ఏడై ఉంటుంది. ఇక్కడ ఏడుకే డిన్నర్ ముగించేయాలి. ఆ తర్వాత ఏదైనా కాలక్షేపం.

చేతులు కడుక్కుని, ముఖం వాష్ చేసుకుని, కొంచెం పౌడర్, లైట్‌గా లిప్‌స్టిక్ టచ్ ఇచ్చి బయలు దేరింది. నాలుగైదు ఎకరాల ఆవరణ అది. ఊరికి కాస్త దూరంగా ప్రశాంతంగా.

మీ గురించి విన్నాను...

నవ్వింది.

ఇప్పుడు మీ అబ్బాయి ఎక్కడున్నాడు?

తెలీదు. ఫ్లాట్ అమ్మేశాను. నీ దారి నువ్వు చూస్కో అని చెప్పాను. వచ్చింది బ్యాంక్‌లో డిపాజిట్ చేసి మిగిలింది ఈ హోమ్‌కు కట్టి ఇక్కడకు వచ్చేశాను.

మనవరాలు గుర్తుకు రావడం లేదా?

వస్తుంది. ఏం చేస్తాం. తప్పదు కదా. పాత్ర ముగిసిందని తెలిశాక స్టేజ్ మీద ఎంత బ్యాడ్ ఆర్టిస్టూ నిలవదు. దిగిపోతుంది...

ఒక్కోరూమ్ నుంచి ఒక్కొక్కరుగా బయటకు వస్తూ కనిపిస్తున్నారు. తన వయసు వాళ్లు. తనలాంటివాళ్లు.

అన్నట్టు సినిమాల్లో యాక్ట్ చేస్తారా?

అమ్మబాబోయ్. నాకు రాదండీ... మీరంటే ఆర్టిస్టు...

ఏం లేదండీ. కొంచెం లిప్‌స్టిక్ వేసుకుని నిలబడండి. చాలు.

అంతేనా?


అంతే...

ఇద్దరూ హాయిగా నవ్వుకుంటూ మంచి డిన్నర్ చేయడానికి డైనింగ్ హాల్లోకి నడుచుకుంటూ వెళ్లిపోయారు.

- మహమ్మద్ ఖదీర్‌బాబు

మెట్రో కథలు

# సండే మార్నింగ్...



అలిగి పడుకుని ఉంది.

ఏడుస్తూ ఉన్నాడు.

మధ్యలో నాకొచ్చింది చావు అనుకున్నాడు.

పదయ్యింది. మార్కెట్‌కు వెళ్లి చేపలు తెచ్చాడు. చేపలు అంటే చేపలు కాదు. ఒక్కటే వచ్చింది. కిలోంపావు. నూట నలభై ఇచ్చి మళ్లీ శుభ్రం చేసిచ్చినందుకు పది రూపాయలు అదనంగా చెల్లించాల్సి వచ్చింది. కాస్త కరివేపాకు వేసి వీలుంటే మామిడికాయ తగిలించి కూర చేస్తే అందాక పేపర్ చదువుకుంటూ సండే మేగజీన్స్ తిరగేస్తూ టీవీలో ఏదైనా ఉంటే చూస్తూ తిని పడుకుని సాయంత్రం సినిమాకు తీసుకెళదామనుకుంటే ఈ రచ్చ మొదలు.

ఎందుకనో ఈ మధ్య ఆదివారం వస్తే చాలు భయమేస్తూ ఉంది. ఇద్దరికీ కుదిరేది ఆ ఒక్కరోజే. తక్కిన అన్ని రోజులూ ఆఫీసుకు వెళ్లిపోగా వాడు స్కూల్‌కు వెళ్లిపోగా ముగ్గురూ కలిసి ఉండేది ఆ ఒక్కరోజే. ఆ రోజైనా సరదాగా ఉందామంటే ఏదో ఒకటి నస.

పోయిన ఆదివారం బీరువా తెరిచి చీరలన్నీ చూపించింది. చూడండి... ఇందులో ఒక్కటైనా ఫంక్షన్స్‌కు కట్టుకెళ్లేదిగా ఉందేమో చూడండి అంది. చీరలకు తీసుకెళితే జాకెట్లు ఇవ్వడానికి దర్జీ దగ్గరకు తీసుకెళ్లలేదని అదో అలక. అదంతా అయితే దాపున ఉండే అంగళ్లలో కూరగాయలు మండిపోతున్నాయనీ రైతుబజార్‌కు వెళ్లి వారానికి సరిపడా ఒకేసారి తెస్తే బాగుంటుందనీ...

ఇవాళ బాల్‌ది వచ్చింది. దానికి గాలి తగ్గిపోయి మూలన పడేసి ఉన్నాడు. సాధారణంగా ఆడడు. ఇవాళ ఉదయం నుంచి గాలి కొట్టించమని అడుగుతున్నాడు. కింద ఆడుకుంటాడట. నువ్వూ రా నాన్నా అనంటే సరే అని బాల్‌కి గాలి కొట్టించి ఆడుకుందామని బయలుదేరబోయాడు. ధడేలున వచ్చి అడ్డం నిలబడి మెయిన్ డోర్ గ్రిల్ వేసి వీల్లేదు అని హూంకరించింది.

అదేంటి?

అదంతే. ఇవాళ మీరుంటారు. రేపటి నుంచి ఎవరుంటారు? వాడు కిందకెళితే ఎవరు కాపలా? అక్కర్లేదు కూచోండి.

కోపం నషాళానికి అంటింది.

అరె... పిల్లవాడు సండేపూట ఏదో ఆడుకుందామంటే వద్దంటుందేంటి. వెళితే ఏమవుతుంది? రెట్టించాడు.

నాకు తెలుసు. నేను ఏమన్నా దానికి వ్యతిరేకం చేస్తారు. వాడి ముందు నన్ను పలుచన చేస్తారు... ఏడుస్తూ కూచుంది.

ఆదివారం అంతా సర్వనాశనం.

అమ్మ వద్దన్నందుకు... ఎందుకు వద్దంటుందో అర్థం కాక ఏడుపు ముఖం పెట్టాడు.

దేవుడా.

ఎందుకు రాద్ధాంతం చేస్తావు?

రాద్ధాంతమా? మీకు తెలియదా... వీడేం ఆడతాడో మీకు తెలియదా? ఎంత ఆడే వీలుందో మీకు తెలియదా?

సోఫాలో కూలబడ్డాడు. ఇక కిందకు వెళ్లడం జరగని పని. ఏడుస్తూ బెడ్‌రూమ్‌లోకి వెళ్లబోతుంటే లేచి సెల్ ఇచ్చింది.

దీన్తో ఆడుకోరా... ఇదే నీకు గతి... దీన్తోనే చావు... ఏం చేస్తాం ఖర్మ... వెళ్లి పడుకుంది.

ఇక్కడ చేరినప్పటి నుంచి చెప్తూనే ఉంది. ఇల్లు మారదామని. మారే కదా ఇక్కడకు వచ్చింది. ఇంతకు ముందు ఉన్న ఇల్లు చీకటిగా ఉండేది. పైగా చేరినప్పటి నుంచి ఉద్యోగంలో ఏవో ఒక గొడవలు. ఆరోగ్య సమస్యలు. ఇక్కడకు మారాకే అన్నీ సర్దుకున్నాయి. ఎవరో తెలిసినాయన వచ్చి వాస్తుపరంగా పర్‌ఫెక్ట్.... ఓనర్ గెంటితే తప్ప ఖాళీ చేయొద్దు అని చెప్పేసి వెళ్లాడు. మంచిదే. కాని ఈ సమస్య ఒకటి వచ్చిందే.

ఆ రోజు ఆఫీసు నుంచి వచ్చే సరికి కణత దగ్గర పసుపూ పౌడర్ రాసుకుని ఉన్నాడు. సోఫా మీద గెంతాడట. మొన తగిలిందట. కొంచెం నెత్తురు కూడా వచ్చిందట. వంట చేయకుండా ఒళ్లో కూచోపెట్టుకుని ఉంది. ఆడే వీలు లేకపోతే వాడు మాత్రం ఏం చేస్తాడు అంది కళ్లు తుడుచుకుంటూ.

ఆఫీస్ నుంచి అలసిపోయి వస్తుంది. ఆ తర్వాత వంట పని ఎలాగూ ఉంటుంది. ఒక్కడే కిందకు పోతానంటే పంపదు. అలాగని ఇంట్లో అల్లరి చేస్తే సహించలేదు. ఒక్కోసారి దెబ్బలు తగిలించుకుంటాడు. ఇంకోసారి తనే నాలుగు బాదుతుంది.

పోనీ పక్క ఫ్లాట్ వాళ్ల దగ్గరికైనా పంపవచ్చు కదా... ఆడుకొని వస్తాడు కదా?

వాళ్లెందుకు పెట్టుకుంటారు? వాళ్ల పిల్లలను ఎక్కడకు తరుముదామా అని చూస్తుంటారు...

అది నిజమే. ఆలోచిస్తే తామెలా పెరిగామా అని ఇద్దరికీ ఆశ్చర్యమే. ఇద్దరూ నలుగురు పిల్లల జనరేషన్ నుంచి వచ్చినవాళ్లే. నలుగురు పిల్లలకు అమ్మ అన్నం అయితే పెట్టుంటుంది కాని సాకింది మాత్రం తలా ఒకరు. పక్కింటి వాళ్లు... మేనత్తలు... బాబాయ్‌లు... అమ్మమ్మ... పొద్దున లేచి బయటికెళితే మళ్లీ అన్నం టైమ్‌కి తప్ప ఎవరూ గుర్తొచ్చేవారు కాదు. ఇప్పుడు అలా ఎక్కడా?

నయం మగపిల్లాడయ్యాడు. ఆడపిల్ల అయితే అయిదు నిమిషాలు కూడా వదిలే వీలుండదు. ఉద్యోగానికి వెళ్లే ధైర్యం కూడా చేసుండేదాన్ని కాదు అంటుంది.

మళ్లీ- మగపిల్లాణ్ణి కూడా పంపే వీల్లేదంట లేండి... ఇవాళ రేపు మగపిల్లల్ని కూడా నాశనం పట్టిస్తున్నారట. ఎవర్నీ నమ్మగలం అంటుంది.

ఏమిటి విరుగుడు? పాత ఫ్లాట్ కృష్ణకాంత్ పార్క్ దగ్గరగా ఉండేది. ఆదివారం ఆదివారం తప్పనిసరిగా తీసుకెళ్లేవారు. శక్తి కొద్దీ పరిగెత్తేవాడు. శక్తి కొద్దీ కింద దొర్లేవాడు. శక్తి కొద్దీ అన్నీ ఆడి మరో వారం దాకా అక్కర్లేనట్టుగా అలసిపోయేవాడు. ఇప్పుడు కుకట్‌పల్లి వైపు వచ్చారు. ఒక్క పార్కు లేదు. అసలు పార్కు ఒక అవసరమని భావిస్తున్నట్టుగా కూడా లేదు. పార్కు ఒక హక్కు అనే మాట చాలా పెద్దది. ఈ అపార్ట్‌మెంట్ రోడ్డు మీదే ఉంది. బయటకు రావడానికి లేదు. ట్రాఫిక్. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆడదామంటే బిల్డర్ కక్కుర్తి పడి వాచ్‌మెన్ రూమ్ కాకుండా ఇంకో రెండు గదులు కట్టి అమ్మేశాడు. కార్లు స్కూటర్ల పార్కింగ్‌కే స్థలం లేదు. వాటి మధ్య ఆడాలంటే ఏ కారు ఎక్కేస్తుందో అని భయం.

కిందకెళతానమ్మా అని ఎంత ఏడ్చినా పంపదు.

సరే కారిడార్‌లో ఆడతాను అంటాడు. కారిడారా అది? స్లమ్‌లో కూడా అంత ఇరుకు దారులు ఉండవు. ఇంటి ముందు రెండు కుండీలు పెట్టుకుంటే చెప్పుల స్టాండ్ పెట్టుకుంటే ఒక మనిషి నడిచే వీలే ఉంటుంది. ఇంకో మనిషి ఎదురు వస్తే ఆగి పక్కకు వాలి... పిల్లలందరికీ సైకిళ్లు ఉన్నాయి. అన్నీ ఫ్లాట్ల బయట పడి ఉంటాయి. ఎవరూ తొక్కరు. తొక్కే వీలు కూడా లేదు. ఒకవేళ తొక్కినా తగాదాలు. బాల్ డోర్‌కు తగిలిందని చాలా స్నేహంగా ఉండే మనిషే- ఫోర్ నాట్ టూ ఆమె- భయంకరంగా తగాదాకి వచ్చింది. ఇంకొక ఆమె బాల్ దాచేసింది. దాని బదులు సెల్ దోసిట్లో పడేస్తే మేలు కదా అని అదొకటి నేర్చుకుంది.

సర్లే. వదిలెయ్. వంట చేయరాదా?...

జవాబు చెప్పలేదు.

నిన్నే.

నాకు విసుగ్గా ఉందండీ...

సెకండ్ చైల్డ్ కావాలనుకుంటే తనే వద్దన్నాడు. అదొక అసంతృప్తి ఉంది. ఒక్కణ్ణి సక్రమంగా పెంచగలిగితే చాలు... మన సంపాదనకు అదే గొప్ప అన్నాడు. ఈ మధ్య అది గుర్తు చేస్తోంది. ఇంకొకరిని కనుంటే తోడుగా ఆడుకునేవాడు కదా. ఒంటరిగా మిగిలేవాడు కాదు కదా.

చిన్నప్పుడు చాలా అల్లరి చేసేదట. పెళ్లైన కొత్తల్లో చెప్తుండేది. జామకాయలు కోసేదట. నేరేడు పండ్లు రాల్చేదట. పక్కనే చిట్టడవి ఉంటే స్నేహితురాళ్లతో రేగుపండ్ల కోసం వెళ్లేదట. తేగలు తవ్వేదట. చేలల్లో ఆటలు... తోటల్లో పరుగులు... నా కడుపున పుట్టినవాడు ఇలా మిగిలాడు అని ఏడుస్తుంది. ఏం చెప్పగలడు.

ఖాళీ స్థలాలు లేవు. ఉన్నా గోడలు కట్టి కాపలా పెడతారు. స్కూళ్లల్లో ఆడిస్తారా అంటే అవి జైళ్ల కంటే ఘోరం. ఫ్లాట్ల పరిస్థితి ఇదీ. పిల్లలతో సంతోషం అంటారు. పిల్లలు సంతోషంగా ఉంటే కదా సంతోషంగా ఉండటానికి.

చేపలు ఫ్రిజ్‌లో పెట్టాడు. గదిలోకి చూస్తే ముఖం డిజప్పాయింటెడ్‌గా పెట్టి సెల్‌తో ఆడుకుంటూ ఉన్నాడు. ఇంకో గదిలో మాట పలుకూ లేని అలక. మధ్యాహ్నానికి దరిద్రమైన పార్శిల్ భోజనం తప్పేలా లేదు.

మళ్లీ సోఫాలో కూలబడ్డాడు.

ఎదురుగా టీపాయ్ మీద న్యూస్‌పేపర్ కనిపిస్తూ ఉంది.


ఆకాశ హర్మ్యాలు కడతారట. ఏవేవో స్థలాలు ఎవరెవరికో ధారపోస్తారట. పిల్లలకు గుప్పెడు స్థలం ఇస్తామని ఎవరూ అనడం లేదే.

దేవుడు వెంటనే రియాక్ట్ అవుతాడన్న నమ్మకం లేదు. కాని పిల్లలు ఆడుకునే వీలున్న నగరం కోసం ప్రశాంతమైన ఆదివారపు ఉదయాల కోసం ముడుపు కట్టాలని మాత్రం అనిపించింది.

**- మహమ్మద్ ఖదీర్‌బాబు**

మెట్రో కథలు

# ఉడ్ వర్క్...



పుస్తకాలన్నీ ఫ్రెండ్ ఇంట్లో పడేసి వచ్చేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయ్యింది. ఆటోని పంపించి పైకి వచ్చేసరికి నీరసంగా పడుకుని ఉంది. రెండింటికి మళ్లీ డోస్ వెయ్యాలి. ఆలోపే వచ్చేసినందుకు కొంచెం ఊరటగా అనిపించింది.

ఎలా ఉంది?

ఊ... మూలిగింది.

నీళ్లు తాగుతావా?

ఊ...

గ్లాస్‌లో నీళ్లు తెచ్చిచ్చాడు. ఒక్క గుక్క తాగి మళ్లీ పడుకుంది. చూస్తూ కూచున్నాడు.

కార్పెంటర్ వచ్చాడా?

వస్తాళ్లే...

ఎన్నిసార్లు చెప్పినా వినరు కదా. ఈసరికి వచ్చి పని మొదలెడతాడని అబద్ధాలు చెప్తున్నారు...

మళ్లీ కళ్లు మూసుకుంది.

ఫోన్ మోగితే ఎత్తాడు.

ఎలా ఉంది?...

పర్లేదు....

కళ్లు తెరిచి అడిగింది- ఎవరూ?

ఫోన్ ఆపి చెప్పాడు- మీ అన్నయ్య.

నన్ను చూడ్డానికి రావద్దనండి. ఒకవేళ వచ్చినా రాత్రి పదయ్యాక రమ్మనండి. వచ్చేప్పుడు కూడా గడ్డం అదీ లేకుండా లాల్చీ పైజామా లేకుండా ప్యాంట్ షర్ట్‌లో రమ్మనండి. సెక్యూరిటీ రిజిస్టర్‌లో ఏదైనా తెలుగు పేరు రాసి రమ్మనండి...

అవతల వైపు వినిపిస్తూ ఉన్నట్టుంది. హడలిపోయి పెట్టేశాడు.

ప్రాబ్లమ్ ఈ మధ్యే మొదలయ్యింది. పదీ పదిహేను రోజులు అయి ఉంటుంది. ఒకరోజు ఇంటికి వచ్చేసరికి స్నానం అదీ ఏమీ లేకుండా కూచుని ఉంది. పిల్లలు కాలేజ్ నుంచి వచ్చినా పట్టించుకోకుండా ఉంది. వంట కూడా చేయలేదట. పలకరిస్తే పలకరించడం లేదట. కంగారుగా అనిపించింది. పలకరించే లోపలే కోపంగా హూంకరించింది.

ఉడ్‌వర్క్ ఎప్పుడు చేయిస్తారు?

ఆశ్చర్యపోయాడు. ఇప్పుడు ఈ గొడవెందుకొచ్చింది.

ఎప్పుడు చేయిస్తారు?... మళ్లీ రెట్టించింది.

ఆ తర్వాత చేయి పట్టుకుని విసురుగా కిచెన్‌లోకి తీసుకెళ్లింది.

ఇదంతా చేయించాలి... ఈ అరలు ఈ అరలు ఈ అరలు... ఏదీ కనపడకూడదు... అన్నింటికీ తాళాలు ఉండాలి... ఆ తాళాలు కనపడకుండా దాచేయాలి.... ఏం కనపడకుండా దాచేయాలి....

మామూలుగానే ఉందా... ఏమైనా అయ్యిందా... అర్థం కానట్టుగా ఉంది.

ఫ్లాట్ కొన్నప్పుడు ఎవరైనా వస్తే బాగోదని హాల్లో కొంచెం ఉడ్ వర్క్ చేయించాడు. బెడ్‌రూమ్‌లో బట్టలు పెట్టుకోవడానికి తప్పదని ఇంకొంచెం. మరో బెడ్‌రూమ్ కిచెన్ వదిలేశాడు. ఇద్దరబ్బాయిలూ ఆ రూమే వాడతారు. మెటల్ ర్యాక్స్ తెప్పుకుని వాళ్ల బట్టలు పుస్తకాలు సర్దుకున్నారు. డైనింగ్ ఏరియాలో రెండు ర్యాక్స్ పెట్టుకుని తన పుస్తకాలు అమర్చుకున్నాడు. ఉన్న డబ్బులకు స్తోమతకూ ఇదే ఎక్కువ. ఆ సంగతి తెలుసు. ఏం పర్లేదు లేండి... ఉన్నప్పుడే చేయించుకుందాం అనేది. ఇప్పుడేంటి?

చేయిస్తారా లేదా... చెప్పండి చేయిస్తారా లేదా... మీరు చచ్చి మమ్మల్నీ చంపుతారా... హఠాత్తుగా నుదురు కొట్టుకుంటూ ఏడ్వడం మొదలుపెట్టింది. పిల్లలు హడలిపోయారు. ఎప్పుడూ ఇలా ఏడ్చింది లేదు.

ఊరుకో.. ఊరుకో.. వెంటనే చేయిస్తాగా...

బజారుకు పరిగెత్తి తెలిసిన క్లినిక్ ఉంటే సంగతి చెప్పి రెస్టిల్ ఒకటి తెచ్చి వేసి నిద్ర పుచ్చాడు. ఏమై ఉంటుంది?

ఎవరింటికైనా వెళ్లొచ్చిందా? వేరే ఫ్లాట్స్ వాళ్ల ఉడ్ వర్క్ ఏమైనా చూసొచ్చిందా? పిల్లల్ని అడిగాడు

లేదు. ఇంట్లోనే ఉంది. రోజంతా టీవీ చూస్తూ ఉంది.

మరి... ఈ గొడవ ఎందుకు రేపింది. ఒకవేళ రేపినా ఇప్పుడు ఉడ్ వర్క్ చేయించాలంటే అరవై డెబ్భై వేలు కావాలి. ఎక్కణ్ణుంచి తేవడం. అదీగాక వాటికి తాళాల గొడవ ఏమిటో..

రెండు రోజులకు సంగతి తెలిసింది. ఆ రాత్రి ఇంటికి వచ్చేసరికి ఏదో దుర్వాసన వస్తోంది. పిల్లలు ఏంటమ్మా అని అడిగితే జవాబు చెప్పడం లేదట. అలాగే కూచుని ఉంది. తను అడిగినా చెప్పలేదు. హడలిపోయి ఇల్లంతా వెతికితే బెడ్‌రూమ్‌లో కప్‌బోర్డ్ నుంచి వస్తున్నట్టుగా అర్థమైంది. దానికి తాళం వేసే వీలుంది. ఇంటి తాళం కప్ప దానికి వేసి ఉంది.

ఏంటీ పిచ్చిపని... బలవంతంగా తాళం వెతికి లాక్కుని తెరిచి చూస్తే పాలిథిన్ కవర్. కోపం వచ్చేసింది.

ఏంటిది?

మీరు తెచ్చిందే. చికెన్.

మరి డీప్ ఫ్రిజ్‌లో పెట్టక ఇక్కడెందుకు దాచావ్?

ఎవరైనా చూస్తే?

చూస్తే?

చూసి చంపేస్తే?....

భయంగా చూశాడు. గబగబా చెప్పింది.

అందుకే చెప్పేది... మీరు ఉడ్ వర్క్ చేయిస్తే అక్కడే రహస్య అరలు చేయించి ఇలాంటివి దాచుకుందామని... రోజులు ఎలా ఉన్నాయని... మీకేం తెలుసు... టీవీ చూడండి తెలుస్తుంది... చంపేస్తారు... గొణుగుతూ ఉండిపోయింది.

ఎప్పుడూ మొహల్లాల్లో ఉండటానికి ఇష్టపడదు. టోలీచౌకీలో ఒక ఫ్లాట్ చీప్‌గా వస్తుందని చెబుతున్నా మనవాళ్ల మధ్యే మళ్లీ ఎందుకండీ. పిల్లలకు వేరేవి తెలవొద్దూ. కాస్త తెలుగోళ్లు ఉండే చోట చూడండి అనంటే ఇక్కడ చూశాడు. అందరితో స్నేహంగా ఉంటుంది. అందరూ స్నేహంగా ఉంటారు. కాని కొత్తగా ఇప్పుడు భయపడుతోంది.

మనం ఒక్కళ్లే అయిపోయామండీ... ఇన్ని ఫ్లాట్లున్నాయ్... ఒక్కళ్లూ మనవాళ్లు లేరే...

హాస్పిటల్‌కు తీసుకెళ్లి తెచ్చాక కూడా చాలా మార్పులు వచ్చాయి. ఇంతకుముందు చిన్నచిన్న పనులకు బయటకు వెళితే బురఖా వాడేది. ఇప్పుడు మానేసింది. జుబ్బాలు దాచేసింది. ప్యాంట్ షర్ట్ వేసుకుని టక్ చేసి వెళ్లాలట. అబ్బాయిలిద్దరి మెడల్లో తావీజులు ఉండేవి. తీసేదాకా ఊరుకోలేదు.

మనం ఎవరమో తెలియకూడదండీ...

తెలిస్తే?

అమ్మో... చంపేయరూ...

ఆ తర్వాత పుస్తకాల వెంట పడింది. వాటిని తీసుకెళ్లి తూకానికి వేసి రావాలట. కథలూ కవిత్వం రాయకూడదట. నా మీద ఒట్టే అని కూచునింది.

ఏం రాస్తే?

భలేవారే. చంపేస్తారండీ బాబూ....

ఏం చంపరు.

అయ్యో.. మీకు తెలియదండీ. మొన్న మీ ఫ్రెండ్‌ని చూళ్లేదు... టీవీలో చూపించారు లేండి... ఒక నలభై యాభై మంది ఆఫీస్‌లో దూరి చంపాలనుకోలేదూ? చంపడం ఎంతసేపండీ నాయనా.... గట్టి పిండాలెవరైనా నాలుగైదు పిడిగుద్దులు కురిపిస్తే చాలు... చచ్చి ఊరుకుంటారు....

టైమ్ రెండయ్యింది. చూసుకొని డోస్ వేశాడు. మందులు పడుతున్నాయి. కాని గుణమే....

బాగా తినిపించండి అన్నాడు డాక్టర్. ఏం తినిపించడం. రెడ్ మీట్ మంచిది కాదంటే మటన్ మానేసి చాలా కాలం అయ్యింది. సముద్రం ఒడ్డున పెరిగి వచ్చిన వారికి ఇక్కడ దొరికే రొయ్యలు నచ్చవు. ఫ్రెష్ చేపలు దొరికినప్పుడు. లేదంటే అదిగో ఆ కాస్త చికెనే. అది కూడా బంద్ చేయించింది.

వద్దు బాబోయ్ వద్దు. తెస్తే ఎవరైనా చూస్తారు. లేని పోని గొడవ...

నీకు పిచ్చెక్కింది.

నాక్కాదు. మీకు ఎక్కింది. రోజులు తెలియడం లేదు. చికెనూ గికెనూ తినకూడదమ్మా. ఇవేమిటి... ఇన్ని గుడ్లు తెచ్చారు. హమ్మ బాబోయ్... ఈ మనిషి నన్నూ నా బిడ్డల్ని నట్టేట ముంచుతాడమ్మా... ఉడ్ వర్క్ చేయిస్తే దాచుకోనన్నా దాచుకుంటానే.... తాళాలు వేసుకుంటానే.... ఇప్పుడు నలుగురూ చూసేలా ఇక్కడ పెట్టి... ఒక్కోటి తీసి నేలకేసి పగలగొడుతూ ఉంది.

ఆ రాత్రి వేరే గొడవేం చేయలేదు. మూడు నాలుగు రోజులు గడిచాయి. గుణం కనిపిస్తుందేమోనని ఉడ్ వర్క్ మొదలేయించాడు. కాని కార్పెంటర్ రెండ్రోజులకు పారిపోయాడు. ఒక్కో కప్‌బోర్డ్‌లో ఏడు అరలు ఉండాలట. అవి ఒకదాని లోపల ఒకటి ఉండాలట. వాటికి తాళాలు ఉండాలట. కూచోబెట్టి అడిగాడు-

ఎందుకు?

ఎండు చేపలు ఇష్టం అని తెలియదా. ఎప్పుడైనా ఊరి నుంచి వస్తే ఎవరి కంటా పడకుండా దాచుకోవద్దూ? గొంతు తగ్గించి రహస్యంగా అంది.

డాక్టర్‌కి ఫోన్ చేసి మందు మార్పించాడు. డోస్ పెరిగిందో ఏమో రోజు రోజుకూ నీరసపడిపోతూ ఉంది.

ఆ రోజు రాత్రి ఆఫీసు నుంచి వచ్చాక మరో పది నిమిషాలకు వాళ్లన్నయ్య వచ్చాడు. సెలవు పెట్టి దర్గాకు వెళ్లి వచ్చాడట. లేమ్మా.. లే అని నుదురు తాకి జబ్బకు నల్లదారం కట్టాడు. కాస్త తినరాదూ అని తెచ్చిన ప్యాకెట్టు విప్పాడు. పామును చూసినట్టు ఉలిక్కిపడింది.

ఏంటివి?

ఖర్జూరాలు...

ఖర్జూరాలా... అరేబియావి కదూ.

అవును. ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ...

అయ్యో అన్నయ్యా... ఇవి మనకు పండవు. మనవి కాదు. మనం తినకూడదు...

తింటే?

తింటేనా? తెలియదా? చంపేస్తారే... చంపేస్తారే... చంపేస్తారే... దేవుడా... ఏమిటి చేయడం...

నుదురు కొట్టుకుంటూ కాళ్లూ చేతులూ విదిలిస్తూ ఇంటినీ భర్తనూ పిల్లలనూ చూసుకుంటూ బతికే ఆ పిచ్చి మాతల్లి తనకు అపసవ్యంగా అనిపించేవాటికి అపసవ్యపు విరుగుడు వెతుక్కుంటూ వేరే ఏ వీలూ లేక స్పృహ... తప్పి.. పో..యిం..ది.

**- మహమ్మద్ ఖదీర్‌బాబు**




# థ్యాంక్యూ...

మెనూ కార్డ్ ముందుకు తోశాడు.

ఫస్ట్‌టైమ్ అలా చేయడం.

ఏంటిది?...

ఆర్డర్ చెప్పు.

నేనా... నేనెప్పుడైనా చెప్పానా... నన్నెప్పుడైనా చెప్పనిచ్చావా?...

ఎందుకు మాటలనడం. ఇప్పుడు చెప్పొచ్చుగా.

తీసుకొని తిరగేసింది. ఏం చెప్పాలో అర్థం కాలేదు. పాపను అడిగింది.

ఏంవే... ఏం చెప్దాం...

దానికేం తెలుసు? తల్లి వైపు చూసి ఫోర్కులతో ఆట కొనసాగించింది. మెనూ కార్డ్ తిరిగి ఇచ్చేస్తూ అంది.

నువ్వే చెప్పు...

సాధారణంగా రెండు నాన్, ఒక వెజ్ కర్రీగానీ నాన్ వెజ్ కర్రీగానీ, ఒక బిరియానీ, కర్డ్ రైస్ చెప్తాడు. స్టాండర్డ్. ఎప్పుడు వచ్చినా అంతే. అలా అలవాటు చేశాడు. వెజ్ నూడుల్స్ ఇష్టం. ఎప్పుడూ అడగలేదు తింటావా అని. గోంగూర మటన్ ఇష్టం. అదీ అడగలేదు ఎప్పుడైనా కావాలా అని. పాపకు వెనిల్లా ఇష్టం. కాని ఎప్పుడూ టూ బై త్రీ బటర్ స్కాచ్ చెప్తాడు.

ఇవాళ ఛాయిస్ తనకు ఇస్తున్నాడు. పెళ్లికి తీసుకెళ్దామని మస్కా వేస్తున్నాడేమో. కల్లో కూడా జరగని పని. నవ్వుతూనే అంది-

పెళ్లికి ప్లాన్ చేస్తున్నావా... చచ్చినా రాను...

అబ్బెబ్బే... అని ఊరుకున్నాడు.

సొంత బాబాయి కొడుకు పెళ్లి. బాబాయి కొడుకే అయినా బాగా చనువు ఎక్కువ. సొంత తమ్ముడి కంటే ప్రేమగా ఉంటాడు. వెళ్లకపోతే ఎలా? ముందు రోజే చర్చ జరిగింది. రచ్చ అనాలేమో.

నేను రానుగాక రాను. మా పిన్నికూతురి పెళ్లికి వెళ్దామంటే నువ్వొచ్చావా? ఆఫీస్‌లో వీలుగాదని ఎగ్గొట్టావ్. కనిపించిన ప్రతి మహాతల్లి మీ ఆయనెక్కడే మీ ఆయనెక్కడే అని అడుగుతుంటే తల ఎక్కడ పెట్టుకున్నానో తెలుసా? ఆ నొప్పి నీకు తెలియాలి. రాను.

పెటేల్మని ఒక్కటి పీకాడు.

కొట్టు. చంపు. రాను గాక రాను.

మళ్లీ ఒక్కటి.

మీ వాళ్లంతా నీ పెళ్లాం ఎక్కడ్రా నీ పెళ్లాం ఎక్కడ్రా అని అడుగుతుంటే అప్పుడు చెప్పు సమాధానం. మీ అక్క నా మీద ఏదో ఎక్కిస్తే పెళ్లికి ఎగ్గొడ్తావేం...

రాత్రి ఇద్దరూ సరిగ్గా నిద్ర పోలేదు. తెల్లారి బ్రేక్‌ఫాస్ట్ మీద అలిగి వచ్చేశాడు. తినూ తినూ తినేసి పో అని తనూ యాక్టింగ్ చేయలేదు. పనేదో చేస్తున్నాడు. సడన్‌గా తేడాగా అనిపించింది. ఒళ్లు తేలిగ్గా అవుతున్నట్టు... స్పృహ తప్పుతున్నట్టు.... తెలియని ఆందోళనగా... దడగా... గుటక పడుతూ... గుండెపోటుకు సూచనలా... కలీగ్‌కి చెప్తే కంగారు పడిపోయి ఆఫీస్ వెహికల్‌లో హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. డాక్టర్ ఎవరో మంచోడే. పల్స్ అదీ చెక్ చేసి- ఏం కాలేదు... సరదా ఉంటే చెప్పండి టెస్టులు రాస్తాను... రెండు మూడు వేలవుతాయి అన్నాడు. ఈసీజీ కూడా వద్దన్నాడు. ఒకటి రెండు గ్లాసులు మంచినీళ్లు తాగమని, తాగనిచ్చి అడిగాడు-

దేనికైనా టెన్షన్ పడుతున్నారా?

మొహమాటంగా చెప్పాడు.

మామూలే. ఇంట్లో చిన్న చిన్న గొడవలు.

అందుకే యాంగ్జయిటీ.

ప్రిస్కిప్షన్ మీద ఏదో టాబ్లెట్ రాశాడు. చింపుతూ అన్నాడు-

దీని కంటే మీకో చిన్న సూఫీ కథ బాగా పని చేస్తుంది. ఒక సూఫీ తన శిష్యులతో రెండేళ్లుగా దేశాటన చేస్తున్నాడట. ఏ ఊరికెళ్లినా ఆదరించేవాళ్లకి కొదవే లేదట. పెట్టే కంచం కడిగే కంచం. ఒక ఊరికెళితే ఆ ఊరి వాళ్లు బాగా తిక్క మీద ఉన్నారట. అసలే వానల్లేక తిండి గింజలకు నానా అవస్థలు పడుతుంటే పడి మేయడానికి వచ్చారర్రా అని కర్రలు తీసుకుని వెంటపడ్డారట. సూఫీ తన శిష్యులతో పరిగెత్తుకుంటూ ఊరు దాటి ఒక్కసారిగా మోకాళ్ల మీద కూలబడి దేవుడికి పదే పదే కృతజ్ఞతలు మొదలుపెట్టాడట. శిష్యులు ఆశ్చర్యపోయి వ్యంగ్యాలు పోతూ- ఎందుకు స్వామీ దేవునికి కృతజ్ఞతలు... ఈ ఊరి వాళ్లు అన్నం పెట్టనందుకా అని అడిగారట. కాదురా... ఇన్నాళ్లూ అన్ని ఊళ్ల వాళ్లు అన్నం పెట్టినందుకు... పెట్టినన్నాళ్లు దేవుని దయ తెలియలేదు... ఇప్పుడే కదా తెలిసింది అని మళ్లీ కృతజ్ఞతలకు మళ్లుకున్నాడట. అర్థమైందా...

చూస్తూ ఉన్నాడు.

ఇంత పెద్ద సిటీ. రోడ్లు బాగుండవు. ట్రాఫిక్కు. ఎక్కడ పడితే అక్కడ గుంటలు తవ్వేసి ఉంటారు. మేన్‌హోళ్లు. ఇక ఈ మెట్రో రైలు పనులతో అదో తలనొప్పి. చాలక చైన్ స్నాచర్లు. చీటర్లు. ఫ్రాడ్ మాస్టర్లు. నోట ఏది పెట్టినా కల్తీ ప్లస్ పొల్యూషన్. తోడు పనిచోట రాజకీయాలు ప్రాంతాలను బట్టి స్పర్థలు. ఇవి ఇచ్చే స్ట్రెస్ చాలదా... మళ్లీ ఇంట్లో కూడా స్ట్రెస్ జనరేట్ చేస్తున్నారా?

గ్యాప్ ఇచ్చి అన్నాడు.

థ్యాంక్‌ఫుల్‌గా ఉండండి. మీకో పెళ్లాం ఉన్నందుకు థ్యాంక్‌ఫుల్‌గా ఉండండి. మీ పెళ్లానికి మీరున్నందుకు ఆమెను థ్యాంక్‌ఫుల్‌గా ఉండమనండి. మీ ఇద్దరూ ఇవాళ డిన్నర్‌కు వెళ్తే గనక అంతటి మహద్భాగ్యం కలిగించిన దేవునికి థ్యాంక్‌ఫుల్‌గా ఉండండి. అసలు ప్రాణాలతో ఉన్నందుకు మొదట థ్యాంక్‌ఫుల్‌గా ఉండండి సార్... ఈ గొడవలన్నీ దూదిపింజల్లా తేలిపోతాయి...

సాయంత్రం కిక్కురుమనకుండా నేరుగా ఇంటికి చేరుకుని డిన్నర్ ప్లాన్ చేశాడు. కాని పెళ్లికి ఐస్ చేస్తున్నాడేమోనని అనుమానపడుతోంది. చెప్పేశాడు-

పెళ్లికి వద్దులే. అదేం పెద్ద విషయం కాదు. తర్వాత చూద్దాం.

ఆశ్చర్యంగా చూసింది.

అదేంటి?

అవును. అలగడానికీ సాధించడానికీ బోలెడన్ని చాన్సులు వస్తాయి. కాని పెళ్లి మాటిమాటికీ చేసుకోరుగా. మీ పిన్నికూతురి పెళ్లికి నేను రావాల్సింది. తప్పు చేశాను. సారీ. దానికి ఇది విరుగుడు. ఇక ఇంతటితో వదిలేద్దాం.

నవ్వింది.

ఇంటికి ఎటు నుంచి వచ్చావ్? ఏదైనా తొక్కి వచ్చావా ఏంటి?

ఇక ఈ దెప్పిపొడుపు మాటలు వదిలేద్దాం. ప్లీజ్. విసుగ్గా ఉంది. బయట ఉన్న తలనొప్పులు దేశాన ఉన్న తలనొప్పులు చాలవా పడ్డానికి. నువ్వూ నేనూ కూడా ఎందుకు బాధించుకోవడం. హ్యాపీగా ఉందాం సరేనా. గోంగూర మటన్ చెప్పనా?

సీరియస్‌గా చూసింది.

నిజం చెప్తున్నావా?

నిజం.

ఫోర్క్‌తో ఖాళీ ప్లేట్‌ను రెండు సార్లు మోగించింది.

ఏం అక్కర్లేదు. వెళ్దాంలే.

పర్లేదు.

వెళ్దాం అంటున్నాగా.

వెజ్ నూడుల్స్, వైట్ రైస్, గోంగూర మటన్ చెప్పాడు. చివర్లో వెనిల్లా తెమ్మని కూడా. మళ్లీ అన్నాడు.

మీ అమ్మ మీ అన్నయ్య దగ్గర ఉండటానికి ఇబ్బంది పడుతున్నదని తెలుసు. కావాలంటే కొన్నాళ్లు మన దగ్గర పెట్టుకుందాం. డ్రామా కాదు. నిజంగానే చెప్తున్నా. ఇంకా నీకేదైనా మనసులో ఉంటే అది చెప్పకుండా సాధించే పనిలో మాత్రం దిగకు. వినడానికి సిద్ధంగా ఉన్నాను. అలాగే నాదో రిక్వెస్ట్. అమ్మను చూడ్డానికి ఊరికెళ్లి చాలా రోజులైంది. నువ్వు ప్లాన్ చేస్తే రెండ్రోజులు ఉండి వచ్చేద్దాం.

తల కిందకు వంచి ఫోర్క్‌ను టేబుల్ మీద గుచ్చుతూ అలాగే ఉండి తలెత్తి చూసింది.

మొగుడూ పెళ్లాల కళ్లు. ఏం మాట్లాడుకుంటాయో ఎవరికి తెలుసు.

మెల్లగా నవ్వి తేలిక పడింది.

సరే. పాపకు నెక్స్ట్ వీక్ ఎగ్జామ్స్ ఉన్నాయ్. అవి అయ్యాక వెళ్దాం. ఈలోపు బీపీ మెషీన్ ఒకటి పంపు. ఎన్నాళ్లో నుంచో అడుగుతోందిగా. పాపం సంతోషపడుతుంది.

థ్యాంక్యూ...

ఓయబ్బా... థ్యాంక్యూ...

టూ వీలర్ మీద మధ్యలో కూచోబెట్టుకుంటే పాప దారిలోనే నిద్రపోయింది. ఫ్లాట్‌కు వచ్చాక జాగ్రత్తగా ఎత్తుకొని నిద్రపుచ్చి చీర మార్చుకుని నైటీ తొడుక్కుంది. ఇందాక కావాలని పెట్టుకోలేదు. ఇప్పుడు ఫ్రిజ్ తెరిచి పాలిథిన్ కవర్‌లో దాచిన ఆ కాసిని విరజాజులని తలలో తురుముకుంది. హాల్లోకొచ్చి అంది-

ఇంకా టీవీ ఎంత సేపు చూస్తావ్... రారాదూ?

ఊ..ఊ.. అంటూ టీవీ ఆఫ్ చేసి లేచి వచ్చాడు.

నడుం మీద చేయి వేసింది.

పొట్ట పెరిగింది. తగ్గించరాదూ?

తగ్గిస్తా.

కొంచెం ట్రై చేసి ఇలాగే హ్యాపీగా ఉందాం. సరేనా?


సరే.

థ్యాంక్యూ... ఈసారి కాలు వేసింది.

మొగుడూ పెళ్లాల చేష్టలు.

ఆ తర్వాతి చేష్ట ఏమిటో మనకు మాత్రం ఏం తెలుసు?

**- మహమ్మద్ ఖదీర్‌బాబు**



గమనిక:

20 కథల ఈ మెట్రో సిరీస్ ఇంతటితో ముగిసింది. ఆదరించిన పాఠకులకు కృతజ్ఞతలు.

- రచయిత, 9701332807